# పడమట సూర్యోదయం

## స్వాతి శ్రీపాద





శ్రీ

కౌముది

మీ ముంగిట్లో సాహితీ వెన్నెల

www.koumudi.net



ప్రచురణ సంఖ్య: 35




## వయసుపొద్దు వాలే వేళ.. ఒంటరి పోరాటం

### మొదలైంది ఇప్పుడే..!

### 1

చక్కని సాయంత్రం. అటు చలిగానూ లేదు అలాగని ఇటు వేసవి తాపమూ లేదు. మరొక్కసారి ఇల్లంతా తిరిగి అలంకరణ చూసుకుంది వసంత లక్ష్మి. శ్రీ పుట్టినరోజది..

అతను ఇంటికి వచ్చేసరికి పెద్ద సర్ప్రైజ్ ఇవ్వాలన్న ఆలోచన ఈ హడావిడికి కారణం. శ్రీ సరదాలు తనకు బాగా తెలుసు. చిన్నప్పటి స్నేహితులతో నవ్వుతూ తుళ్ళుతూ, బాల్యాన్ని నెమరువేసుకుంటూ కూనిరాగాలు తీస్తూ, కవితలల్లుతూ కథలు చదువుతూ... ఎంతిష్టమో..... మామూలుగా ఐతే సెలవు రోజుల్లోనే కులుస్తుంటారు మిత్రులంతా, కాని ఈ రోజు ప్రత్యేకత మళ్ళీ మళ్ళీ రాదుగా... అలసి సొలసి ఆఫీస్ నుండి శ్రీ ఇంట్లో అడుగు పెట్టగానే అందరూ బర్త్డే విషెస్ చెప్పడం ఎంత బాగుంటుంది! పెళ్ళి రోజు పార్టీ ఇచ్చి నెలైనా దాటలేదు. నిన్నగాక మొన్నలా ఉంది, అప్పుడే ఇరవై ఆరేళ్ళు.... నమ్మలేకపోతున్నా నమ్మక తప్పదు. ప్రత్యక్ష సాక్ష్యంలా పాతికేళ్ళ సుమ ఏడాది క్రిందటే ఫాషన్ డిజైనింగ్‌లో పిజి చేసి లండన్‌లో ఉద్యోగం చేస్తోంది.

"మంచీ చెడు తెలిసాక మన ప్రమేయం అనవసరం. వాళ్ళ దారి పూర్తి స్వేచ్ఛ నివ్వటమే మనమిచ్చే పెద్ద బహుమానం. నా కూతురి మీద నాకు గట్టి నమ్మకం తనకు తగ్గవాడిని ఎంచుకోగలదు" అంటాడు శ్రీ.

నిజమే ప్రతి విషయాన్నీ తనదైన దృష్టి కోణంలోంచి చూసే సుమ తన జీవన సహచరుణ్ణి తనంతట తానుగా ఎంచుకోవడమే సరయినది. ఇహ సుమంత్ - పూనె ఫిల్మ్ ఇన్స్టిట్యూట్లో నటనలో ట్రెయినింగయి ముంబై సినిమాల్లో తలమునకలవుతున్నాడు. ఇంకా ఇరవై నాలుగైనా నిండని సుమంత్ మీద ఎన్ని కథలో - ఎందరి కళ్ళో.... "అన్నీ గాసిప్స్.. మాఫీల్డ్‌లో ఇవి మామూలే... డోంట్ వర్రీ. నాకెవరైనా నచ్చే వరూధిని కనిపిస్తే ముందుగా మీకే చూపుతాను" అంటుంటాడు. నిజంగానే ఇంత తొందరగా పిల్లలు పెద్దవాళ్ళయిపోయారా? ఇంతకు ముందు... అబ్బే ఇంతకుముందే పొత్తిళ్ళలో పాపల్ని గుండెలకు హత్తుకున్న భావన ఇంకా కొత్త కొత్తగానే ఉంది. సుమను స్కూల్లో దింపిరావడం, సుమంత్ క్రికెట్ ఆడి కిటికీ అద్దాలు పగలుకొట్టడం... అంతలోనే రెక్కలు కట్టుకు ఎగిరిపోయారు.

తలతోపాటు ఆలోచనల్నూ విదిలించి మరోసారి బఫే అరేంజ్‌మెంట్స్ సరిచూసుకుంది. కొత్తేమీ కాకపోయినా - పని వాళ్ళు ఎంత ఫర్ఫెక్ట్‌గా అరేంజ్ చేసినా ఫైనల్‌గా అన్నీ ఒకసారి దగ్గరుండి చూసుకోవటం వసంతలక్ష్మి అలవాటు. చక్కటి మిత్రులు, సరదా సరదా మనస్తత్వాలు మధ్య మధ్యన కూనిరాగాలూ ఒకరినొకరు ఉడికించడం, అంత్యాక్షరి పాటలపోటీలు, ఎన్ని సంవత్సరాలు గానో అలవడిన జీవనశైలి అది.

క్రిస్టల్ ఫ్లవర్ వేజ్‌లో వికసిస్తున్న గులాబీలు వాటి రంగుల్ని వేన వేల కోణాల్లో వెనక్కి తిప్పికొడుతూ అద్దాలు, పరిమళాలు వెదజల్లుతున్న రూం ఫ్రెషనర్లు... ఇల్లు చూడగానే శ్రీ అలసటంతా ఎగిరిపోవాలి. యాభై దాటి రెండేళ్ళయినా శ్రీ అంత వయస్సున్నట్టు అస్సలు కనిపించడు. చలాకీగా కనిపించే వ్యక్తిత్వం, హుందాతనం, ముఖ్యంగా హస్తవాసి ఉన్న డాక్టర్‌గా పేరు ప్రఖ్యాతలు... "నా రహస్యం, నా విజయం. దానికి పునాది, నాంది అన్నీ నువ్వే"

"అతనికీ అతని మిత్రులకే కాదు నేను ఏం చేసినా అది నాకోసం కూడా" అనేదామె మనసారా. అందుకే మేడ్ ఫర్ ఈచ్ అదర్ అనేవారు అందరూ. ఆ ఇల్లు ఓ ప్రేమాలయం, ఎల్లలు లేని ప్రేమాభిమానాలు, తమదైన రీతిలో సెటిలయిన పిల్లలు.. ఇంకేం తక్కువ అనిపించే జీవితం.... ఇంట్లోనూ జీవితంలోనూ ప్రతి మూలా వసంత లక్ష్మి సౌందర్య పిపాస తొంగిచూస్తూనే ఉంటుంది. ఇలా డిగ్రీ పూర్తవుతూనే అలా పెళ్ళయిపోయింది వసంతకు. అయినా ఆసక్తిని చంపుకోలేక ఎం.బి.ఏ పూర్తిచేసింది. చిన్నదో చితకదో ఉద్యోగం చేద్దామనుకునే లోగానే పిల్లలు. నిజానికి ఓ పక్క సుమ, ఓ పక్క ఎం.బి.ఏ తో రెండూ పడవల ప్రయాణం సాగించిందామె. అందుకే కొన్నాళ్ళు పిల్లల్ని  చూసుకోవడం ఉత్తమం అనిపించింది. ఆ కొన్నాళ్ళు కొన్నేళ్ళుగా మారి ఇరవై ఆరేళ్ళు పూర్తయాయి. ఉద్యోగానికి పరుగెత్తాల్సిన అవసరమూ పెద్దగా కనిపించలేదు. పిల్లల అవసరాలు తీరుస్తూనే - కుట్లు అల్లికలతో పాటు వంటా వార్పూ, ఇంటీరియర్ డెకరేషన్‌లో డిప్లొమా, బోన్సాయి మొక్కల పెంపకం ఇలా నేర్చుకున్న వాటికి ఓ అంతనేది లేదు. అందుకే ఇల్లు ఓ ఆర్ట్ ఎగ్జిబిషన్‌లా ఉంటుంది. 'శ్రీ సహాయ సహకారాలే నన్ను ముందుకు నడిపిస్తాయ'ని వసంత అంటే, 'నా ప్రతి విజయం నీడా వసంతే' అని అతనంటాడు.

అలాంటిది ఈ మధ్యే కాస్త ఒంటరిగా ఫీలవడం మొదలు పెట్టింది వసంత. పిల్లలకు దూరంగా వెళ్ళిపోవడం, డాక్టర్‌గా మంచి పేరు ప్రఖ్యాతులతో పాటు శ్రీ పనికూడా పెరగడం, అంతేనా.. ఒక్కోసారి రాత్రంతా అతని కోసం ఎదురు చూస్తూ డిన్నర్ స్కిప్ చెయ్యటం ఎన్నిసార్లు జరగలేదు.

ఏదో చెయ్యాలన్న తపన ఖాళీగా ఉంటే బుర్రను నమిలేసే పిచ్చి పిచ్చి ఆలోచనలు శ్రీవే ఎన్ని సార్లు సతాయించేదో.... కానీ అతనికీ విషయం ఆలోచించే తీరికేదీ? నలభై ఏడు దాటుతున్నా వసంత సన్నగా చెక్కిన పాలరాతి శిల్పంలా అందంగా ఉంటుంది. శరీరమే కాదు మనస్సు కూడా. అందరిలా చిన్న చిన్న కీచులాటలు కూడా వాళ్ళింట్లో లేవు. నా ఇల్లు, నా భర్త, నా పిల్లలు అనుకోవడమే ఎంతో సంతృప్తి ఆమెకు. ఇంట్లో ఉన్నానని, పనివాళ్ళున్నారని ఏనాడు బద్ధకించేది కాదు. ఇరవై నాలుగ్గంటలూ ఏదో ఒకటి బొంగరంలా తిరగడం, ఒక గంట యోగా, వాకింగ్ ఇవన్నీ ఆమెకు అందంతో పాటు ఆరోగ్యాన్నీ ఇచ్చాయి.

"అబ్బో! అప్పుడే ఆరయింది"

ఫైనల్ చెకింగ్ ముగించి స్నానానికి వెళ్ళింది. పార్టీకి పిలిచింది నాలుగు జంటల్ని. మంచి దగ్గరి మిత్రులు. "ఈ రోజైనా శ్రీ తొందరగా వస్తే బాగుండు - కనీసం గెస్ట్‌లు రాకముందు---"

పాలమీగడలాంటి క్రేప్ శారీ - దానిమీద సున్నితంగా కనిపించే ప్రింట్... జాగ్రత్తగా కుచ్చెళ్ళు సరిచేస్తుకుంటుంటే రింగైంది ఫోన్.

"హలో మామ్ డాడ్ ఇంకా రాలేదా?" సుమ పలకరింపు.

"నీకు తెలీనిదేముంది... మామూలేగా.."

"ప్రిపరేషన్ పూర్తయిందా?"

"దేనికి?"

"సర్‌ప్రైజ్ పార్టీకి.."

"సుమా..."

"నేను నీ కూతుర్ని మమ్మీ... ఓకే బై.. సూన్ ఐల్ గివ్ యు ఎ గుడ్ న్యూస్ బై..."

"ఐయామ్ ప్రౌడ్ ఆఫ్ యు డార్లింగ్..." చెమ్మగిల్లిన తల్లి మనసది.

చీరకు తగ్గట్టు పర్ల్‌సెట్ సెలక్ట్ చేసుకునేలోగా సుమంత్ ఫోన్.

"హాపీబర్త్‌డే మామ్..."

"నాకా?"

"యా, నువ్వొకటీ డాడ్ మరొకటీ కాదుగా.."

"ఊ చెప్పు..."

"ఏం చెప్పను, నీ ఫేవరెట్ చీరలో తళతళలాడిపోతున్నావని చెప్పనా... సంతూర్ మమ్మీవని చెప్పనా. డాడ్ తో మాట్లాడానిప్పుడే.. హి విల్ బి హోం ఎట్ ఎనీ మూమెంట్... ఎంజాయ్ ద పార్టీ బై మమ్మీ"

ఫోన్ పెట్టిందో లేదో శ్రీ అడుగుల చప్పుడు.

"హాయ్! మెనీ హాపీ రిటర్న్స్"

తలుపు తీస్తూనే అతన్ని తీగలా అల్లుకుపోయి - పెదవులపై పెదవులానించింది. కానీ ఆశించినంత చురుకుదనం అతనిలో కనిపించలేదు.

"రోజంతా పేషంట్లేనా? బిజీగా గడిచిందా? బాగా అలసిపోయారా?" ఆదుర్దాగా అడిగింది. అనవసరంగా పార్టీ అరేంజ్ చేసానా అనికూడా అనుకుంది. అయినా అరేంజ్ మెంట్స్ ఒక్కరోజులో జరిగేవి కాదు. ఎన్నివారాల ప్లానింగో అవసరం.

"చాలా బిజీ" అతని పెదవుల మీద చిరునవ్వు.

"ఊపిరి పీల్చుకునే తీరికే లేదు. ఓకె. మనవాళ్ళెప్పుడు వస్తున్నారు?" అంటే కింద అరేంజ్ మెంట్స్ చూసే వచ్చాడన్నమాట.

"ఓ గంటలో.."

"కాస్సేపు రెస్ట్ తీసుకుంటారా? ఇంకా టైముందిగా?"

"ఇట్స్ ఓకె, ఇప్పుడు పడుకుంటే ఇక లేవలేనేమో!"

"మారుమాట్లాడకుండా క్షణంలో ఆరెంజ్ జ్యూస్ అందించింది.

"థాంక్యూ" పెద్ద రిలీఫ్‌తో గ్లాస్ అందుకున్నాడు.

"గెట్ రెడీ శ్రీ..కిందకెళ్ళి చూస్తానోసారి"

నిజానికి అంత పెద్దగా చూసుకోవలసిన అవసరమే లేదు. ఆ ఇంటి పనివాళ్ళంతా ఆ పనుల్లో నిష్ణాతులే.

నెమ్మదిగా బ్యాక్ యార్డ్‌లోకి అడుగు పెట్టి మల్లెతీగ అల్లుకున్న సిమెంట్ స్థంభానికి ఆనుకుంది. ఎంత పరిపూర్ణమయిన జీవితం! అప్పుడే వికసిస్తున్న మల్లెల సువాసనలా... "ఇది మల్లెల వేళయనీ..." అప్రయత్నంగానే పెదవులు కదిలాయి. పరిసరాలతో మమేకమయిపోతే సమయమే తెలియదు. తప్పదన్నట్టుగా వసంత లోపలికి అడుగుపెడుతూండగానే పై నుండి శ్రీ దిగుతుండడం, డోర్ బెల్ సంగీతం ఒకేసారి జరిగాయి. ఆపైన సమయానికి రెక్కలు కాదు రాకెట్లు మొలిచాయా అనిపించింది. వసంత క్లోజ్ ఫ్రెండ్స్ యామిని, స్వప్నిక కపుల్స్, శ్రీ బాల్య మిత్రులు జయరాం, రంగాచారి కుటుంబాలు.

యామిని బ్యాంక్ ఆఫీసర్, స్వప్నిక టెక్స్‌టైల్ డిజైనర్. జయరాం, రంగాచారి శ్రీ బాల్యమిత్రులు. జయరాం సాంస్కృతిక శాఖ డైరెక్టర్, రంగాచారి సాఫ్ట్‌వేర్ ఇంజినీర్. ఏదో ఒక సందర్భంగా ఈ అయిదు జంటలు అడపాదడపా కలుసుకోవడం గత ఇరవైఏళ్ళుగా జరుగుతున్నదే ఒకరి తరువాత మరొకరు పదినిమిషాల్లో సరిగ్గా సమయానికి వచ్చి చేరారంతా. ఆప్యాయంగా పలకరింపులు,

వేళాకోళాలు, ఆటపాటలు సమయమే మంచులా కరిగిపోయింది. సరదాగా అంత్యాక్షరి ఆరంభించారు. మామ మామా మామా అంటూ ప్రారంభించి ఒకటే అల్లరి. పాటకు తోడు డాన్సులు.. తంబోలా ఆట మరో గంట. అందంగా అలంకరించిన కేక్ కేరింతల మధ్య జరిగింది. "యాభై రెండేళ్ళకే ఏమిటా సీరియస్‌నెస్? వియ్ షుడ్ ఎంజాయ్" మిత్రులంతా కేక్ తినిపించడంతో పాటు శ్రీ మొహానికి రుద్దేశారు. కోలాహలంగా డిన్నర్ ముగిసేసరికి రాత్రి పన్నెండయ్యింది. రిటర్న్ గిఫ్ట్ బ్యాగ్ ప్రతి కపుల్‌కి అందించి, గుడ్ నైట్ చెప్పి ఇద్దరూ పూర్తిగా అలిసిపోయి బెడ్‌రూంలో అడుగుపెట్టేసరికి ఒకటిన్నర దాటింది. వెంటనే వేడి వేడి నీళ్ళతో స్నానం చేసి నైట్ డ్రెస్ బటన్స్ పెట్టుకుంటూ వచ్చాడు శ్రీ.

"బాగా అలిసిపోయారా?"

"అంతా ఇంతా కాదు పూర్తిగా.."

అది వసంత ఆశించని సమాధానం.

ఎప్పుడా ప్రశ్న అడిగినా కొంటెగా నవ్వుతూ" అబ్బే, ఎక్కడ ఇంకా అసలు పని పూర్తికానిదే" అనే శ్రీ తనేనా ఈ మాట అంట. విస్తుపోవడం ఆమె వంతైంది అంతలోనే అర్థం కాని ఆదుర్దా, "శ్రీ" మాటలు చెప్పలేని భావాలెన్నో ఆస్వరంలో వ్యక్తమయాయి.

"అంతగా వర్రీ అవకు. ఈ మధ్యన నిద్ర సరిపోవడంలేదు. కాస్సేపు పడుకుని లేస్తే.... ఐ విల్ బి ఆల్ రైట్"

"అంతేనా?"

"అంతే చెపుతున్నాగా...."

ఆప్యాయంగా ఆమెను దగ్గరకు లాక్కుని చెక్కిళ్ళు నిమిరాడు.

"చాల్లెండి.. ఈ పనులకేం తక్కువలేదు. వెళ్ళి పడుకుంటే క్షణంలో ఓ అరగ్లాస్ పాలు తెస్తాను"

చకచకా కదిలింది వసంత. అన్నట్టుగానే సరిగ్గా ఐదు నిమిషాల్లో తిరిగి వచ్చేసరికి విశాలమైన బెడ్‌మీద ఓ పక్కకు తిరిగి పడుకుని ఉన్నాడు శ్రీ

"శ్రీ"

సమాధానం లేదు.

"పాపం, ఎంత అల్సిపోతే ఇంత గాఢనిద్రలోకి జారుకుంటాడు. శ్రీ టేక్ రెస్ట్" కాళ్ళ దగ్గరున్న బెడ్ షీట్ కప్పి పక్కన ఒదిగి పడుకుంది వసంత.

✡ ✡ ✡

వెలుగు వెల్లువలు ప్రవహిస్తూ తెల్లారింది. మసక తుంపర పడుతూనే ఉంటే బాగుండుననిపించింది వసంతలక్ష్మికి. యాధాలాపంగా పక్కకు తిరిగి శ్రీ కోసం వెతుక్కుంది. ప్చ్!

నిజమేనా? జరిగింది నిజమేనా?

ఎదురుగా శ్రీ ఫోటో.

అప్రయత్నంగానే వసంత కళ్ళల్లో నీళ్ళు.

గడచిన నెలరోజులు ఒక పీడకలలాగా మారిపోతే ఎంతబాగుండు. శ్రీలేని శూన్యం మనసులోంచి జీవితంలోంచి తొలిగేదెలా? ఒళ్ళంతా సుత్తితో కొట్టినట్టు ఒకటే నొప్పి. లేచి బ్రష్ చేసుకుందామని కూడా అనిపించడం లేదు. చిక్కులు పడిన జుట్టు సరిగా దువ్వుకుని ఎన్నాళ్ళయిందో.

"కాఫీ తాగాలి వెంటనే....."

పిల్లల ముందు కళ్ళనీళ్ళు పెట్టుకోకుడదని ఎంత ధైర్యాన్ని కూడదీసుకుందో.... ఆ ధైర్యం ఎక్కడినుంచి వచ్చిందో భగవంతుడికే తెలియాలి. శ్రీలేని జీవితం... నిజంగా బ్రతికేఉన్నానా? నా గుండె ఎందుకు ఆగిపోలేదు? నెల్లాళ్ళుగా ప్రతి క్షణం ప్రతి ఆలోచన అతని చుట్టూనే.. ఆలోచనల్నుండి బయట పడేస్తూ ఫోన్ రింగ్..... ఈ నెల్లాళ్ళుగా ఫోన్ మోగి మోగి ఆగిపోతుందే తప్ప ఆమె ఒక్కరోజయినా లిఫ్ట్ చెయ్యలేదు. ఆన్సరింగ్ మెషిన్ చేస్తే అన్నీ ఓదార్పు మాటలే. చివరకు యామిని, స్వప్నికలతో కూడా మాట్లాడాలనిపించటంలేదు. యాదగిరి, రంగాచారి ఎన్నిసార్లు వచ్చినా వాళ్ళను చూసేందుకు ఇష్టపడలేదు. సుమ, సుమంత్‌తో రోజూ గొడవే.

"మమ్మీ నువ్వు ఇదివరకులా లేవు పోనీ నేను వచ్చెయ్యనా"

"లేదు సుమా, కొంచెం జలుబు అంతే"

"మమ్మీ నువ్వలా మౌనంగా ఉంటే నాకు బాగుండదు, పోనీ, ఏదో ఒక జాబ్ అక్కడ దొరక్కపోదు వచ్చెయ్యనా?" సుమంత్ ఆవేదన.

"వద్దు సుమంత్.. ఇట్ టేక్స్ టైం అంతే..."

అంతేనా ప్రామిస్ చేసే వరకు వదల్లేదు ఇద్దరూ - రోజూ ఏదో ఒకటి తింటానని.

"వంటమనిషి వస్తోందిగా?"

"వస్తోంది" అబద్ధం. దాన్ని మాన్పించేసి పదిరోజులైంది.

"టేక్ కేర్ మమ్మీ.. వి ఆల్ ఆర్ విత్ యూ..."

కాఫీ తాగి మళ్ళీ బెడ్ మీద వాలింది. దాదాపు రోజుకు ఇరవై మూడు గంటలు బెడ్ మీదే - గత నెలరోజులుగా...

శ్రీ ఇంత మోసం చేసి ఎలా వెళ్ళిపోయాడు.... తనెలా బ్రతకాలనుకున్నాడు. గత పాతికేళ్ళగా ప్రతి క్షణం - ప్రతి కణం అతనికోసం అతనిదే లోకం అన్నట్టుగా బ్రతికిందే..

ఇలా వంటరిగా వదిలేసి... కళ్ళు మసకబారాయి.... కన్నీళ్ళు ప్రవాహాలయాయి. ఇప్పుడు పడుకుంటే లేవలేనేమో అన్న మనిషి మరిక లేవడని ఎవరు కలగంటారు? మంచి పేరున్న హస్తవాసి ఉన్న డాక్టర్.. ఇలా మాసివ్ హార్ట్ ఎటాక్‌కి లొంగిపోతాడని ఎవరనుకుంటారు?

శ్రీ..ఎలా ... ఎలా బ్రతకను?

✡ ✡ ✡

"హలో" బలహీనంగా సన్నగా వణికింది వసంత స్వరం. రెండు నెలల తరువాత మొదటిసారి ఫోన్ ఆన్సర్ చేస్తోంది. అది స్వప్నిక కాల్. అప్పుడే నిద్రలేచినట్టుందా స్వరం.

"వసంతా... నువ్వేనా?"

"చెప్పండి"

"చెప్పేందుకేం లేదు.... యామిని నేను... మనందరం ఒకసారి కలుసుకుందాం."

అనవసరపు ఓదార్పులు జాలి లేవామె స్వరంలో.

కొంచెం కుదుట పడింది వసంత.

"ఎక్కడ?"

"ఎక్కడైనా సరే!"

జీవితం ఎప్పుడే మలుపు తిరుగుతుందో ఎవరికీ తెలియదు. ఎదురు చూడని ఘటనల సమాహారమే కదా జీవితం.

ఒక్కసారి గుండెలకు హత్తుకుని ఓదార్చాలని వాళ్ళందరికీ ఎంతబలంగా అనిపిస్తుందో.... మిత్రులతో సేదతీరాలని వసంతకూ అంతగానూ అనిపిస్తోంది. రెండు నెలలుగా ఎవరితోనూ పెదవి విప్పి మాట్లాడిందే లేదు.

"మీ ఇంటికి రమ్మంటావా? రావాలని మేం నలుగురం ఎన్నాళ్ళుగానో చూస్తున్నాం"

"నాకెవరితోనూ మాట్లాడాలనిపించడం లేదు."

"మాకు మాట్లాడాలని ఉంది వసంతా"

"ఓ జీవచ్ఛవంలా ఉన్న నాతో ఏం మాట్లాడతారు?"

"జీవం పొయ్యాలనే మా తాప్రతయం. మీరిలా ఉంటే పిల్లలనెవరు ఓదారుస్తారు?"

"..........."

"ఓకే. ఒక గంటలో మేమక్కడ ఉంటాం" ధ్రుఢ నిశ్చయం వినిపించింది యామిని స్వరంలో.

"యామినీ ప్లీజ్, ఐ నీడ్ సంమోర్ టైం.. టు మీట్ ఎనీ వన్ ఆర్ టూ టాక్..." ఆమె స్వరంలో ఆర్ధ్రత.

చివరకు మిత్రులు ఆమెను కన్విన్స్ చెయ్యడంలో విఫలులయ్యారు. కాలమే మాపగల గాయమది. హఠాత్తుగా ఆకాశంలో విహరిస్తున్న విమానంలోంచి బయటకు విసిరేసినట్టుందామె పరిస్థితి. విపరీతమైన దిగ్భ్రాంతి... భయం.

"నేనే ఫోన్ చేస్తాను ప్లీజ్"

ఇహ లాభం లేక... చివరకు ఒక ఫ్లవర్ బొకే - ఓ గ్రీటింగ్ కార్డ్, నాలుగైదు పుస్తకాలు పంపించి ఊరుకున్నారు.. బలవంతాన స్వంతవిషయాల్లో తలదూర్చడం ఇష్టం లేకపోయినా ఇలా వసంత వంటరిగా ఏమైపోతుందోనని బెంగపడిపోయారు. అపురూపమైన ఆది దంపతుల్లా ఉండేవారు, ఇప్పుడు వసంత ఇలా... అదో పెద్ద షాక్ అందరికీ అయినా ఎవరూ ఏమీ చెయ్యలేని స్థితి. ఎవరికి వారుగా బయటకు రావలసిన ఊబి.

దాదాపు మరో రెణ్ణెల్ల తరువాత కానీ వసంత గడపదాటి బయటకు రాలేదు. ఆ రోజు శనివారం రాత్రి, బిర్లా మందిర్‌లో జనం తిరనాళ్ళలా దర్శనం చేసుకుని వెళ్ళిపోతున్న వేళ, ముందుకు వెళ్ళబోతున్న యామిని చటుక్కున ఆగింది. వెనకనించీ చూసినా మోకాళ్ళు దాటిన వసంత జడ ఎవరు మర్చిపోగలరు? పరుగులాంటి నడకతో వసంతను చేరి, రెయిలింగ్ పట్టుకు నుంచుని ఎలెక్ట్రిక్ కాంతుల్లో సిటీని చూస్తున్న ఆమెను సుడిగాలిలా చుట్టేసింది.

"వసంతా" ఏడుపొక్కటే తరువాయిలా ఉందామె స్వరం. చక్కనమ్మ చిక్కినా అందమే అన్నట్టూ దాదాపు పదికిలోక బరువు తగ్గిన వసంత సన్నగా పాలిపోయి, మెరుపు తగ్గిన వెండీ తీగలా ఉంది. ఎప్పటిలానే కట్టు, బొట్టు ఉన్నా ఆ కళ్ళలో వెయ్యి సూర్యుల వెలుగేదీ? కళ్ళ కింద నల్లని వలయాలు విషాదాన్ని దిగమింగుతూ వణుకుతున్న పెదవులు.

ఇన్నాళ్ళుగా దిగులు పడ్డ మనసు స్వయంగా ఓదార్చుకుంది. "నా కెవ్వరి సానుభూతీ అవసరంలేదు. శ్రీ శారీరకంగా లేకపోవచ్చు గాక అతను నన్నొదిలి ఎక్కడకూ పోడు... పోలేడూ.... హి ఈజ్ విత్ మీ" ఆ భావనే ఆమెకు వెయ్యి ఏనుగుల బలాన్నిచ్చింది. ఆ రోజు గుర్తు చేసుకునే స్థైర్యాన్నిచ్చింది.

ఆ రోజు - సరిగ్గా అయిదునిమిషాల్లోనే గోరువెచ్చటి పాలు తీసుకుని బెడ్‌రూం లోకి వెళ్ళింది వసంత.

"శ్రీ"

ఉలుకూ పలుకూ లేకుండా ఓ పక్కకు తిరిగి పడుకుని ఉన్నాడు. సమాధానం లేదు.

"ఎంత అలిసిపోతే ఇంత గాఢనిద్రలోకి వెళ్ళిపోయి ఉంటాడు. టేక్ రెస్ట్ శ్రీ" వెండి గ్లాస్ టేబుల్, కాళ్ళ దగ్గరున్న బెడ్ షీట్ కప్పిందతనికి. పాలు వేస్టెందుకని గబగబా తాగేసి - వాష్ బేసిన్‌లో గ్లాస్ ఉంచి లైటార్పి బెడ్ ఎక్కింది. ఒక్క క్షణం అతన్ని అల్లుకుపోయి పడుకోవాలనిపించినా ఎక్కడ అతని నిద్ర డిస్టర్బ్ అవుతుందోనని ఈ పక్కగా ఒదిగి కళ్ళుమూసుకుంది.

అంతే! నిజానికి ఎంతగానో అలిసిపోయింది వసంత. అందుకే మంచం మీద ఇలా వాలీ వాలగానే నిద్రలోకి జారిపోయింది. ఆ నిద్రలో ఏదో కల. శ్రీ ఒడిలో తలపెట్టుకునుంది తను. శ్రీ కళ్ళల్లో ఎంతో దిగులు.

"వసంతా నీకు అన్యాయం చేసాను. కానీ ఏం చెయ్యను? నా చేతుల్లో ఏం లేదు. వసంతా.. వసంతా" చెక్కిళ్ళు నిమురుతున్నాడు. కాని చిత్రం అది స్పర్శలా లేదు గాలి వీవనలా ఉంది. రాత్రంతా అదే కల.

ఎంతో అలసిపోయినట్టూ శ్రీ నుదుటిమీంచి చెమటలు కారుతున్నాయి.

చటుక్కున మెళుకువ వచ్చింది. అప్పుడే గోడగడియారం తొమ్మిది గంటలు కొట్టింది.

"అమ్మో! అప్పుడే తొమ్మిదయిందా? శ్రీ వెళ్ళిపోయాడా?" చటుక్కున పక్కకు తిరిగింది.

రాత్రి ఎలా ఉన్నాడో అలాగే ... కాస్తైనా కదలకుండా.....

"శ్రీ" ఆదుర్దాగా కుదిపిన ఆమెకు తగిలింది.. మంచుముక్కలా మారిన అతడి శరీరం.!!

✡ ✡ ✡

## 2

**రోజంతా** తిరిగి తిరిగి ఇంటికి చేరేసరికి సాయంత్రం ఆరుదాటిపోయింది.

అసలే అలవాటు లేని శ్రమతో పూర్తిగా అలిసిపోయింది వసంత.

గత ఆర్నెల్లుగా ఎన్నెన్ని అనుభవాలు ఎన్ని సవాళ్ళు.

చాలా రోజుల పాటు ఇంటికి బందీగా దాదాపు ఇరవై రెండు గంటలు మంచం మీదే గడిపాక, నిరాశ నిస్పృహలే జీవితమని తీర్మానించుకున్నాక ఓ రోజున హఠాత్తుగా ప్రత్యక్షమైన యామినిని చూసి తెల్లబోయింది.

"నువ్వు రానివ్వకపోయినా నేను వెనక్కి వెళ్ళదలచుకోలేదు" అంటూ ఓ రకంగా తోసుకుని ఇంట్లోకి వచ్చింది. వసంతకు నోట మాట రాలేదు.

అయితే యామిని గతం గురించి ఒక్కమాటా ఎత్తలేదు. ఒక్క ఓదార్పు మాటా మాట్లాడలేదు. మామూలుగా ఎప్పటిలానే ఇల్లంతా గలగలా తిరుగుతూ ఏకధాటిగా మాట్లాడేస్తూనే ఉంది.

"ఇలా మమ్మల్నెవరినీ పిలవకుండా నువ్వొక్కదానివే తిని కూర్చోవడం ఏం బాగాలేదు, చూసావా?ఒక్కసారయినా అద్దంలో చూసుకున్నావా? ఎంత లేదన్నా ఈజీగా ఓ పదికిలోల బరువు పెరిగుంటావు. ఎంతకాలమయింది, వెయింగ్ మెషిన్ ఎక్కి? ఉబ్బరించినట్టున్న ఆ మొహం.... అది సరే ఈ వేజ్‌లో పువ్వులు ఆర్నెల్ల క్రిందటివా? అనుకుంటా? మళ్ళీ మళ్ళీ ఇంత ఏకాంతం దొరకదనుకున్నావా ఎవరు వస్తామన్నా ఒప్పుకోలేదు? అరచి అరచి అలసిపోయాను గాని కాఫీ నువ్విస్తావా, నన్ను చెయ్యమంటావా?"

ఒక్కసారి తెప్పరిల్లి పెదవుల మీదకు ఓ పేలవమైన నవ్వునీడ్చుకు వచ్చి, "రా, కిచెన్ లో కూచుని కాఫీ తాగుదాం" అంటూ యామినిని తన వెంట తీసుకు వెళ్ళింది.

ఉదయం పదింటి నుంచి ఎప్పుడు సాయంత్రమయిందో ఇద్దరికీ తెలియలేదు. ఒక జీవితాన్ని కలబోసుకున్న అనుభూతి మిగిలింది వసంతకు. పోగొట్టుకున్న పెన్నిధి తిరిగి పొందిన భావన.

"వసంతా, మనమంతా మనసులు కలిసిన మిత్రులం, నువ్విక్కడ ఒంటరిగా ఎంత వేదన అనుభవించావో నీతో మాట్లాడకపోయినా మేం ఊహించుకోగలం. ఈ పని ఇదివరకే చేసేదాన్ని కాని నీకు కొంత స్పేస్ ఇవ్వాలనే మా ఉద్దేశ్యం కూడా. వి ఆల్ విత్ యు అని కంటి తుడుపు మాటలు చెప్పను కాని ఒక్కటి గుర్తుంచుకో....ఏదేం జరిగినా స్టిల్ నీ జీవితం నీది."

మొదటిసారి వసంత ఆలోచనలో పడింది. నిజమే. ఇప్పుడు యామిని చెప్పేవరకూ ఒక్కసారీ అలా అనుకోలేదు. ఎంతసేపూ సంవత్సరాలుగా అతనే లోకంగా బ్రతికిన తను, పిల్లల కోసం ఇంటికోసం జీవితాన్నే త్యాగం చేసినట్టు ఫీలయిపోయి 'ఎందుకింత శిక్ష విధించాడు భగవంతుడ' నే వాపోయేది.

"నీకున్న సమయాన్ని సద్వినియోగపరచుకోగల సమ్యమనం వివేచన నీకున్నాయనే అనుకుంటున్నాను. లివ్ ఫర్ యువర్ సెల్ఫ్" అంటూ సెలవు తీసుకుని వెళ్ళిపోయింది. తలుపైనా చేరవెయ్యకుండా అలానే గుమ్మానికి ఆనుకుని ఎంతసేపో నిల్చుండిపోయిందామె.

✡ ✡ ✡

ఎప్పటికో తేరుకుని లోపలకు నడచిన వసంత ముందుగా చేసిన పని నిలువుటద్దం ముందు నిలుచుని తనను తాను పరీక్షించుకోవడం. అద్దంలో తనను తాను చూసుకుని ఆర్నెల్ల పైమాటే! ఆర్నెల్లలో ఇంత మార్పు సహజమేనా.... జీవితకాలంలో ఇంత అలసత్వం బహుశా ఎప్పుడూ లేదనే చెప్పాలి. అద్దంలో ఉన్నది తన మొహమేనా? ఎప్పుడూ మెరుపుతీగలా సన్నగా ఉండే తాను కనీసం తనలో వచ్చే మార్పునూ గుర్తించనే లేదు.

కనీసం బిగుతవుతున్న జాకెట్ల గురించి స్పృహే లేకపోయింది. ఇప్పుడు గుర్తుకొస్తోంది ఎప్పుడూ లేనిది కూర్చున్నా లేచినా కాళ్ళు నొప్పులు... ఇన్ని రోజులు ఏ రకమైన ట్రాన్స్‌లో గడిపాను?ఏదో ఒకటి చెయ్యాలి? ఇలాగుంటే... అనాలోచితంగానే టివీ ఆన్ చేసింది వసంత. సందర్భానికి తగ్గట్టుగానే ఒబేసిటీ గురించి ప్రోగ్రామ్ వస్తోంది.

చాలా శ్రద్ధగా విని ఫోన్ నెంబర్ రాసుకోవడమే కాదు వెంటనే కన్‌సల్టేషన్‌కు ఫోన్ చేసి అప్పాయింట్మెంట్ కూడా తీసుకుంది. దాంతో పాటే తీసుకున్న నిర్ణయం ఏదో ఒక ఉద్యోగం చూసుకోవాలి. ఇలా సెల్ఫ్ ఇంప్రిజన్‌మెంట్‌లో ఉంటే ఖచ్చితంగా పిచ్చి ఎక్కడమో లేదా, అనారోగ్యం పాలవడమో ఖాయం. వెంటనే మనసు దిగులు పడింది. కర్మగాలి అనారోగ్యం పాలయితే... ఆలోచనకే ఒళ్ళంతా జలదరించింది. పిల్లల మెడకు గుదిబండలా......

ఆ ఆలోచనే ఓ రకమైన తృళ్ళిపాటుకు గురిచేసింది. ఎంత అసమంజసంగా విచారంలోకి దిగజారిపోయిందో తెలిసి వచ్చింది. కూతురు విసుక్కున్నప్పుడు బాధపడ్డానే కాని ఎందుకు వాస్తవాన్ని గుర్తించలేకపోయానని తన్ను తాను నిందించుకుంది. ఎప్పుడూ లేనిది ఈ ఆర్నెల్లుగా శ్రీని ఎన్నిసార్లు తిట్టుకుందో తలచుకుంటే సిగ్గనిపించింది. చెప్పాపెట్టకుండా తనను ఒంటరిని చేసి వెళ్ళిపోయాడని, ఆరోగ్యం గురించి ఎంత మాత్రం పట్టించుకోకుండా అశ్రద్ధ చేసాడనీ, ఎందరెందరినో ఉద్ధరించి ఇల్లువల్లకాడుగా మార్చాడనీ ఒకటేమిటి మనసుకు ఎన్నివిధాల తోస్తే అన్ని విధాల అతన్ని లోలోపలే దూషించింది. అంతేనా ఎగ్గు సిగ్గు మాట మరచి మరెన్ని విధాల ఆలోచించిందనీ... గత ఇరవై ఆరేళ్ళుగా, ఏది ఏమైన ప్రపంచం తల్లక్రిందులైనా పక్కన తనువుండాల్సిందే.....

సుమ పుట్టినప్పుడు కూడా శ్రీ రాత్రయేసరికి 'వసంతను నేను చూసుకుంటాను మీరు పడుకోండి' అంటూ తన బెడ్ బెడ్‌రూములోనే ఏర్పరచేసరికి అమ్మ బుగ్గలు నొక్కుకుని 'ఇవేం ప్రేమలు తల్లీ! మేమెరుగం..... పిల్ల పుట్టిన ఆర్నెల్ల వరకూ మొగుడి మొహం చూసేవాళ్ళం కాదు' అని ఎంత సన్న సన్నగా అన్నా శ్రీ వినబే విన్నాడు.

చరచరా బెడ్‌రూములోంచి బయటకు వచ్చి - "అత్తగారూ! మీకంటే మాకు బాగానే తెలుసు... మీ అమ్మాయి గురించి మీరేం దిగులు పడకండి.. పక్కన ఉన్నంత మాత్రాన నేనేదో మీ పిల్లను కొరుక్కు తినేస్తానని అనుకోకండి. నిజానికి మీకంటే వసంత మంచీ చెడు బాధ్యత నాకే ఎక్కువ. తను పక్కన లేకపోతే నాకు నిద్రరాదు" అనేసి మళ్ళీ లోపలకు వెళ్ళిపోయాడు.

అమ్మకు కోపం వస్తుందేమోనని ఎంత భయపడిపోయిందో.... అలాంటిది ఇప్పుడిలా ఈ విశాలమైన మంచం మీద ఒక్కతీ ఎలా నిద్రపోగలనని అనుకున్నాడు..... ఇరవై ఆరేళ్ళుగా అతని ఎడం చేతి మీద తలాన్చి గుండెల్లో ఒదిగి అతని కుడి చెయ్యి తనను చుట్టేసిన భద్రతలో నిశ్చింతగా లోకాన్ని మరచిపోగలిగే తను ఎలా రెప్పలు మూయగలదనుకున్నాడు. ఇప్పుడు గుర్తు చేసుకుందుకే బిడియంగా ఉంది. నిజానికి అతని చేతుల్లో ఏదైనా ఉంటే తనను వదిలేసి ఇలా వెళ్ళగలిగేవాడా? ప్రపంచంతో పోరాడయినా తనతోనే ఉండేంత అనుబంధం తమది. ఆలోచనల్నుండి బయటపడకుండానే ఒక నిర్ణయానికి రాగలిగింది వసంత.

శ్రీకి ఎవ్వరు కళ్ళనీళ్ళు పెట్టినా ఇష్టం ఉండదు. పెళ్ళయ్యాక తనతో చెప్పిన మొదటి మాటే అది. కష్టమైనా సుఖమైనా కలిసి పంచుకుందాం. కాని, కన్నీళ్ళు భరించే శక్తి లేదు నాకు. అది నా బలహీనతో బలమో ఏదైనా అనుకో కన్నీళ్ళు నాకు నచ్చవు. ఎంత విపత్తైనా చిరునవ్వుతోనే అనుభవించాలి. చివరి క్షణం వరకూ శ్రీ ఆ మాటకే కట్టుబడ్డాడు. ఆరోగ్య సమస్యలు, ఉద్యోగంలో ఒడిదుడకలు ఆప్తుల మరణాలు ఎన్ని ఎదురైనా అతనొక్కరోజూ కన్నీళ్ళు పెట్టలేదు. అతని ఆశయాన్ని తనూ గౌరవించింది. ఒక్క ఈ ఆర్నెల్లుగానే.... వరద గోదావరులైన కళ్ళను తుడుచుకుంది. మరోసారి నా కంట నీరు రాదు. అప్పుడే నిర్ణయించుకుంది, శ్రీ భౌతికంగా లేకపోయినా అతను అనుక్షణం నాలోనే ఉన్నాడు. నేను సంతోషగా ఉండాలి అని.

✡ ✡ ✡

మొదట్లో చాలా ధీమాగా ఉండేది. ఉద్యోగం దొరకడం ఏమంత కష్టం కాదు.. తనకున్న అర్హతలకు అడగ్గానే ఏదో ఒకటి దొరుకుతుందనే ఆశ పడిందామె. అయితే వాస్తవంలోకి రావడానికి ఎంతో సమయం పట్టలేదు.

"ఈ వయసులో ఉద్యోగాలెందుకండి" అంటూ ఎద్దేవా చేసిన వాళ్ళు, రేపురా మాపురా అంటూ పదిసార్లు తిప్పించుకున్నవాళ్ళు.... నిజానికసలు ఆరంభంలోనే ఒక ప్రైవేట్ కంపెనీలో రిసెప్షనిస్ట్‌గా చేరింది. గొప్ప సంపాదనేం కాకపోయినా తనను తాను బిజీగా ఉంచుకోగలదనే చేరింది. మొదటి రోజున చేరేందుకు వెళ్ళినప్పుడే కంపెనీ ఇన్‌చార్జ్ కాస్త రుసరుసలాడాడు. రోజూ ఇలాగే వస్తారా అంటూ అదోలా చూసాడు. తనను తాను ఒక్కసారి పరిశీలించుకుంది. మామూలుగానే ఉంది. చక్కటి చీర ఎప్పటిలాగే.... ఏం కొరవడిందో అర్ధంకాలేదు. ఆశ్చర్యంగా చూసింది.

రెండో రోజు సాయంత్రం ఇంటికి రాబోయే ముందు రిలీవ్ చేసే అమ్మాయి ఒక్కనిమిషం ఆమెను ఆపి, "మేడం, ఒక్క మాట... ఏమీ అనుకోరుగా.... అయినా ఈ మాట నేను చెప్పడం లేదు. మన ఆఫీసరు గారు చెప్పమన్నారు. మీరు కాస్త మోడ్రన్‌గా ఉండాలి.... చీర కట్టు... కొంచెం మేకప్... లిప్‌స్టిక్ వేసుకోవడం...."

వసంత కోపంగా చూడటంతో ఆపేసింది. చరచరా నడిచి బయటపడ్డా మనసంతా ఎంతో చీదరంగా అనిపించింది. నడుస్తున్నా మనసు మాత్రం చిరాకు పడుతూనే ఉంది. పాతిక ముప్పై ఏళ్ళుగా ఎండపొడ తగిలిందే లేదు. రోజంతా ఇంట్లో పనిపాటా ఎక్కడికయినా వెళ్ళాలంటే కారులో గాని శ్రీ స్కూటర్ మీద కాని వెళ్ళడం అంతే.... ఇప్పుడైనా పెద్ద ఇబ్బందిపడకుండా కారు డ్రైవర్‌ను పెట్టుకోవచ్చు కాని.... ఒక రకపు ఆత్మగౌరవం... పిల్లలెందుకు తన గురించి డబ్బుపంపడం? ఇవ్వాళ్ళ ప్రేమతో పంపినా రేపు వాళ్ళ ఇళ్ళూ వాకిళ్ళూ వాళ్ళు ఏర్పరచుకున్నాక ఎప్పుడైనా నీకు కారెందుకు ఇంట్లో ఉండక అంటే తను సహించగలదా? ఆ మార్పురాదని గ్యారంటీ ఏమిటి? చూచాయగా క్రితం మారు వచ్చినప్పుడే మార్పు అర్ధమయింది. ఏ మాత్రం సానుభూతి లేకుండా విసుక్కోవడం, 'ఎన్నాళ్ళలా ఏడుస్తూ కూర్చుంటావు? ఎవరైనా వెయ్యేళ్ళు బ్రతుకుతారా? ఒకరు ముందు ఒకరు వెనక........ '

తప్పనప్పుడు భరించాలి..... అలవాటు పడాలి...... అంతేకాని.... తెల్లబోవడం తనవంతైంది. ఇంకా ఎవరితో మనసు విప్పి మాట్లాడనేలేదు, అటు కూతురితోగాని ఇటు కొడుకుతోగాని....... మనసింకా సర్దుకోనేలేదు, ఇంకేం మాట్లాడాలి? మనసు పిండేసినట్టైంది. తల్లికీ పిల్లలకూ ఇంత దూరమా? రక్తమాంసాలతో పాటు సర్వమూ త్యాగం చేసి తన అనుకునే పిల్లలే ఇలా ఉంటే..... అక్కడికి ఆలోచన తుంచేసుకుంది. ఎటనుకున్నా తన పిల్లలే...... తను ప్రేమగా ఉండాలే తప్ప మరోలా ఆలోచించకూడదు. పిల్లలెలా ఉన్నా అమ్మ అమ్మే! నెమ్మది నెమ్మదిగా మనసు కుదుట పరచుకుని ఓ నిర్ణయానికి రాగలిగింది. దాని ఫలితమే ఉద్యోగ ప్రయత్నం.

మళ్ళీ కంపెనీ ఇన్‌చార్జ్ రుసరుసలు, రిలీవర్ అమ్మాయి మాటలు మనసులో మెదిలాయి. వచ్చిన వారిని మంచి మర్యాదలతో పలకరించి కావలసిన పనులు చూసేందుకు, ఫోన్‌లో జవాబిచ్చేందుకు మోడ్రన్‌గా ఉండటం, మేకప్ వేసుకోవటం ఏరకంగా ఉపయోగిస్తాయో అర్థం కాలేదు. అందుకేనా రిసెప్షనిస్ట్ అంటే పాతికేళ్ళ లోపు కోసం వెతుక్కుంటారు? ఛీ...ఛి...ఛీ... ఊరికినే చిరాకు పడింది. అంతే అక్కడితో ఆ ఉద్యోగానికి స్వస్తి. ఆ తరువాత ఒక ప్రైవేట్ స్కూల్లో టీచర్‌గా జాయినయింది. పొద్దున్నే ఉరుకులు పరుకులుగా ఎనిమిది లోపల స్కూల్లో ఉండటం... అలవాటు లేని అవుపోసన వల్ల అలసట ఉదయాన్నే లేచే అలవాటు తప్పిపోయి ఎన్నేళ్ళో అయింది, దాంతో తలనొప్పి...... ఈ తలనొప్పికన్నా ఎక్కువ బాధ కలిగించింది, మేడి పండులాంటి విద్యావ్యవస్థ.

పాఠశాల అన్నా ఉపాధ్యాయులన్నా ఎంతో గొప్ప అభిప్రాయముండేది వసంతకు. భావితరాల భాగ్య విధాతలుగా తలపోసేది. అయితే వాస్తవం చూసే సరికి ఆ తలుపులన్నీ తల్లక్రిందులయాయి. ఒక నెల రోజుల్లోనే చదువుకు ఆధునిక నిర్వచనం అర్థమైపోయింది. అసలు కంటె కొసరు ముద్దన్నట్టు చదువుకంటె ఆడంబరాలకు ప్రాధాన్యత ఎక్కువ. నిగ నిగలాడే షూస్, జిగేల్న మెరిసే తెల్లని షర్ట్, బ్లూ కలర్ నిక్కర్ లేదా ఫాంట్, దానికి తోడు మెడకు ఉరిలా టై... వీపున బండెడు పుస్తకాలమోత, మరో చేత లంచ్ బ్యాగ్..... నిజానికి మోతకు వాడుకునే అలంకరించిన గంగిరెద్దుల్లా ఉన్నారు తప్ప చదువుకునే పిల్లల్లో ఉండాల్సిన ఉత్సుకత ఉత్సాహం ఏ కోశానా లేవు. మరిక స్కూల్ కి వచ్చింది మొదలు పిల్లలు పెదవులు బిగించుకుని నిశ్శబ్దంగానే ఉండాలి. ఒకరితో ఒకరు మాట్లాడకూడదు. మాట్లాడాలంటే ముందుగా ఇద్దరి హోదాలూ సరితూగాలి - ఇద్దరూ కార్లో వచ్చేవాళ్ళే అయివుండాలి లేదా ఇద్దరూ ఆటోలోనో, ఇద్దరూ తల్లిదండ్రులతోనే వచ్చే వారయితేనే మాట్లాడుకోవాలి. అప్పుడే ప్రిన్సిపల్ గారి పర్మిషన్ దొరుకుతుంది. డబ్బు హోదా వున్నవారి పిల్లల్ని దండించకూడదు.

మరింత ఆశ్చర్యకరమైన విషయం స్కూల్ టైం అయిపోయాక టీచర్లు ఒక గంట స్కూల్లోనే ఉండి పిల్లల హోమ్ వర్క్ చేసిపెట్టడం.... ఎల్ కేజీ నుండి ఇదే వరస .... ఓ చేత్తో పెన్సిల్ మరో చేత్తో ఇరేజర్ పట్టుకుని పిల్లల పుస్తకాలు టీచర్లే వ్రాయడం, పెన్‌తో టిక్ కొట్టి ఎక్సలెంట్ అని కామెంట్స్.....

ఎక్కడికి పోతోంది విద్యావ్యవస్థ - కాసులకు కాగితాలకే పరిమితమవుతోందా..... సరస్వతిని నడిరోడ్డున బాహాటంగా అమ్ముకుంటున్నారా? ఒక నెల గడిచేసరికి ఈ ఆత్మవిద్రోహం చిత్రహింసగా అనిపించి ఆ ఉద్యోగానికీ తిలోదకాలు వదలడం జరిగింది.

✡ ✡ ✡

ఆ రోజు యధాలాపంగా పేపర్ చూస్తున్న వసంత దృష్టిని ఆకట్టుకుంది ఆ ప్రకటన. పేరున్న వారపత్రికలో పనిచేసేందుకు సబ్ ఎడిటర్లు కావాలి. పూర్వానుభవం లేకున్నా మంచి ఆసక్తి ఉంటే చాలు. నెలరోజులపాటు శిక్షణ ఇచ్చి మరీ ఉద్యోగం ఇస్తారు. శిక్షణ సమయంలో స్టైఫండ్ కూడా ఇవ్వబడుతుంది. చదవగానే పొంగిపోయింది వసంత. ఇన్నాళ్ళకు వయసు మాట ఎత్తకుండా, యోగ్యత గురించి మాట్లాడకుండా ఇచ్చే ఉద్యోగం ఒకటి కనబడింది.

ప్రకటన ఇచ్చిన వారం రోజులలోగా సంప్రదించమన్నారు. ఆ ప్రకటన వెలువడింది ఆరోజే. అయినా ఆలస్యం ఎందుకు అనుకుంటూ వెంటనే లేచి తయారయింది వసంత. హడావిడిగా ఆటో దిగి సెక్యూరిటీ దగ్గర స్లిప్ వ్రాయించుకుని ఆఫీస్ ప్రాంగణంలో అడుగు పెట్టబోతూ - బహుశా ఇక్కడ నాకు తగిన ఉద్యోగం దొరుకుతుండవచ్చు అనుకుంది.

కాని ఆ ఆఫీస్ ఆమె జీవన విధానాన్నే మార్చేస్తుందని కల్లోకూడా అనుకోలేదు.

✡ ✡ ✡

## 3

మే ఐ కమిన్ సర్ ఫార్మాలిటీస్ లేకుండా సెక్యూరిటీ దగ్గరకు వెళ్ళగానే ఎవరు కావాలంటూ అడగటం, వెంటనే వాళ్ళకు ఇంటర్కం లో తెలియ పరచి పంపమంటే ఒక విజిటర్స్ గుర్తింపు కార్డ్ తగిలించి పంపడం.

ఎక్కడో ఫిఫ్త్ ఫ్లోర్‌లో ఉందా సెక్షన్.

చిన్న గదిలో నాలుగు కుర్చీలు. నాలుగు టేబుళ్ళు.

రెండు కంప్యూటర్లు అంతే...

ఆ గది నుంచి ప్రపంచవ్యాప్తంగా పేరున్న పత్రిక రావడం వింత అనిపించింది వసంతకు.

ఒక్కసారి గదిలోకి అడుగు పెడుతూనే నాలుగువైపులా పరిశీలించిన ఆమెకు అంతకు మించి మరేం కనిపించలేదు.

నెమ్మదిగా దృష్టిని ఓ చోట నిలిపి కళ్ళు మనుషుల మీదకు మళ్ళించింది.

ఎవరి కంప్యూటర్ ముందు వాళ్ళు తమ తమ పనుల్లో బిజీగా ఉన్నారు.

అలికిడి విని తలెత్తిన ఎడిటర్ ప్రభాకర్ కళ్ళలో ఆశ్చర్యం.

"వసంతా!" నమ్మలేనట్టుగా అతని పిలుపు.

ఎవరన్నట్టుగా అతని వంక చూసింది.

ముక్కు మీదకు జారిన కళ్ళద్దాలు. కాస్త నెరిసిన బట్టతల..

ఏమూలో ఏవో పరిచితమైన పోలికలు.

కాని గుర్తుకు రావటం లేదు.

స్వరం మాత్రం.. లీలగా..

"వసంతా.. ఎలాగున్నావు?" అతని ప్రశ్న.

ఏకవచనంలో పిలుస్తున్నాడంటే బాగా తెలిసిన వాడై ఉండాలి.

గుర్తుకు రావడంలేదు.

ఆ మాటే పైకి అంటే ఎక్కడ నొచ్చుకుంటాడో నన్న భయం.

ఆమె ఇబ్బందిని గుర్తించినట్టు నవ్వేస్తూ.

"గుర్తుపట్టలేదుగా... ఈ తెల్లజుట్టూ.. అబ్బో ఎప్పటి మాటా... పాతికేళ్ళు దాటిపోలేదూ.."

చటుక్కున గుర్తుకు వచ్చింది అవును అతను ... అతని పేరు ఏదో ప్రభాకర్.

ఏదో ప్రభాకర్... కాదు.

మౌన ప్రభాకర్.

అతన్ని అప్పటిలో ఎంతగా ఏడిపించేదనీ..

సన్నగా చాకులా చురుగ్గా ఉండేవాడు.

అప్పుడూ ఇలాగే ముక్కు మీదకు జారే కళ్ళద్దాలు..

కాదంటే వయసు తెచ్చిన మార్పులు.

"మీరు ప్రభాకర్ కదూ." చాలా బాగా గుర్తుపెట్టుకున్నావు నించునే వున్నావు, కమాన్ కూర్చో" మాటల్లో హడావిడి వ్యక్తం చేసాడు.

"చెప్పు ఏం సంగతులు..

ఒక్కమాట! నమ్ముతావో నమ్మవోగాని వసంత లక్ష్మి అనగానే నా మనసులో నువ్వే మెదిలావు. ఎందుకో సిక్త్‌సెన్స్ అను మరోటను నువ్వే వస్తావని అనుకున్నాను. ఎప్పటిమాట..! నీకు తెలియకుండా స్కూలుకి వెళ్ళే రోజుల్లోనే నిన్ను చూసేవాడిని తెలుసా?"

పక్కనున్నవాళ్ళు గమనిస్తున్నారని అనుకున్నాడేమో

"పద కింద క్యాంటినుకు వెళ్ళి టీ తాగి వద్దాం" అంటూ లేచాడు.

"అబ్బే, ఎందుకిప్పుడు.." అని ఆమె వారిస్తున్నా అతను ముందుకు నడవడంతో కదలక తప్పలేదు.

మళ్ళీ లిఫ్ట్‌లో కిందకు.

"చెప్పు వసంతా నాకెంత ఉద్వేగంగా ఉందో తెలుసా! అప్పట్లో మైగాడ్! లంగా జాకెట్లు వేసుకుని హార్డ్ లీ ఫోర్ నైనుండేదానవు..."

అవును అప్పట్లో తను చాలా పొట్టి అనుకునేవారంతా.

చిన్నప్పుడు ప్రభాకర్ వాళ్ళకు మెడికల్ షాప్ ఉండేది. ఏ మందులు కావాలన్నా అక్కడే కొనాలి. చాలాసార్లే వెళ్ళి ఉంటుందా షాపుకి. పైగా స్కూల్‌కి వెళ్ళేదే ఆ దారి. ఉదయమో సాయంత్రమో అతనా షాప్‌లో ఉండేవాడు. నిజానికి అప్పట్లో అతనంటే ఓ రకమైన అబ్సెషన్ కూడా ఉండేది. సన్నగా చురుగ్గా కనిపించే కళ్ళు, కళ్ళద్దాలు తెల్లగా పొడుగ్గా..

కాని ఇంట్లో చాలా కట్టుబాట్లలో పెంచటం వల్ల ఎవరికీ చనువిచ్చి మాట్లాడే అలవాటు ఉండేది కాదు. అందుకే ఓసారి అతను నీపేరేంటి అని అడిగితే నీకెందుకని జవాబిచ్చింది..

"వసంతా జీవితం ఎంత చిన్నది చూడు.. మళ్ళీ నిన్ను చూస్తాననే అనుకోలేదు."

కింద క్యాంటిన్‌లో కూర్చున్నారిద్దరూ.

"నీకో సంగతి తెలుసా.... మా మెడికల్ షాప్ పేరు వసంత మెడికల్స్. మా అమ్మాయి పేరు వసంత. చివరకు నా ఫర్మ్ పేరూ వసంత ఇంటీరియర్స్..." మౌనంగా వింటోంది వసంత.

"నేనే మాట్లాడుతున్నాగాని నువ్వు మాత్రం అప్పటిలాగే మాట్లాడితే మౌన వ్యర్థమవుతుందన్నట్టు... చెప్పు ఎంతమంది పిల్లలు ఏం చేస్తున్నారు? మీ శ్రీవారు.."

పిల్లల గురించి చెప్పింది.

"గుడ్, దేనికైనా అదృష్టం ఉండాలి. అతను లక్కీ ఫెలో."

"ఎందుకు? నేనే లక్కీ. అతనిలాంటి వాళ్ళు నూటికో కోటికో ఒకళ్ళుంటారు"

"అబ్బో శ్రీవారంటే చాలేనే ప్రేమ అవునులే ఏరికోరి చేసుకున్నావుగా."

హఠాత్తుగా వసంతకు గుర్తుకొచ్చింది.

ఈ ప్రభాకరే...

అవును...

ఒకప్పుడు అతనంటే ఇష్టమే కాదు... తరువాత చాలానే కథ జరిగింది...

అతనికి చెల్లెలు వరసయే అనసూయ కాలేజీలో తన సహాధ్యాయిని...

చాలాసార్లే చెప్పింది మా అన్నకు నువ్వంటే పిచ్చి ప్రేమ.. పడి చచ్చిపోతాడు అని. అలాగ అనడం ఎప్పుడు ఓ మాట ఎక్కువ మాట్లాడేది కాదు.

అలాంటిది.

ఆ రోజు ఏం జరిగిందో గుర్తులేదుకాని - ఎప్పుడు పెదవి కదిపి మాట్లాడని తను తనకూ అతనంటే ఎంత ఇష్టమో.. తన తల్లి దండ్రులు ఎంత సనాతన ఆచారపరులో, తన ఆధునిక దృక్పథం ఏమీ ఆశించకుండా ఎవరిష్టపడి ముందుకు వస్తే వారిని పెళ్ళాడతానని చెప్పింది.

స్పష్టంగా ఈ మాటలు అనసూయ అతనికి చేరవేసినట్టు తెలుసుకాని ఆ వైపు నుండి అలాంటి స్పందనా లేకపోవడంతో ఆ విషయం ముగిసినట్టుగానే భావించింది.

ఇప్పుడు గుర్తు చేసుకుంటే సిగ్గుగా అనిపిస్తోంది.

ఎలా అలా మనసు విప్పి చెప్పగలిగింది, చెప్పాక కూడా అతనంత నిర్లక్ష్యంగా వదిలెయ్యడం....

ఆమె మనసు చదివినట్టుగా -

"నిజమే అప్పట్లో ధైర్యం చెయ్యలేకపోయాను. ఎక్కడ మీ నాన్న ముక్కలు ముక్కలుగా నరికేస్తాడోనన్న భయం, ఇంతకూ నువ్వెందుకు ఉద్యోగం కోసం వచ్చినట్టు?"

"ఏముంది... కాస్త కాలక్షేపం..."

"మీ ఆయన గురించి చెప్పనే లేదు, డాక్టర్ అన్నట్టుగా విన్నాను..."

"అవును"

"ఏదో విషాద వార్త కూడా విన్నాను..."

"కెటాస్ట్రోఫీస్ ఆర్ బట్ న్యాచురల్.. వినివుండవచ్చు"

"ఐ యామ్ సో సారీ.."

"ఓకే... ఇంకా విషయాన్ని వదిలేద్దాం..."

"అయితే ఒక్కదానివే ఉంటున్నావా??"

"ఒక్కదాన్నెలగయాను ఈ గాలి, ఈ నేల ప్రపంచమంతా నాతోనే ఉండగా... అంతేనా అదృశ్యంగా అతనూ నాతోనే ఉంటాడు"

"ఇహ మన ఉద్యోగ విషయానికి వద్దాం."

"యూ ఆర్ మోస్ట్ వెల్ కమ్.. రేపే వచ్చి జాయినవు."

"ఈ పత్రిక..."

"నాదే"

"నాకు తెలియదే"

"ఎందుకు తెలుసుకుంటావులే?" కాస్త నిష్టూరంగా అన్నాడు.

"నాకీ పని గురించి ఏబీసీడీలు కూడా తెలియవు... మీరే శిక్షణ ఇస్తారని..."

"మరేం ఫర్వాలేదు..."

"రేపు వచ్చి చేరతాను"

"ఓకే..టేక్ కేర్"

సెలవు తీసుకుని ఉద్యోగం దొరికిందన్న సంతోషంతో కొంచెం తేలికపడ్డ మనసుతో ఇంటికి వచ్చింది.

✡ ✡ ✡

డోర్ బెల్ సంగీతానికి మెలుకువ వచ్చింది వసంతకు.

అబ్బా!

నిద్ర మెలుకువ వచ్చినా లేవడానికి బద్ధకంగా అనిపించింది. తలెత్తి గోడగడియారం వంక చూసింది. ఆరున్నర!

అంటే దాదాపు నాలుగ్గంటల పాటు నిద్రపోయిందన్నమాట.

ఈ మధ్య కాలంలో అంత సేపు నిద్రపోవడం ఇదే మొదటి సారి.

గత ఏడెనిమిది నెలలుగా ప్రతి అరగంటకూ గోడగడియారం చూడటం మళ్ళీ కలత నిద్ర. అదే వరస...

మరోసారి డోర్ బెల్ వినపడటంతో లేచి జుట్టు సరిచేసుకుని,

"ఈ సమయంలో ఎవరూ వచ్చేవాళ్ళు లేరే అనుకుంటూ తలుపు తెరిచింది. ఎదురుగా ఎవరతను..

"హలో.. వసంతగారూ... గుర్తు పట్టలేదా.. నేను డాక్టర్ చైతన్య..."

"ఓ మీరా రండి రండి.. చాలా రోజులు... రోజులేమిటి ఏళ్ళు కదూ... ఇలా హఠాత్తుగా...!? రండి" లోపలకు ఆహ్వానించింది.

సోఫాలో కూర్చున్నాక లోనికి వెళ్ళి ట్రేలో ఓ గ్లాసుతో చల్లటి నీళ్ళు తెచ్చిచ్చింది.

"చాలా మారిపోయాను కదూ.. గుర్తుపట్టలేకుండా.."

"మరీ అంతగా కాదు కానీ ఇలా వస్తారని తెలియదు కద. అందుకే... ఎక్కడ ఉన్నారు... ఎలా వచ్చారు..."

ఒకప్పుడు అంటే దాదాపు ఇరవై సంవత్సరాల క్రితం, బెంగుళూరులో ఓ నాలుగేళ్ళపాటు శ్రీ పనిచేసినప్పుడు, చైతన్య అతనితోపాటు అదే హాస్పిటల్‌లో సర్జన్‌గా ఉండేవాడు. ఇద్దరిదీ ఒకే వయసు కావడం, ఇరువురి కుటుంబాలకూ సాన్నిహిత్యం ఏర్పడింది. పిల్లలు ఒకే స్కూల్. దాంతో ప్రతి వారాంతానికీ ఎవరో ఒకరి ఇంట్లో గడపడం అలవాటుగా మారింది.

చైతన్య భార్య వసుమతి చక్కని గాయని, శ్రీకి సంగీతంలో ప్రావీణ్యత ఉండటంతో ఇద్దరూ ఎన్నెన్నో పాటలు పాడేవారు.

"వసు ఎలాగున్నారు?" అడిగింది వసంత.

"బాగానే ఉంది, కాదంటే ఇక్కడ కాదు పైన.."

అర్థం చేసుకుందుకు రెండు క్షణాలు పట్టింది.

"అయ్యో అలాగా తెలియదు.. మీరు అమెరికా వెళ్ళిపోవడం మేం ఇలా హైదరాబాద్ రావడం ఉత్తరాలు రాసుకునే తీరిక లేక ఎవరు జీవన సమరంలో వాళ్ళు పడిపోయి..." ఎక్కడ మొదలు పెట్టిందో ఎక్కడికి వచ్చిందో తెలియక ఆగిపోయింది.

"అవును మనం రేపు రేపు అనుకుంటూ అన్నీ వాయిదా వేస్తాం కానీ రేపటికి మనకోసం ఏదీ ఆగదు.. ఇక్కడికి రాగానే శ్రీ నేనూ ఎన్నో మాట్లాడుకోవాలనుకున్నాను. కాని నా రాకకోసం ఆగకుండా శ్రీ వెళ్ళిపోయాడు. వినగానే నా శరీరంలోనే ఓ భాగం కోల్పోయాననుకున్నాను. వెంటనే వచ్చి మిమ్మల్ని చూడాలనిపించింది. అంతే...వచ్చేసాను."

"ఏం చేస్తాం చెప్పండి.. మన చేతుల్లో ఏదైనా ఉందా? ఏది ఎదురైన భరించక తప్పదు కద..."

"మ్యాస్సివ్ హార్ట్ ఎటాక్ అని చెప్పారు, జీవితంలో ఐరనీ చూసారా - హార్ట్‌స్పెషలిస్ట్‌కి హార్ట్ ఎటాక్...

మీకు చెప్పలేదు కదూ గాన సరస్వతిలా పాడే వసుకి కాన్సర్.. దాదాపు రెండేళ్ళపాటు నరకం అనుభవించింది... ఆ బాధలు మేం చూడలేక అస్సలు ఎంత తొందరగా విముక్తి దొరుకుతుందా తనకని అనుకునే వాళ్ళం.."

"పాపం"

"అలా అనుకోవడం తప్ప ఏం చెయ్యలేకపోయాం.. దానికన్నా ఎక్కువ బాధననుభవించింది పిల్లల ప్రవర్తనతో..."

"అవునా... ఏం జరిగింది?"

"అమెరికా మోజులో అక్కడకు వెళ్ళి ఏదో సాధించామని ఉబ్బిపోయినంతసేపు పట్టలేదు. పిల్లలు కాస్త పెరగ్గానే మొదలు.. వాళ్ళకి విలాసవంతమైన జీవితం కావాలి... ఇక్కడలా మన మీద ఆధారపడి ఉండరు. పదహారేళ్ళు వచ్చాయంటే చాలు మన చెయ్యిదాటి పోయినట్టే...

ఏమైనా అంటే వెళ్ళిపోయి స్నేహితులతో కలిసి బ్రతుకుతారు.

కొడుకు ఇరవై దాటకుండానే గడపదాటి వెళ్ళిపోయి నలభై ఏళ్ళ అమెరికన్‌ని పెళ్ళి చేసుకున్నాడు... మేం వాడి అవసరాలు తీర్చలేకపోయాం ఆవిడ తీరుస్తుంది... కొడుకిలాగంటే కూతురు మరీ అధ్వాన్నం.

పెళ్ళీ గిళ్ళీ నమ్మకాలు లేవట..

అందుకే తనకి నచ్చినవాళ్ళతో నచ్చినంతకాలం కాపురం చేస్తుంది

సరిపడదనుకోగానే దీనిదారి దీనిది వాడి దారివాడిది.

వెళ్ళిన కొత్తలోనే వసు మొత్తుకుని చెప్పేది.. ఈ సంస్కృతి మనకు సరిపడదు.. తృప్తి అనేది ఎక్కడికి వెళ్ళిపోదామని.. ఊహు... ఏదో తాపత్రయం... అన్నింటినీ పోగొట్టుకున్నాక గాని తెలిసి రాలేదు.."

అతన్ని ఎలా ఓదార్చాలో అర్ధం కాలేదు.

మౌనంగా ఉండిపోయింది.

ఇద్దరి మనసుల్లోనూ పాత రోజులు మెదిలాయి.

శని ఆదివారాలు ఇద్దరూ ఒకేచోట గడిపేవారు.

శ్రీ,చైతన్య తీరిగ్గా కార్డ్స్ ఆడుకునేవారు... క్యారమ్స్ ఆడుతూ చిన్నపిల్లల్లా కాయన్స్ చేత్తో తోసేసేవారు. గట్టిగా గొడవ పడేవారు అంతలోనే నవ్వుకునేవారు. పిల్లలూ అంతే. అబ్బాయిలు గాలి పటాలు ఎగరెయ్యడం, క్రికెట్ ఆడి కిటికీల అద్దాలు పగలెయ్యడం వాళ్ళను అరవడం..

కొత్త కొత్త వంటలు ప్రయోగాలు చేస్తూ మధ్య మధ్య మగవారి గురించి మాట్లాడుకోవడం. ఎవరితో చెప్పుకోలేని విషయాలు పంచుకోవడం... ఒకటా రెండా..

"సుమ, సుమంత్ ఏం చేస్తున్నారు? " అడిగాడు..

చెప్పింది.

"ఇంకా పెళ్ళిళ్ళు కాలేదన్నమాటా.."

"ఆ మాటలు అనుకునే లోగానే ఇలా జరిగింది.."

"దానికేం లెండి.. చూద్దాం మంచి సంబంధాలు"

అప్పటికే రాత్రి ఎనిమిదిన్నర దాటింది.

"ఈ బుక్స్ చూస్తుండండి ఒక్క పది నిమిషాలు.. డిన్నర్ అరేంజ్ చేస్తాను" లేచింది.

ఓ పక్క మనసులో వద్దంటే బాగుండునన్న భావన.

"ష్యూర్, నాకింకా గుర్తే అప్పట్లో శ్రీ గర్వంగా అందరికీ చెప్పేవాడు... మా ఆవిడ అయిదునిమిషాల్లో వండి వడ్డిస్తుందని... మీ పాకకళా నైపుణ్యం మా కందరికి తెలిసిందేగా.."

అంటూ అతను మ్యాగజైన్ చేతుల్లోకి తీసుకున్నాడు.

వసంతకు లోపలికి వెళ్ళి వంట చెయ్యాలని అసలు లేదు.

అసలు ఇంట్లో ఏం ఉన్నాయో ఏం లేవో తెలియదు...

రాత్రి పూట అస్సలు వంట చెయ్యడం మానేసి నెలలు గడిచిపోయాయి.

ఒక్కసారి కోపం తన్నుకు వచ్చింది - ఏంటీ జులుం తనమీద ఏదో ఫార్మాలిటీ కోసం అడగ్గానే భోజనానికి ఉండిపోవడమేనా...

ఎందుకో ఒద్దనుకున్నా ఓసారి తనూ వసూ మాట్లాడుకున్న మాటలు గుర్తుకు వచ్చాయి..

వసుమతి వంట్లో బాగుండలేదని ఓ ఆదివారం కలవలేదు.

అందుకే తెల్లవారి పిల్లలు స్కూల్‌కి వెళ్ళాక చూసి వద్దామని వాళ్ళింటికి వెళ్ళింది...

నీరసంగానే ఉంది వసుమతి.

ఏమిటని అడిగితే నవ్వి -

"ఏముంది మామూలే ప్రతినెలా పడే బాధే. విపరీతమైన కడుపు నొప్పి.. ఏవైనా టాబ్లెట్లు వేసుకుంటే నీరసం.. ఇలా జీవితాంతం తప్పదిక.."

"ఇంకానా? మాములుగా పిల్లలు పుట్టాక తగ్గిపోతుందంటారుగా.."

"ఏం తగ్గడం.. దానికి మందు లేదు నా బాధకు విముక్తిలేదు. ఓ పక్క ఈ బాధ అంటే మరో పక్క ఈయన గోల.. శ్రీ మెత్తనివాడులాగే కనిపిస్తాడు మరి నీతో ఎలాగుంటాడో... చైతన్యకు మాత్రం ప్రపంచం తలక్రిందులైనా సరే తన కోరిక తీరాల్సిందే... కనీసం ఈ మూడు రోజులైనా విశ్రాంతి దొరకదు..."

వసుమతి ఏం మాట్లాడుతుందో అర్ధమయేసరికి వసంత మొహం ఎర్రబారింది.

"మరీ అంతగానా.."

"పిచ్చి అంతే, కాదూ కూడదనీ తగువు పడి రుస రుస లాడినా అటు మొహం ఇటు మొహం, ఎందుకొచ్చిన గోల కాస్సేపు శరీరం నాది కాదనుకుంటే సరి..." వసంత ఏం మాట్లాడకపోయినా మనసులోనే తన అదృష్టానికి తనను తాను అభినందించుకుంది.

శ్రీ పాపం ఏ విషయానికీ తన ఇష్టా ఇష్టాలు కాదనడు.

ఇష్టం లేదంటే మీద చెయ్యికూడా వేసేవాడుకాదు...

కష్టమైనా సుఖమైనా మనిద్దరిదీ ఏ ఒక్కరిదో కాదనేవాడు...

ఆలోచిస్తూనే వంట ముగించింది.

ఉన్నంతలో అన్నం, బెండకాయ కూర, దోసకాయ పప్పు, నాలుగు అప్పడాలు, పెరుగు...

అతనితో కూర్చుని ఆమెకూ తినక తప్పలేదు.

అలవాటు తప్పిపోయిందేమో ఎక్కువ తినలేక పోయింది.

"ఇదన్నమాట రహస్యం.. ఎన్నేళ్ళయినా ఇలా నిత్య నూతనంగా అగుపించడానికి."

అతని పొగడ్తకు ఏడవాలో నవ్వాలో అర్ధం కాలేదు.

అప్పటికే రాత్రి పదిన్నర దాటిపోయింది, మధ్యాహ్నం బాగా నిద్రపోవడంతో నిద్రకు తొందరలేకపోయినా అతను కూర్చోవడం అంత సదుపాయంగా అనిపించటంలేదు.

అలాగని వెళ్ళమని ఎలా చెప్పగలదు?

"ఏమిటి ఆలోచనలో పడ్డారు? మీకు గుర్తుందో లేదో అప్పట్లోనూ అంతే. మమ్మల్ని మా మానాన వదిలి మీలోకంలోకి వెళ్ళిపోయేవారు." అతను గుర్తు చేసాడు.

జవాబుగా ఓ నవ్వు విసిరింది.

"మీకో నిజం చెప్పనా... మీ నువ్వు మీకొక అస్సెట్.. నిజం.. ఆ నవ్వు చూసే శ్రీ మీ వలలో పడిపోయాడా అనిపించేది. అప్పటికీ ఇప్పటికీ మీ నవ్వులో మార్పులేదు"

"థాంక్యూ"

పైకి మర్యాదకు చెప్పినా మనసులో కాస్త చిరాగ్గానే ఉంది.

"ఈ పోచుకోలు కబుర్లు ఎందుకు బాబూ, నాకేమైనా పదహారేళ్ళా పాతికేళ్ళా నీ మాటల గారడిలో పడిపోయేందుకు... ఐ నో వ్వాట్ ఐయామ్..."

"అదిగో మరో దేవుడిచ్చిన వరం ఆ తియని గొంతు. ఎంత చక్కని స్వరం - అసలు మీ పేరు వసంత కాకుండా స్వీటీ అని పెట్టుకుంటే ఎంత బాగుండేది..." మరో వెరి నవ్వు నవ్వింది.

క్షణ క్షణానికీ ఓపిక వేడి తగిలిన మంచుముక్కలా కరిగిపోతోంది.

అసహనం ఒళ్ళు విరుచుకు పడటానికి సిద్ధంగా ఉంది.

అది అతని అదృష్టమో ఆమెకి వరమో అతని సెల్ ఫోన్ మోగింది.

హాస్పిటల్ నుండి పిలుపు.

"మనమిలా కులాసాగా మాట్లాడుకోవడం ఆ భగవంతుడికి కూడా ఇష్టం లేదు. ఓకే సీయూ.. అన్నట్టు మీ ఫోన్ నంబర్ చెప్పండి ఫోన్ చేస్తాను.. మీరు వద్దన్నా వీలున్నప్పుడల్లా వస్తాను... మీ వంట తినడానికైనా... "

వసంతకు ఏమీ ఆలోచించుకునే సమయమే లేదు. అతను వెళ్ళిపోతే చాలు. గబగబా ఫోన్ నంబర్ చెప్పినా మళ్ళీ రెట్టించకుండా సెల్లో ఫీడ్ చేసుకుని బై చెప్పి వెళ్ళిపోయాడు.

తలుపు వేసుకున్నాక 'అమ్మయ్య' అనుకుంది వసంత.

✡ ✡ ✡

ఉదయం ఆరున్నరైనా కాలేదు. ట్రింగ్ ట్రింగ్‌మంటూ ఫోన్ శబ్దం.

మూగవోయినట్టున్న ఇంట్లోకి చైతన్యం దూరినట్టుగా. గబగబా లేచి వెళ్ళి ఫోన్ అందుకుంది.

"గుడ్ మార్నింగ్... నిద్ర లేపానా.." ప్రభాకర్ స్వరం..

"అవును... మీ ఫోన్ శబ్దానికే లేచాను... చెప్పండి.."

"ఏముంది... ఒకసారి హలో చెపుదామని లేస్తూనే గుర్తొచ్చావు... రోజూ వాకింగ్‌కి వెళతాను... దారిలో ఉన్నా.."

"అవునా..." ఆఫీసులో పెద్దగా మాట్లాడడు - మంచిదే అని ఊపిరి పీల్చుకుంది. కాని ఇప్పుడిలా...

"వసంతా.. ఏదైనా మాట్లాడు.. ఏదైనా నీ మాట వినాలని నీ గొంతు వినాలనే.."

"ఏం చెప్పమంటారు?"

"ఏదో ఒకటి.. పోనీ నేనే చెప్పనా? రోజూ ఈ టైమ్‌కే వాకింగికి వస్తాను. కాని ఏ రోజూ ఇవాల్టిలా ఉత్సాహంగా బయటకు రాలేదు... ఈరోజు మాత్రం ... నీతో మాట్లాడాలనే ఎప్పుడు తెల్లవారుతుందా అని ఎదురు చూసాను. "

వసంతకి సంభాషణ కాస్త ఇబ్బందిగానూ ఉంది, కాస్త ఇష్టంగా కూడా ఉంది. రోజులకొద్దీ నిశ్శబ్దం తరువాత పిలిచి పలకరించి మెచ్చుకోవడం..

"హలో.. ఉన్నావా స్విచ్ ఆఫ్ చేసుకుని వెళ్ళిపోయావా?" అతని పలకరింపుతో సర్దుకుని,"చెప్పండి" అంది.

"నువ్వే ఏదైనా చెప్పు నీ తియ్యటి స్వరంతో.. వినాలనే కదా ఫోన్ చేసాను"

"ఏం చెప్పమంటారు?"

"ఏదో ఒకటి, ఒకమాట చెప్పనా వసంతా... రోజూ నీ మాట వినే అదృష్టాన్ని పొందలేకపోయానే అని ఎంతో బాధగా ఉంది. అప్పట్లో అనసూయ చెప్పింది అయినా ధైర్యం చెయ్యలేకపోయాను... ముఖ్యంగా మీ నాన్నకు భయపడి..."

పెద్ద పెట్టున నవ్వాలనిపించింది వసంతకు.

"ఇప్పుడు ఏం కోల్పోయానో సరిచూసుకుంటే చాలా బాధగా ఉంది."

"ఎందుకు? ఏం పోగొట్టుకున్నారు లక్షణంగా బిజినెస్... మీ పిల్లలు..." అర్థోక్తిగా ఆగింది. నిజమే అతని వివరాలు అడగలేదు.

"ఎంతమంది?"

"ముగ్గురు... చెప్పానుగా అమ్మాయి పేరు వసంత అని, ఇద్దరబ్బాయిలు.. పెద్ద గొప్పగా చదువుకోలేదు.. ఇద్దరూ బిజినెస్ చూస్తున్నారు..." అంటూ ఒక్క క్షణం ఆగి,

"అమ్మాయికి నీ పేరైతే పెట్టుకున్నాను గాని నీ అదృష్టం మాత్రం రాలేదు."

"అదంతే చెప్తాలే తరువాత సమయం వచ్చినప్పుడు, ఓకే. మరి ఉండనా... టేక్ కేర్ బై"

ఫోన్ స్విచ్చాఫ్ చేసి నవ్వుకుంది వసంత.

ఉదయం తయారయేలోగా సుమ, సుమంత్ కూడా ఫోన్ చేసారు... ఎందుకో ప్రభాకర్ గురించి కాని, డాక్టర్ చైతన్య గురించి కాని చెప్పాలనిపించలేదు.

పిల్లలతో చెప్పకుండా ఆ మాటకొస్తే ఎన్నో ఏళ్ళుగా ఇది తన స్వంత విషయంగా దేన్నీ పరిగణించలేదు... అయితే శ్రీ తో పంచుకోవడం కాకుంటే పిల్లలతో అందుకే తొలిసారిగా తన విషయాలు అనుకోవడం కొత్తగా ఉంది.

గబగబా తయారయి ఆఫీస్‌కి వెళ్ళడం కాస్త రిలీఫ్‌గా ఉంది.

అన్నట్టు ఈ మధ్యే కొత్తగా మళ్ళీ రాయటం ఆరంభించింది. ఎప్పుడో చిన్నప్పుడు, బహుశా స్కూల్ రోజుల్లో ఆలవాటుండేది.

అప్పట్లో ఎవరిమీద కోపం వస్తే వాళ్ళను కుక్కగానో గాడిదగానో ఊహించుకుని కసంతా చూపిస్తూ కథ వ్రాయటం - దాన్ని గొప్పగా అందరికీ చూపించుకోవడం అలాంటిది మళ్ళీ ఇన్నేళ్ళకు..

సాయంత్రం ఇంటికి రావడంతోటే చైతన్య ఫోన్...

చూసుకోలేదు గాని చాలానే ఉన్నాయి అతని మిస్డ్ కాల్స్...

"హలో..."

"అమ్మయ్య ఇప్పటికైనా ఫోన్ ఎత్తావు.." అతని ఏక వచనానికి ఉలిక్కిపడింది. ఎప్పుడూ మీరని తప్ప మరో విధంగా పిలిచిన గుర్తులేదు. అలాంటిది...

"నేను ఇప్పుడే వచ్చాను.."

"ఎక్కడకు వెళ్ళారు...?"

ఇతనికి నేను సంజాయిషీ ఇచ్చుకోవాలా అని చాలా కోపంగా అనిపించింది కాని... కోపం చూపించేంత దగ్గరితనం లేదు.

"మీకు తెలియదు కదూ... దివ్య పత్రికలో ఉద్యోగం చేస్తున్నాను. ఆఫీస్ అవర్స్‌లో ఫోన్ ఎంత అర్జంట్ అయినా మాట్లాడటం నిషిద్ధం.."

"ఓ ... నాకు తెలియదు... ఐ యాం సారీ... మీరు ఉద్యోగం చేస్తారనే ఊహ నాకు కలలో కూడా రాలేదు. కాలక్షేపానికేగా.." యధాలాపంగానే ఉంది ప్రశ్న.

అయినా మళ్ళీ సర్రున వచ్చేసింది ఆమెకు కోపం.

ఎందుకు చేస్తే మాత్రం నీకు చెప్పాలా మహానుభావ?

ఆమెను నిశ్శబ్దానికి వదలకుండా మళ్ళీ ప్రశ్నించాడు.

"ఫైనాన్షియల్లీ యు ఆర్ క్వైట్ వెల్ ఆఫ్ ఐ థింక్"

కాకపోతే తనేమయినా తన సమస్యల్ని పరిష్కరిస్తాడా...

"కాదు... అవసరానికే ఈ ఉద్యోగం.... ఇల్లూ వాకిలీ ఉన్నంత మాత్రాన అవి అమ్ముకుని ఖర్చు పెట్టుకోలేం కదా.. ఒకే. దానికేం గాని చెప్పండి"

"మీరు తీరిగ్గా ఉంటే డిన్నర్‌కి ఇన్వైట్ చేద్దామనుకున్నాను.. కాస్సేపు సరదాగా ఏ సినిమా అయినా చూసి మంచి రెస్టారెంట్లో డిన్నర్ చేసి కాస్సేపు.. టాంక్ బండ్ మీద నడిస్తే బాగుంటుందనిపించి..."

తీరిగ్గా వుంటే నీ సరదాలు నాతో తీర్చుకుందామనుకున్నావా.. సరదాగా సినిమా చూడటానికి పక్కన ఒక ఆడమనిషి కావాలా.... మీతో డిన్నర్ తిని... మీ పక్కన వ్యాహ్యాళికి వచ్చి...

"సారీ... అలసిపోయాను..."

"అతి సుకుమారులు కదా..."

ఉలిక్కిపడింది.

ఆ మాట శ్రీ అనేవాడు...

గట్టిగా ముద్దు పెట్టుకునా ఉక్కిరిబిక్కిరై ఊపిరాడట్లేదు అంటే పెద్దగా నవ్వేస్తూ వెంటనే కాస్త సమయం ఇవ్వకుండా

"ఎందుకలా శపిస్తున్నారు నన్ను" అనేది

"శాపమా..." తెల్లబోయేవాడు

"రాజభవనాల్లో ముద్దులు పెట్టుకోరా లేకపోతే ఒట్టి గాలి రాయబారాలేనా?" అని అతన్ని గేలి చేసేది.

దానికి జవాబు మరోసారి తనను ఉక్కిరి బిక్కిరి చెయ్యడమే.

"నీ మాటలు నిజంగా చక్కని టానిక్‌లా పనిచేస్తాయి వసూ... ఎంత అలిసిపోయి వచ్చినా నీ సమక్షం క్షణంలో సేదదీరుస్తుంది" అనేవాడు.

"శ్రీ చెప్పాడు... మీ సౌకుమార్యం గురించి..."

ఏం చెప్పివుంటాడు... ఇవన్నీ చెప్పాడా? ఏమో.. ఇదో కొత్తకోణం...

భార్యకు సంబంధించిన విషయాలు కూడా మరొకరితో పంచుకుంటారా...

మనసు వికలమై పోయింది.

ఏం మాట్లాడాలనిపించలేదు.

"సరేలెండి.. కాఫీ అయినా తాగారా లేదా..."

అంత చిరాకులోనూ అతని పరామర్శ బాగుందనిపించింది.

నిజంగానే ఇలా అడిగేవాళ్ళు ఒక్కరైనా ఉండాలి....

"ఇదుగో ఇలా వచ్చాను అంతలోనే మీ ఫోన్. కిచెన్‌లోకి వెళుతున్నా మీక్కూడా కావాలా?"

"ష్యూర్! ఎలాగిస్తావు?" మళ్ళీ ఏకవచనం.

"ఫోన్లో పోస్తే సరిపోతుందిగా...."

నా పీడా కూడా లేకుండా పోతుంది... ఫోన్ లేదనే వంకతో మాట్లాడాల్సిన అవసరం ఉండదు.

అతని చెప్పేతీరుకు కిలకిలా నవ్వేసింది వసంత.

"చాలు చాలు... మీ నవ్వే చాలు. చెప్పానని ఏం అనుకోవద్దు కాని ఈ నవ్వుతోనే ప్రపంచాన్ని మీ పాదాక్రాంతం చేసుకుంటారు..... మనసును గిలిగింతలు పెట్టే నవ్వు.." అవును.

ఆ మాట తనకు తెలుసు.

చిన్నప్పటినుండి నవ్వుతూ ఉండటమే అలవాటు.

శ్రీ కూడా అలాగే అనేవాడు...

"నీ నవ్వే నా కొంపముంచింది.. పెళ్ళేవద్దనుకున్నవాణ్ణి ఇలా నీ నవ్వుకు దాసోహమై పోయాను" అని.

అంతేనా....

శ్రీ ఎంత చిరాకు పరాగ్గా ఉన్నా ఒక్కరోజూ తన పెదవుల మీద చిరునవ్వు చెరిగేది కాదు.

"తిట్టినా నవ్వేదానను నిన్నే చూసాను" అనేవాడు.

"హలో ఏంటలా సైలంట్ అయిపోయావు... ఒకే దెన్ టేక్ కేర్ మళ్ళీ ఫోన్ చేస్తాను, సరేనా.. బై"

తేనె పట్టును కదిపినట్టుగా ఉందామెకు.

✡ ✡ ✡

## 4

**చాలా రోజుల** తరువాత మళ్ళీ మిత్రురాళ్ళంతా కలుసుకున్నారు.

ఇంకా ఆమెను పలకరించేందుకు ధైర్యం చాలట్లేదు శ్రీ మిత్రులకు.

ఆ ఆదివారం పొద్దుటే తొమ్మిదైనా కాకుండానే కట్టకట్టుకుని దిగారు ముగ్గురూ.

యామిని, స్వప్నిక, వారితోపాటు రంగాచారి భార్య పద్మ, జయరాం శ్రీమతి లత కూడా వచ్చారు.

మొదట్లో కాస్త ముభావంగా ఉన్నా పదినిమిషాల్లోనే ఎప్పటిలా మాటల్లో మునిగితేలడం మామూలైంది.

"వసంతా నువ్వేనా? నాకు ఆశ్చర్యంగా ఉంది... రెణ్ణెల్ల క్రితం నిన్ను చూసినప్పుడూ గుర్తుపట్టలేదు... ఇప్పుడు గుర్తుపట్టలేకపోతున్నాను. అంత భారీ బరువునుంచి ఇలా చెక్కిన బొమ్మలా ఎలా తయారయావు మళ్ళీ?"

ఆశ్చర్యం హావభావాల్లో ఒలికిస్తూ అడిగింది యామిని. ఒక్కసారి గర్వంగా తనవంక తను చూసుకుంది వసంత.

నిజమే! రోజుకి ఇరవైమూడు గంటలు మంచానికి అతుక్కుపోయి, విపరీతంగా మారిపోయిన సమయంలో వచ్చింది యామిని.

ఆ రోజు యామిని వెళుతూనే ముందుగా చేసిన పని నిలువుటద్దంలో తనను తాను నిలువెల్లా పరిక్షించుకోవడం.

బిగువైపోయి సంచిలో కుక్కినా బయటకు వస్తున్నట్టుగా కనిపిస్తున్న జబ్బలు, బిగదీసి పట్టినట్టున్న చాతీ...., కూర్చున్నా లేచినా కాళ్ళ నెప్పులు....

దానికి తగ్గట్టుగానే టీవీలో అప్పుడే అధిక బరువు గురించి వచ్చిన యాడ్... వెంటనే కన్సల్టేషన్‌కి అపాయింట్‌మెంట్ తీసుకుని....

"మాక్కూడా ఆ రహస్యమేదో చెప్పరాదూ?"

ముందు నుంచీ కాస్త బొద్దుగానే ఉండే లత అడిగింది.

"ఉహూ..... అంత తొందరగా చెపుతామా? సీక్రెట్..." ఊరిస్తున్నట్టుగా అంది.

"పోనీ నాకు చెప్పు వసూ.. ఈ మధ్య బరువు తూచుకుంటే నెలలో ఐదు కిలోలు పెరిగాను....." మరో నాలుగయిదు సార్లు అడిగాక,

"మీక్కనక ఈ రహస్యం చెపుతున్నాను మరొకరైతే అస్సలు చెప్పేదానను కాదు...." అంటూ సీరియస్‌గా మొదలు పెడుతున్నట్టుగా ఆరంభించి,

"బరువు తగ్గాలంటే...."

"ముందో మాట చెప్పండి....... రాత్రి నైటీ వేసుకునే అలవాటుందా..." ఉందని కొందరు, లేదని కొందరు చెప్పాక....

"అలాగైతే ఇది చాలా అత్యవసరమైన విషయం, అందరూ నైటీలు కొనుకుని తీరాలి... మరి షాపింగ్‌కి ఎప్పుడు వెళదాం?"

ముందు సన్నబడే రహస్యం చెప్పవమ్మా... నైటీలు కొనడం ఎంత సేపుగానీ.... అసలు నైటీలకూ సన్నబడటానికి ఏమిటి సంబంధం?"

"ఉంది కాబట్టే కదా అడుగుతున్నదీ..." అలకలు పోయింది...

"సరే ఇక చెప్పు"

అయితే మీకు నైటీ వేసుకునే అలవాటున్నా లేకపోయినా, రాత్రి పూత మాత్రం నైటీ తీసేసి ఒట్టి పెటీకోట్ బ్రాతోనే పడుకోవాలి అదీ ఆరుబయట వెన్నెట్లో .....

వినడం పూర్తయేసరికి అందరి మొహాలు ఎరుపెక్కాయి...

"ఎక్కడ పడుకోవాలి... మాకు డాబాలేదే... వెన్నెల ఇంటిముందే వస్తుంది..." అమాయకంగా అడిగింది స్వప్నిక.

అందరూ ఒక్కసారి ఘొల్లున నవ్వారు.

పొట్టలు పట్టుకుని ఒంగిపోతూ మరీ నవ్వారు... అయిదు నిమిషాల పాటు నవ్వుతూనే ఉండిపోయారు.

ఎందుకు నవ్వుతున్నారో అర్ధం కాలేదు స్వప్నికకు.

అయోమయంగా చూసింది.

"అమ్మా తల్లీ... డాబా లేకపోతే పీడా పోయింది కాని, నువ్వు మాత్రం ఇంటిముందు పడక సీను పెట్టకు.. జాతరైపోతుంది..." అర్ధమయ్యేసరికి..."

"అవును వసూ, నైటీ ఎందుకే..లేని వాళ్ళు షాపింగ్ చెయ్యాలని చెప్పి మరీ..!? "

"నైటీ వేసుకున్నాక కద తీసేసి పడుకునేది...!! స్వప్నిక, ఓకే.. డాబా లేదు కాని రోజూ ఎక్కడ పడుకుంటావు?"

"నా రూమ్‌లోనే..."

" ఇప్పుడూ అలాగే నీ రూం లోనే పడుకో"

"మా ఆయన ఉంటాడు గదే. "

"ఉండనీ మరింత మంచిది" పెదవులు బిగించింది నవ్వునాపుకుంటూ...

"నువ్వు నిజం చెప్పటంలేదు.."

"నిజమేనే.. మీ ఆయన నిన్నలా చూసినప్పుడు కదా... నీకు మరింత ఎక్సర్ సైజ్.." అందరూ మరోసారి పడీ పడి నవ్వారు.

"అల్లరి పిల్లా..."

వాతావరణం తేలికపడేసరికి, నవ్వుతూనే,

"మరేం చెయ్యను మీరంతా ఏదో కొంపలు మునిగిపోతున్నట్టు పెదవులు బిగదీసుకుని కూర్చుంటే..."

"కాదు గాని నిజంగానే చెప్పరాదూ..."

"ఆ రోజు యామిని వచ్చి వెళ్ళాక యధాలాపంగా టివిలో అధిక బరువు గురించి ఒక కార్యక్రమం చూసాను, వెంటనే అపాయింట్‌మెంట్ తీసుకుని వెళ్ళి కలిసాను. వాళ్ళతో మాట్లాడాక మనమెంత అపోహలో అర్ధంకాని స్థితిలో బ్రతుకుతున్నామో తెలిసి వచ్చింది."

"ఏం మాట్లాడారు తొందరగా చెప్పు..."

"చెపుతాను తొందరేమిటి..? చాలా మటుకు మనకు తెలిసినవే అయినా మనం పట్టించుకోనివి..."

అంటూ విపులంగా జీవన విధానం గురించి, ఆహారపుటలవాట్ల గురించి క్యాలరీల గురించి శారీరక అవసరాల గురించి గంటన్నర సేపు అనర్గళంగా మాట్లాడింది... చివరగా ముగిస్తూ "మనం తెలుసుకోవలసినది ఒక్కటే... తినడం అనేది ఒక అలవాటు మాత్రమే..."

అంటూ లోపలకు వెళ్ళి అందరికీ మరోమారు కాఫీలు తెచ్చిచ్చింది.

"ఈ కాఫీలో ఎన్ని క్యాలరీలుంటాయి?" పద్మ ప్రశ్నించింది.

"ఇప్పుడు చెప్పను నా కాఫీ వేస్ట్ చేస్తారు.."

"సరే మరిక టాపిక్ మారుద్దాం... ఉద్యోగం ఎలాగుంది కాస్త చెప్పమ్మా!"

"అద్భుతంగా ఉంది. కాని ఉద్యోగం కాదు... ఈ మధ్య నా అనుభవాలు..."

"అవునా అయితే విని తీరాల్సిందే..."

"చెప్పు"

"చెప్పు"

"చెప్పు"

"అబ్బ అన్ని చెప్పులు నాకుందుకు బాబూ... ఒక్క జత చాలు..." అంటూ" మనమిలా మాట్లాడుతూ పోతే చివరకు మీరంతా నన్ను శపిస్తారు.... తిండిపెట్టకుండా మాడ్చానని... వంటింట్లోకి రండీ వండుతూ మాట్లాడుకుందాం..."

అందరూ వంటింట్లో చేరి ఒక్కొక్కరు ఒక్కో పని అంది పుచ్చుకున్నారు.

"ముందుగా.. నా చిన్నప్పటి అభిమాని గురించి చెపుతా వినండి..."

"పానకంలో పుడకలాగా ఈ చిన్నప్పటి అభిమాని ఇక్కడ ఇప్పుడెందుకే?"

"వచ్చాడు కాబట్టే..."

"ఎక్కడ మొదలు పెట్టను.."

"అబ్బ సస్పెన్స్ చాలుగాని ఎక్కడోక్కడ మొదలు పెట్టు..."

"సరే.. ఇంకా సాగదీస్తే కొట్టేట్టున్నారు..."

"దివ్య పత్రికలో సబ్ ఎడిటర్ ఉద్యోగానికి ఇంటర్వ్యూకి వెళ్ళానా.... గదిలో అడుగుపెడుతూనే ఓ బట్టతల బాబాయ్ వసంతా అంటూ గావు కేక పెట్టేసరికి హడలి పోయాను....

ఎంత బుర్ర బద్దలు చేసుకున్నా ఎవరన్నది గుర్తుకు వస్తేనా.... నా మొహం చదివేసినట్టున్నాడు.. ఓ వెర్రిపీనుగులా నవ్వేస్తూ పాతికేళ్ళ క్రిందటి పరిచయాన్ని తిరగదోడాడు....

అతని పేరే చిత్రంగా..... మౌన ప్రభాకర్... అయితే అతనితో ఒక్కసారీ మాట్లాడిన గుర్తు లేదు నాకు. కానీ పరోక్షంగా ఎంతో ఏడిపించిన గుర్తు....

ఇహ మొదలెట్టాడు చూడు సుత్తి... పాతిక ముప్పై ఏళ్ళుగా నన్నెలా గుర్తుపెట్టుకున్నాడో.. కూతురికి, ఫర్మ్‌కి, షాప్‌కి నా పేరే పెట్టుకున్నాడట... నన్ను చేసుకున్నందుకు నామొగుడు అదృష్టవంతుడట.. ఎప్పటికప్పుడు నాగురించి వివరాలన్నీ సేకరించినట్టున్నాడు.....

అప్పట్లో నా పైన పెద్ద వ్యామోహమే ఉండేదట..."

వసంత తనకూ ఇష్టం ఉండేదనేమాట బయటకు రాకుండా జాగ్రత్త పడుతూ... "ఇంతకూ అతను చెప్పిన మాటేమిటో తెలుసా... నన్ను ఎంతగానో ఇష్టపడ్డా మా నాన్న ఎక్కడ నరికేస్తాడోనని భయపడ్డాడట...

ఇప్పుడు మాత్రం పొద్దునా సాయంత్రం వేళ తప్పకుండా ఫోన్ చేస్తాడు.... నా గొంతువినేందుకే వాకింగ్‌కి వస్తాడట... ఇంట్లో భార్య ముందు మాట్లాడే ధైర్యం లేదు... కాని..." ఆర్ద్రోక్తిగా ఆగిపోయింది.

"ఎంత అదృష్టంవంతురాలవే... ఈ వయసులోనూ ఫాన్ ఒకడు దొరికాడంటే..."

"ఒక్కడేం ఖర్మ... మరొకడూ తగలడ్డాడు.."

"ఏం? ఈర్ష్యగా ఉందా నీకొకణ్ణి దానం చేస్తాలే..."

"నీ ఫాన్‌ల కథలమో గాని పప్పు మాడి బొగ్గయింది.." దాంతో అన్నీ మరచిపోయి మళ్ళీ వంటలో పడ్డారు.

✡ ✡ ✡

"అమ్మా".... రోజంతా స్నేహితులతో సరదాగా గడిపినా మళ్ళీ రాత్రయేసరికి ఎప్పటిలా దిగులు ఆవరించి మనసు ఉదాసీనంగా మారి నిస్సత్తువగా అటు నిద్రరాక ఇటు ఏ పనీ చెయ్యాలనిపించక ఒక రకమైన నిస్సహాయ స్థితిలో ఉన్నప్పుడు సుమంత్ ఫోన్

"చెప్పు సుమంత్ బాగున్నావా?"

ఆ పరామర్శే విననట్టుగా,

"అమ్మా, నేన్నీకో విషయం చెప్పాలి..."

"చెప్పు సుమంత్, ఎందుకంత సంశయం?"

"అమ్మా నేను ఈ సాయంత్రం రోష్నిని పెళ్ళిచేసుకున్నాను..."

"రోష్ని అంటే?"

"అవును, హిందీ సినీ స్టార్..."

ఏం మాట్లాడాలన్నా గొంతు పెగల్లేదు వసంతకు....

రోష్ని గురించి ఎన్నీ గాసిప్స్ చదవడం... వినడం...

అది సరే అసలు ఆమె ఇండస్ట్రీకి వచ్చే దాదాపు ఇరవై సంవత్సరాలు దాటింది.... అంటే ఎంతలేదన్నా ముప్ఫైకి తగ్గదు....

సుమంత్ ఇంకా పాతికన్నా దాటలేదుగా.....

అసలింకా వాడి పెళ్ళి మాటలైనా అనుకోలేదు...

భగవంతుడా....

"అమ్మా ఈ విషయం ఎవరిద్వారానో మీరు వినడమో చదవడమో... ఎందుకిదంతా అనే నేను చెప్పాను... తొందర్లో వచ్చి కలుసుకున్నప్పుడు వివరంగా మాట్లాడుకుందాం..."

"సుమంత్..." ఆదుర్దాగా పిలిచింది.

"డోన్ట్ వర్రీ మా.. ఎవ్రీ థింగ్ గోస్ వెల్.. బై..."

అటువైపు సుమంత్ ఫోన్ పెట్టేసినా ఎంతో సేపు రిసీవర్ పట్టుకుని అలాగే ఉండిపోయింది.

ఎందుకు సుమంత్ ఇలా చేసుంటాడు?

ఏ పరిస్థితులు అతన్నీ పనికి ప్రోత్సహించి ఉంటాయి?

కొంపదీసి ఏదైనా బ్లాక్ మెయిల్‌లో ఇరుక్కున్నాడా?

మనసు పరిపరి విధాల పోయింది. ఉద్విఘ్నత అణుచుకోలేక సుమంత్‌నే అడుగుదామని మళ్ళీ ఫోన్ చేసింది.

కాని ఎంత ప్రయత్నించినా,

ఓ సారి ఫోన్ స్విచ్‌డాఫ్ అనీ, మరో సారి నాట్ రీచబుల్ అనీ, ఇంకోసారి నాట్ అవేలబుల్ అనీ... జవాబులు.

విసిగిపోయి ఆ ప్రయత్నాన్ని విరమించుకుంది. అలసట, నిద్ర ఆవిరైపోయాయి. ఏం చెయ్యడం ఇప్పుడు...

శ్రీ ఇలా అర్థాంతరంగా వదిలేసి వెళ్ళిపోయాడు...

సుమ గుర్తుకు రావడంతోటే వెంటనే ఆమెకు ఫోన్ చేసింది.

ఒక్క రింగ్‌కే ఫోన్ ఎత్తి "అమ్మా నే చేస్తాలే నువ్వు పెట్టెయ్యి" అంటూ కట్ చేసింది.

సుమ రింగ్ చేసేలోగా అయిదు నిమిషాలు ఐదు యుగాలుగాతోచాయి వసంతకు.

"ఊ చెప్పు మమ్మీ"

ఐదు నిముషాలయాక ఫోన్ ఎత్తుతూనే అంది సుమ.

"సుమా! సుమంత్ ఏం చేసాడో తెలుసా..."

"చెప్పాడు మమ్మీ... నాకీ సంగతి వారం కిందటే చెప్పాడు. సినిమా ఫీల్డ్‌లో ఈ వ్యామోహాలు మామూలే... టేకిట్ ఈజీ.."

"అయినా పెద్దదానవు నీ పెళ్ళికాకుండా.."

"ఇంకా ఈ రోజుల్లో అలాటివన్నీ ఏమీటి మమ్మీ... లీవిట్... మారే తరాలతో అడ్జస్ట్ అవాలంతే..."

సుమ తమ్ముణ్ణి వెనకేసుకు రావడం ఉక్రోషంగా ఉంది వసంతకు.

"ఎంతయినా మీరూ మీరూ ఒకటే" ఠపీమని ఫోన్ పెట్టేసింది.

పెట్టేసిందే కాని మరుక్షణం నుండి ఫోన్ రింగ్ కోసం ఎదురు చూస్తూనే ఉంది. వెంటనే సుమ మళ్ళీ మాట్లాడి ఓదారుస్తుందన్న ధీమా.. ఓదార్చాలన్న కోరిక... ఎదురు చూపు ఎదురు చూపుగానే మిగిలిపోయి నిస్సహాతతో కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

ఎప్పుడో ఏళ్ళక్రితం ఎలాంటి ఇబ్బంది వచ్చినా శ్రీ గుండెల్లో తలదూర్చి వెక్కిళ్ళు పెడుతూ ఏడవడం, అతని స్పర్శ ఓదార్పులో సేద తీరడం గుర్తుకు వచ్చింది. ఒంటరిననే భావనా, నిస్సహాయత ఆమెను కృంగదీశాయి.

పక్కన ఖాళీ మంచం వెక్కిరిస్తున్నట్టు, ఈ విశాల ప్రపంచంలో తనొక్కదానికే గడ్డు రోజులు దాపురించినట్టూ విలవిలలాడిపోయింది వసంత.

✡ ✡ ✡

"హలో.."

చేస్తున్న పని ఆపి తలెత్తింది వసంత.

ఎదురుగా కొత్తమొహం. నాలుగు వెంట్రుకలు గడ్డిపోచల్లా ఆ వైపు ఈ వైపు తిప్పించి నున్నగా పి.ఒ.పి చేసిన గోడలా నిగనిగలాడుతున్న బట్టతల. కళ్ళద్దాల్లోంచి తొంగిచూసినట్టున్న చిన్న కళ్ళూ, కనిపించకుండా మీసాలు కప్పేసిన పెదవులమీద ఒక విశాలమైన చిరునవ్వు...

ఎవరో తెలియదు.

"హలో..నేను విజయేంద్ర చక్రవర్తిని.." ఈ అవనీ తలానికే చక్రవర్తినన్నంత ధీమాగా చెప్పాడు.

అయితే ఏమిటన్నట్టు చూసింది.

"కవిని, నా కవితలు బోలెడు మీ పత్రికలో అచ్చయ్యాయి.. సాహిత్య ఎకాడమీ అవార్డ్ గ్రహీతను.."

"అవునా..?"

"ఎక్స్ క్యూజ్ మి మీరీ పత్రికలో పనిచేస్తున్నారా?" ఎంత సీరియస్ గా అడుగుతున్నానని అతననుకున్నా ఆ మాట్లాడే తీరులోనే అతని పరిహాసం అర్థమయింది.

ఏం చెప్పాలి?

"ఊరికే అన్నాను లెండి..మిమ్ములను చిన్నబుచ్చాలని కాదు.. అయినా నాలాంటి ప్రతి రచయితనూ గుర్తు పెట్టుకోవాల్సిన అవసరం మీకులేదుగా.." అతని పెదవులమీద ఆత్మీయమైన చిరునవ్వు.

మనసుకు హాయనిపించింది.

"సరే మాట్లాడితే మౌనం ఖర్చవుతుందనుకుంటున్నారా? పోనీ నేనిక్కడ కాస్సేపు కూర్చోవచ్చా.."

"అయ్యో..గమనించనే లేదు, కూర్చోండి.." కంగారు పడింది.

ఛ.మర్యాద తెలీని మనిషనుకున్నాడేమో..

"మీ సెలక్షన్ చాలా బాగుంది. ఈ మధ్య వస్తున్న కథలు, కవితలూ కొత్తగా వాటి ఉనికిని చాటు కుంటున్నాయి. అప్పుడే అనుకున్నాను, ఎవరో మంచి టేస్ట్ ఉన్నవాళ్ళు పత్రికలో చేరి ఉంటారని.."

అతని అస్పష్టమయిన పొగడ్త చిత్రంగా కోపం తెప్పించలేదు.

అప్రయత్నంగా అతని నేర్పరి తనానికి మెచ్చుకోలుగా పెదవులపైకి చిరునవ్వు పాకింది.

ఈ లోగా ఆఫీస్ బాయ్ కాఫీ తీసుకువచ్చాడు. ఈ ఏర్పాటు ప్రభాకర్ దే ఏదో మాటల సందర్భంలో చెప్పింది..కనీసం అయిదారుసార్లు కాఫీ తాగేదాన్నని..అందుకే ఒద్దన్నా వినకుండా రెండు మూడు సార్లు బాయ్ వచ్చి కాఫీ అందించే ఏర్పాటు చేసాడు.

"కాఫీ తాగుతారా..?" వసంత మాట్లాడిన మొదటి మాట అది.

"ష్యూర్ మీరు తాగించాలే కానీ ఒద్దంటానా?"

బోయ్ వంక చూసింది..ఇద్దరికీ కాఫీ ఇచ్చాడు. ఆమె చూపును గ్రహించి

"థాంక్ యు.." అంటూ ఆమే కాఫీ అందించినంతగా సంబరపడిపోయాడు.

దాదాపు అరగంట పాటు కూర్చుని తన కథలు, కవితలు ఇచ్చి లేస్తూ..

"మీరేమీ అనుకోనంటే ఒక మాట చెప్పకుండా వెళ్ళలేను. మీ స్వరం చాలా మధురంగా ఉంది..."

అతని మాటల్లోనూ కవిత్వధోరణి కనిపిస్తూనే ఉంది.

"థాంక్ యూ.."

ఆ ప్రశంస చిన్నప్పటినుండీ వుంటూన్నదే.

అయినా ఏదో పులకింత.!

"అన్నట్టు మీ ఫోన్ నంబర్ చెప్పండి.."

అప్రయత్నంగానే చెప్పింది.

"సీ..యూ. మళ్ళీ వచ్చినప్పుడు కలుస్తాను"

హుందాగా నడుచుకుంటూ వెళ్ళిపోయాడు. వసంత మళ్ళీ తన పనిలో పడిపోయింది.

రెండున్నరకు కాబోలు మరింక పని చెయ్యాలన్న ధ్యాస లేకపోవటంతో తటపటాయిస్తూనే ప్రభాకర్ కు ఫోన్ చేసింది.

"వాటె..సర్ప్రైజ్! నువ్వు ఫోన్ చెయ్యడమా! చెప్పు..చెప్పు. వసంతా" ఎక్జైట్ అవుతూ అడిగాడు.

"మరేం లేదు. పనిచెయ్యాలని అనిపించడం లేదు. హాఫ్ డే వెళ్ళి పోవచ్చా?"

"మరీ ఇంత అమాయకురాలివైతే ఎలా వసంతా? యూ కెన్ డిమాండ్.వెళ్తున్నానని చెప్పాలి కాని . ఈ ఆఫీస్‌లో నీ ఇష్టం వచ్చినప్పుడు రావచ్చు, నీ ఇష్టం వచ్చినప్పుడు వెళ్ళవచ్చు. నీ రెస్ట్రిక్షన్స్ ఎటాల్.."

"థాంక్ యు.."

"బై ద వే.. ఎక్కడకు వెళ్దామని?"

ఉలిక్కిపడింది వసంత.

తీరికగా ఉన్నానంటే.. ఏదో అంటాడు. అందుకనే

"నా ఫ్రెండ్ అర్జంట్ గా రమ్మని ఫోన్ చేసింది. ఏదో మాట్లాడాలి.." అంది.

"ఓకె..తీరిగ్గా ఉంటే నన్ను మర్చిపోకు."

ఆఫీస్ నుండి బయటపడి రోడ్డెక్కాక గాని ఏం చెయ్యాలన్నది ఆలోచించలేదు వసంత.

యామిని గుర్తుకువచ్చింది. చాలా రోజులైంది వాళ్ళని కలిసి . ఒక్కసారి సర్ప్రైజ్ జర్క్ ఇస్తే ఎలాగుంటుంది అనిపించింది.

అనుకున్న తడవుగా యామిని దగ్గరకు బయలుదేరింది.

దారి పొడుగునా మిత్రుల జ్ఞాపకాలతోనే సాగింది.

యామిని బాంక్ లో ఏం చేస్తూ ఉంటుంది? ఎంత బిజీగా ఉండి ఉంటుంది?

తన రాక కలలో కూడా ఊహించుకోదు. తలకుంటేనే థ్రిల్లింగ్ గా అనిపించింది.

బ్యాంక్ ముందు దిగి నేరుగా యామినిని వెతుక్కుంటూ కౌంటర్ దగ్గరకు వెళ్ళింది. తలకూడా ఎత్తలేనంత బిజీగా తనపని తాను చేసుకుంటూ పోతూనే ఉంది యామిని.

రెండు నిమిషాలు..మూడు నిమిషాలు..తలపైకెత్తదే!

సన్నగా గొంతు సవరించుకుంది వసంత.

"చెప్పండి"

అప్పటికీ తలెత్తకుండానే పనిచూసుకుంటూ అడిగింది.

"సన్నబడడానికి ఏదైనా కొత్త టెక్నిక్ కావాలేమోనని.."

దిగ్గున తలెత్తి..

"వసంతా..వాటె వండర్! నాకు నమ్మ బుద్ధి కావడం లేదు. నిజమేనా!?"

"ఒక్కసారి గిల్లి చూసుకో. లేదంటే ఆపని నన్ను చెయ్యమన్నా రెడీ.."

"లోపలకు రా.."

వసంత లోపలకు వెళ్ళి యామిని పక్కన కుర్చీలో కూచుంది.

యామిని ఆశ్చర్యానికి జవాబుగా "మీ కందరికీ ఒక షాక్ లాంటిది ఇద్దామనిపించింది. అందుకే అనుకున్నదే తడవుగా ఆఫీస్ వదలి వచ్చేసాను.."

"ఒక్క ఐదు నిమిషాలు.."

యామిని లోపలకు వెళ్ళి ఎవరితో మాట్లాడిందో ఏమిటో , సరిగ్గా పదినిమిషాల్లో ఇద్దరూ బయటకు వచ్చారు.

"కూసే గాడిద వచ్చి మేసే గాడిదను చెడగొట్టినట్టు నే వచ్చి నిన్నూ పనిచెయ్యకుండా.."

ఈ లోగా యామిని ఎవరికో ఫోన్ చేస్తుండడంతో ఆపేసింది.

"హలో..స్వప్నికా..నీకెంత అర్జంటు పనైనా ఉండనీ గాక పదినిమిషాల్లో నీ ఆఫీస్ ముందుంటాను. బయటకు వచ్చి రెడీగా ఉండు. ఒక వండర్. సెలవే ఐదు పది నిమిషాలు పనికాదు. ఐదారు గంటలు.."

మళ్ళీ వసంత మాట్లాడబోయే లోగానే చేత్తో సైగ చేసి మరో ఫోన్ కాల్ చేసింది.

"హలో పద్మనేనా? పద్మా..ఇంట్లోనే ఉన్నావా? సరిగ్గా అరగంటలో నేనూ మరో ఇద్దరం మీ ఇంటి ముందుంటాము. లతకి కూడ ఫోన్ చేసి పిలువు. మిగతా సంగతులు సమక్షంలో.."

" ఊఁ..ఇప్పుడు చెప్పు.."

"అదే. కూసే గాడిద వచ్చి మేసే గాడిదను చెడగొట్టినట్టు నే వచ్చి నిన్నూ పనిచెయ్యకుండా చెయ్యడమే కాకుండా ఇదంతా ఊహించలేదు. ఏదో ఇంపల్సివ్ గా వచ్చేశానే గానీ.."

"ఏదీ నీ కూత వినిపించనే లేదు. పిచ్చి వసూ..మేమంతా కూడా ఏ అవకాశం దొరుకుతుందా ఇలా ఒక రోజు రిలాక్సవడానికి అనే ఎదురుచూస్తుంటాము. నీకు తెలుసు గాని మరోసారి విను. రోజూ కనీసం మీ మిత్రులతో మాట్లాడేందుకు ఓ అరగంట కేటాయిస్తున్నారా? మంచిదే ..లేదా ఆరుగంటలు డాక్టర్ తో గడిపి ఆయనకు దక్షిణ కూడా సమర్పించుకోవాలి అన్నాడో పెద్ద మనిషి."

"పెద్ద మనిషి గనుకే అనుంటాడు.."

"సరే! మరి మనిషికి స్త్రీ వచనం ఏముంటుంది?"

"పెద్ద.."

ఏం తోచక ఇద్దరూ ఒకర్నొకరు చూసుకుని నవ్వుకున్నారు.

ఇద్దరూ మాట్లాడుతూ స్వప్నిక ఆఫీస్ కి వెళ్ళారు.

వసంతనూ, యామినినీ చూడగానే స్వప్నిక ఎంత సంతోషించిందో వర్ణించడానికి మాటలు చాలవు.

"ఇలాగని చెప్తే ఒక్క పూటేమిటీ ఓ పదిరోజులన్నా సెలవు పెట్టేసే దాన్ని.."

"వసంతా నిన్ను చూస్తుంటే ఈర్ష్యగా వుందే మరీ ఇలా వయసు వెనక్కు పరుగెత్తుతున్నట్టు. ఇంత నాజూకుగా ఎలా అవుతున్నావే..?"

ముగ్గురూ కలిసి పద్మ ఇంటికి చేరే సరికి లతకూడా అక్కడకు వచ్చింది.

"మీ ఇల్లు ఎంచుకున్నది ఎందుకో తెలుసా!? ఇక్కడైతే మనల్ని ఎవ్వరూ డిస్టర్బ్ చెయ్యరు."

నలుగురూ హాల్లో కి చేరారు. టి.వి.లో మామూలుగా వంటల కార్యక్రమం వస్తోంది.

"అమ్మా తల్లీ ఆ టివి. ఆపెయ్యి లేకపోతే ఆ వంటలిక మళ్ళీ జన్మలో తినలేం. అంత అసహ్యంగా వండటం చూపిస్తాడు.."

హాయిగా కార్పెట్ మీద సెటిలయారు మిత్రులంతా.

"చెప్పు వసంతా మా మీద ఇంత హఠాత్తుగా ఇలా దయ గలగడం మా అదృష్టం.."

" నా అదృష్టం మీకూ పంచుదామని.."

"అది సరే ఇందాకటి నుంచి చూస్తున్నాను. ఎలా నాజూగ్గా తయారవుతున్నావో చెప్పమంటే పెద్ద ఫోజ్ కొట్టి మాట దాటేస్తున్నావు, నీ పద్ధతేమీ బాగుండలేదు." స్వప్నిక కోపగించుకుంటున్నట్టుగా అంది.

"అవును, నా ట్రేడ్ సీక్రెట్స్ అన్నీ మీకు ఫ్రీగా  ఎలా చెప్తాను?"

"ఓకె.. ఊరికే కాకపోతే ఫీజు తీసుకుని మరీ చెప్పు.."

"ఏం ఫీజిస్తారు? సరే నేనేం చెప్తే అది చెయ్యాలి మరి.."

"సరే" "సరే" "సరే" నాలుగు స్వరాలు జవాబిచ్చాయి.

"ఏముంది..చాలా సింపుల్.ఒక్కొక్కళ్ళు కనీసం నలుగురు ఫాన్లను పెట్టుకోవాలి.."

"ఫాన్లా?"

"అవును.."

"ఎక్కడ పెట్టుకోవాలి?"

"ఏమిటి ఎక్కడ పెట్టుకోవటం.? ఓ ఫాన్లంటే ఆ అర్ధానికొచ్చారా? కాదు ఫాన్ ..ఫాన్ అంటే ఆరాధకులు!"

"ఓహో.."

"అయితే!?"

"అయితే ఏమిటి? అంతే నలుగురు ఫాన్లు ఉన్నారంటే నువ్వు చిక్కి సగమవకపోతే చూడు.."

"ఏమిటో ఏం చెప్పినా సూటిగా చెప్పవు కదా?"

"సూటిగా చెప్పడాని కేముంది? వడ్లగింజలో బియ్యపు గింజ. ఎప్పుడైతే నలుగురు ఆరాధకులు మీకుంటారో ఒక్కక్కరితో

సగటున గంట మాట్లాడినా నాలుగు గంటలు వాళ్ళతోటే సరా!? ఎంత వూఁ..అన్నా ఆఁ.. అన్నా ఎంత ఎనర్జీ ఖర్చు! మరో మాట మనలో మనం అనుకున్నా ఫాన్ అనేవాడు మెచ్చుకు తీరాలన్న రూల్ ఒకటుందిగా. దాంతో మనకే అనిపిస్తుంది కాస్త బాగా కనిపించాలని అంటే బాడీ కాన్షియస్‌నెస్..ఆ పైన ఆఫీస్ పని ..నాలుగ్గంటలు వీళ్ళకే స్పేర్ చేసాక ఇక వండుకు తినే కోరిక తీరిక ఎక్కడుంటుందే అమ్మా! అందుకే మినిమమ్ నలుగురు ఫాన్స్ అన్నది రూల్.."

అప్పటికే నవ్వు ఆపుకుందుకు ఆపసోపాలు పడుతున్నారు మిగతావారు.

"అయితే నీకు నలుగురు ఫాన్స్ ఉన్నారంటావు!?"

"నలుగురేమిటీ నేను ఊఁ..అనాలే కానీ తెల్లారేసరికల్లా నలభై మంది నా గుమ్మం ముందు ఉంటారని నాకు తెలుసు.." ఒక్క క్షణం ఆగి " ఈ నలుగురో నలభై మందో మరెందరైనా కానీ..వాళ్ళకు నా శరీరమే కొలమానం..!" అంటూ శుష్క హాసం చేసింది వసంత!!

***

## 5

**అంతలోనే తనను** తాను సవరించుకుని

"బహుశా నాకే ఇది కొత్తగా ఉందేమో... ఇన్నాళ్ళూ మర్రివృక్షంలాంటి శ్రీ నీడన ఒదిగి హఠాత్తుగా నడిరోడ్డున నిలబడ్డ ఫీలింగ్"

శ్రీ ప్రసక్తి వచ్చేసరికి ఒక్కరూ నోరు విప్పలేదు.

మళ్ళీ తనే వాతావరణాన్ని తేలిక చేస్తూ

"సరే ఎంతవరకు వచ్చాం... అదే ఫాన్ల విషయం..."

అంటూ మాట తప్పించింది.

"ఆ విషయం తరువాత మాట్లాడుకుందాం గాని.. మీలో కొందరికైనా తెలిసి ఉండాలి. అడగాలా వద్దా అని మీరు అనుకునే లోగా నేనే చెపుతాను. మా సుమంత్ పెళ్ళి చేసుకున్నాడు..." అని క్షణం ఆగి "హిందీ యాక్ట్రెస్ రోష్నిని..."

"నిజమా?"

"ఎప్పుడు...."

"ఎక్కడా?"

"పేపర్లో చూసానుగాని అడగాలా వద్దా అన్న తటపటాయింపు...."

"మీరడిగిన ప్రశ్నల్లో కొన్నింటికి మాత్రమే నాకు జవాబు తెలుసు ఈ సంగతి అక్షరాల నిజం - సుమంతే చెప్పాడు గనక, ఎప్పుడు ఎక్కడ అనేది వాడొచ్చినప్పుడు అడుగుదాం....."

"వసంతా...." ఏదో అనబోయింది యామిని.

"ఇట్స్ ఓకే యామినీ.... నేనూ ముందు కొంచెం.... కొంచమేమిటి చాలానే మధనపడ్డాను కాని.... లెట్ దెమ్ హోప్ దైర్ ఓన్ విల్......

రేపొద్దున ఇలాంటి పిల్లను చూశావు అలాంటి పిల్లని అని అనేకంటే... అదీకాక... మన జీవితం మనం బ్రతుకుదాం... అందరి జీవితాలూ మనమే బ్రతకాలంటే ఎలా..."

"ఇంతకీ అసలు విషయం వదిలేసి పక్కదారులు పడుతున్నాము" సీరియస్‌గా అంది స్వప్నిక.

"ఓకె, లెట్ అజ్ కమ్ టు ద పాయింట్.... ఈనాటి మన ఎజెండాలో రెండు విషయాలు ఉన్నాయి ఒకటి ఫాన్స్.... రెండు స్విమ్మింగ్."

అందరూ ఒప్పుకుంటే ఇక డిస్కషన్ ఆరంభిద్దాం"

"ఇహ అయినట్టే, ఇప్పటికే లంచ్ కూడా లేకుండా మలమలమాడుతున్నాను, దానికి తోడు ఈ డిస్కషన్ ఒకటా... ముందు ఏదైనా తింటేనే మాటలు... లేదంటే ఇలాగే వాలిపోయి... "కార్పెట్ మీద వాలిపోయింది.

"ఆ పాపం నాకెందుకు గాని ఒక్క నిమిషం, ముందు విందు కార్యక్రమం తరువాతే మన మీటింగ్" డిక్లేర్ చేసింది పద్మ.

పదినిమిషాల్లో టేబుల్ సెట్ చేసి అందరినీ లోపలకు పిలించింది.

అపిటైజర్లతో సహా లంచ్ రెడీగా ఉంది.

వేడి వేడిగా పకోడీలు డైట్ కోక్‌తో లాగించాక మళ్ళీ హాల్లోకి చేరారు. ఓ పక్క మ్యూజిక్ సిస్టంలో మంద్ర స్థాయిలో వినిపిస్తున్న రాగాలు....

"ఇహ మొదలుపెట్టు"

"ఎక్కడ మొదలు పెట్టాలో తెలియడం లేదు.... నాకు ఆశ్చర్యంగా ఉన్నది ఏమిటంటే... నేనేమైనా చెవిలో పూలు పెట్టుకుని ఉన్నాననుకుంటారో, లేదా, ఇంకా లోకం తెలీని అమాయకురాలననుకుంటారో!? ఆ మాత్రం మనుషులను అంచనా వేసుకోలేనా?

మరో చిత్రం అందరూ నాకు ఏళ్ళుగా పరిచయం ఉన్నవాళ్ళే, కాని ఇప్పటి ఈ కోణం మాత్రం కొత్త.

ప్రభాకర్ సంగతే చూడండి. ఎప్పుడో చిన్నప్పటినుండి ఆరాధన అంటాడు, మళ్ళీ మా నాన్న నరికి ముక్కలు చేస్తాడని పెళ్ళి ప్రసక్తి తేలేదట... ఎప్పటికప్పుడు నా వివరాలన్నీ సేకరిస్తూనే ఉన్నాడట.... నా మీద అభిమానంతోనే కూతురికి నాపేరే పెట్టుకున్నాడట, అన్నింటికీ నా పేరే. వసంత ఇంటీరియర్స్, వసంత మెడికల్స్ అన్నీ వసంతమయమే.... కానీ ఈ సంగతి ఇన్నేళ్ళుగా చెప్పనిది ఇప్పుడు ఏం ఆశించి చెపుతున్నాడు? మరి ఇన్నేళ్ళుగా ఈ మాటలు ఎందుకు చెప్పలేదు? ఇప్పుడు హఠాత్తుగా ఎక్కడ లేని దగ్గరతనం ఒలకపొయ్యటం ఎందుకు?

జీవితమంత పిరికితనం వెంటేసుకు తిరుగుతున్నవాడు.... ముందు మా నాన్నకు భయపడ్డాడు, తరువాత శ్రీ ఉండగా ఒక్కరోజు మాట్లాడేందుకు ప్రయత్నించలేదు, ఇప్పుడు భార్య ఎదురుగా, మరొకరి ఎదురుగా మాట్లాడడు... కాని ఎక్కడలేని ప్రేమలు ఒలకబోస్తాడు... అలాగని బయట పడరు..... ఇదో రకం దాగుడుమూతలాట....

మరో పక్క డాక్టర్ చైతన్య అతనూ అంతే! కాదంటే దారులు వేరు..."

"వసంతా ఒక్కమాట అడగనా? ఏం అనుకోవుగా?"

"ఏం అనుకునే దూరం మనమధ్య లేదనే అనుకుంటున్నాను..."

"ఒకవేళ... ఒకవేళ శ్రీ ఉన్నప్పుడే ఎవరైనా ఈ మాటలు చెప్పివుంటే ఏం అనేదానవు?"

నిరుత్తురాలైంది వసంత. ఆ సంగతి ఆలోచించనేలేదు.

"తప్పని నేను అనను... స్నేహానికి ఆడైనా మొగైనా పెద్ద తేడా ఉండదు... కాని మనం కూడా ఒక పరిధిలో ఇమిడిపోయి ఎవరి పరిచయానికి స్పందించం..... ఎంతసేపూ పిల్లలు భర్తవాళ్ళ చుట్టూనే మన ఆలోచనలూ జీవితమూ తిరుగుతుంటాయి.

ఒకసారి ఆ పరిధిలోంచి బయటకు వచ్చాక కాని మళ్ళీ మామూలుగా మనగురించి మనం పట్టించుకోము... మనమూ అంతే! "

"పిల్లలు చిన్నప్పుడు ఏం చెయ్యాలన్నా ముందు వాళ్ళ వెసులుబాటే ఆలోచించేవాళ్ళం కదా.... " స్వప్నిక ఆగింది.

"అవును" కూడబలుక్కుంటున్నట్టుగా అంది వసంత.

"అంతే కాదు వసంతా.... ఒకరకంగా మన ఉనికిని మనం మరచిపోయి రంగూ రుచీ వాసనా లేని జీవితాన్ని గడిపాము. ఒక్కసారి మనలో మనం ఆలోచించుకుంటుంటే మనసు మనం ఎలా మలుచుకున్నామో అర్ధమవుతుంది.

మనమంతా పెద్ద కుటుంబాల్లో పుట్టిన వాళ్ళమే.... ఇంచుమించు మధ్యతరగతి బ్రతుకులే అందరివీ.... చిన్నప్పుడు నీకేరంగు ఇష్టం, ఏ వంట ఇష్టం, కనీసం ఎవరంటే ఇష్టం అని ఒక్కరయినా మన ఇష్టా ఇష్టాలు అడిగారా?

కిక్కురుమనకుండా వాళ్ళ పరిధిల్లో మనం బ్రతికాం. ఇహ పెళ్ళయ్యాక చేసుకున్నవాడు అడిగినా అడగకపోయినా ఆయన వంకాయ తినడు, అందుకని అరటికాయే వండుతాను అనుకుంటామే కాని ఇది నాకిష్టం ఇదెందుకు వండకూడదని అనుకోంగా? ఆ తరువాత పిల్లల మంచీ చెడు అదే జీవన పరరమార్ధమవుతుంది, వీళ్ళు మనజీవితాల్లోంచి తప్పుకున్నాక కాని మనకు మనం గుర్తుకురాము."

"అవును, నిజమే ఎప్పుడూ గట్టిగా అనుకోలేదుగాని పిల్లలు పెద్దయాక గాని మన ఇష్టాఇష్టాలు గుర్తుకురావు" పద్మ ఒప్పుకుంది.

"అక్కడే వస్తుంది పెద్ద చిక్కంతా, ఇదివరలోలా పిల్లలు మనచుట్టూ తిరగట్లేదని మనబాధ.... వాళ్ళ లోకం మారిపోయిందని మనం గుర్తించి మన లోకం సృష్టించుకోవాలి"

మాటలు రెక్కలొచ్చిన బుల్లిపిట్టల్ల తలోవైపుకూ ఎగిరిపోయాయి. రాత్రి ఎనిమిదైనా ఒక్కళ్ళకూ కదలబుద్ధి కాలేదు ఐనా తప్పదన్నట్టుగా సెలవు తీసుకున్నారు.

"ఇంకా మనమేమీ మాట్లాడుకోనేలేదు..." అన్న అసంతృప్తి ప్రతివారిలో మిగిలిపోయింది.

✡ ✡ ✡

సీరియస్‌గా వ్రాసుకుంటున్న వసంత డోర్‌బెల్ శబ్దానికి ఉలిక్కిపడింది. రాత్రి తొమ్మిది దాటింది. ఎవ్వరూ రారన్న ధైర్యంతోటే నైటీ వేసుకుని, విశ్రాంతిగా రాసుకోవడం మొదలుపెట్టింది. లేచివెళ్ళి బెడ్‌రూమ్ కిటికీలోంచి మెయిన్ డోర్ వైపు చూసింది.

నడుం మీద ఒక చెయ్యి ఆనించి ఎదురు చూస్తున్నట్లుగా నిల్చుని ఉన్నాడు చైతన్య.

నైటీ మార్చుకు వెళితే... ఈలోగానే మరో రెండు సార్లు డోర్ బెల్ మోగింది.

ఇక తప్పదన్నట్టుగా వెళ్ళి తలుపు తీసి ఒక్క నిమిషం కూర్చోండి అంటూ బెడ్ రూములోకి నడిచి ఎదురుగా కనిపించిన చీర అందుకుంది.

డ్రెస్ అయి వసంత వెళ్ళేసరికి చైతన్య న్యూస్ పేపర్ తిరగేస్తున్నాడు.

"చెప్పండి... ఎలాగున్నారు?"

"ఎదురుగా కనిపించినప్పుడే పరామర్శలు.... ఒక్కసారైనా ఫోన్ చేసి అడగొచ్చుగా..." నిష్టూరంగా అన్నాడు.

నవ్వేసి ఊరుకుంది.

"చెప్పండి... ఏమిటి సంగతులు?"

"ఏమున్నాయి, మామూలే... ఇల్లు ఆఫీసు వండుకోవడం తినడం..."

"నిన్ను చూస్తుంటే అలా అనిపించడంలేదు...."

ఉలిక్కి పడింది – మళ్ళీ నిన్ను..

"ఎక్కడా వంటచేసుకుని తిన్నట్టు కనిపించడం లేదు.."

జవాబివ్వకుండా నిశ్శబ్దంగా ఉండిపోయింది.

"మీరూ నేనూ ఒకే పడవలో ప్రయాణిస్తున్నాము. తిన్నా తినకపోయినా ఎవరూ అడగరు... నన్ను తప్పుగా భావించకండి ఏదో ఒకరికొకరు మాట సాయం అంతే... ఒంటరిగా ఉన్నారని మీవెంట పడుతున్నాననే భావనే వద్దు..."

"ఛ.. అలా ఎప్పుడూ అనుకోను...."

"మీరనుకున్నా అనుకోకపోయినా ముందు నేను క్లియర్‌గా ఉండాలిగా."

కాని వసంత అనుమానాలు వసంతకున్నాయి. అతను మాట్లాడుతున్నంత ఫెయిర్ కాదేమోనని ఎక్కడో చిన్న సందేహం.

"ఇఫ్ యు డోంట్ మైండ్ రండి ఎక్కడయినా డిన్నర్ చేసి వద్దాం"

"ఎందుకు? ఇంట్లో వంట చెయ్యలేనా?"

"కాదు, నేనొచ్చి ఈ రాత్రి మిమ్మలను ఇబ్బంది పెట్టను... అయినా మీరు వంట చేస్తూ కూర్చుంటే ఐ ఫీల్ బోర్డ్... సరదాగా మాట్లాడుకుంటూ... మీకు ఇష్టమైతేనే"

కాదనటానికి కారణం కనిపించలేదు.

లోపలకు వెళ్ళి మొహం కడుక్కుంటూ ఆలోచించింది.

"నేను చేస్తున్నది సరైన పనేనా? శ్రీ లేడని ఇష్టారాజ్యంగా ప్రవర్తిస్తున్నానా?"

శ్రీ ఉంటే ఆ మాట వేరు

హఠాత్తుగా ఎప్పుడో పాతికేళ్ళ క్రితం జరిగిన సంఘటన మనసులో మెదిలింది.

పెళ్ళయిన కొత్త.

ఆరోజుల్లో అసలు ఎవరితోనైనా మాట్లాడేందుకే బిడియంగా అనిపించేది.

అందులో ప్రేమించి పెళ్ళిచేసుకోవడమంటే లేచి పోయినట్టుగానే భావించుకునేవారు.

చాలా మటుకు ఎక్కడకూ ఒక పట్టాన వెళ్ళేది కాదు. కాని రామ్ ప్రసాద్ సంగతి వేరు. ఇద్దరూ చిన్నప్పటినుండీ కలిసి చదువుకున్నారు. ఒకే స్కూల్, ఒకే కాలేజ్... ఉండేదీ ఒకే వీధిలోనే.... అందులో పెళ్ళికి వచ్చిన ఐదారుగురిలో అతనూ ఒకడు.

పెళ్ళయ్యాక మొదలు డిన్నర్ ఇచ్చింది అతనే.

ఎప్పుడు వచ్చినా ఇద్దరూ డాబా మీదకెళ్ళి గంటల కొద్దీ మాట్లాడుకుణేవారు.

మధ్య మధ్యలో వసంత కూడా వెళ్ళి కూర్చునేది.

అప్పట్లో ఆవిడ డెలవరీకి పుట్టింటికి వెళ్ళడంతో అతనే ఎక్కువగా వచ్చేవాడు.

వచ్చినప్పుడల్లా ఐదారుగంటలు సరదాగా గడిచిపోయేవి.

వాళ్ళబ్బాయిని చూసేందుకు అతని అత్తగారింటికి వెళ్ళిన గుర్తుకూడా.

నాలుగైదేళ్ళ తరువాత కాబోలు సుమను ఎత్తుకుని ఒకసారి వాళ్ళింటికి వెళ్ళారు.

ఎంటరవుతూనే ఒక పొడవాటి సిట్ అవుట్.... ఆ వెనక చాలా విశాలమైన లివింగ్ రూం. ముందు అతను సిట్ అవుట్‌లోనే కూర్చునే ఏర్పాటు చేసాడు.

ఓ పదినిమిషాల తరువాత అతని భార్య వచ్చింది, ఇప్పుడు ఆవిడ పేరేమిటో కూడా గుర్తుకు రావడంలేదు.

"లోపలకు వెళదాం" అంటూ వసంతనొక్కదాన్నీ లివింగ్‌రూములోకి తీసుకు వెళ్ళింది. ఇద్దరూ లోపలకూర్చుని రెండూనిమిషాలయినా గడవకముందే శ్రీని అక్కడే వదిలేసి రామ్ ప్రసాద్ లివింగ్ రూములోకి వచ్చి కూర్చుని మాట్లాడటం మొదలు పెట్టాడు.

వసంతకది ఎబ్బెట్టుగా తోచింది. శ్రీని కూడా లోపలకు తీసుకువచ్చి కూర్చుంటే పోయేదిగా.....

కొడుకుని ఎత్తుకుని చెపుతున్నాడు "అదిగో చెల్లాయి బావుంది కదూ..."

వసంతకి ఏం అర్థంకాని స్థితిలో ఏం చెయ్యాలో తోచలేదు.

పదినిముషాల్లో అక్కడినుంచి బయటపడ్డాక శ్రీతో చెప్పిన మొదటిమాట "నాకీ రోజు అతని ప్రవర్తన ఏమాత్రం నచ్చలేదు. మిమ్మల్ని అక్కడ కూర్చోపెట్టి లోపల మామిందు కూర్చుని ఏమిటా పద్ధతి? అతని ధోరణి ఏ మాత్రం బాగోలేదు.... "

"వాడో పిచ్చోడు" అని శ్రీ తేల్చేసినా అతనూ హర్ట్ అయినట్టుగా తెలుస్తూనే వుంది. అంతే! మళ్ళీ అతను రావడం గానీ వీళ్ళు వెళ్ళడం గాని జరగలేదు.

అలాంటిది ఇప్పుడు....

ఏం చెయాలి వెళ్ళాలా? వద్దా? అనవసరంగా కమిట్ అయ్యానా? ఏదో వంక చెప్పి రాననేసి ఉంటే పొయ్యేదా?

ఇప్పుడైతేనేమి ఏదో ఒకటి చెప్పి తప్పించుకోవచ్చుగా?

ఆలోచిస్తూనే జుట్టు సవరించుకుని తృప్తి పడక దువ్వెన అందుకుంది.

అన్యమస్కంగానే హాల్లోకి వెళ్ళింది.

"ఇప్పుడు తప్పదా? పోనీ ఇంట్లోనే ఏదో ఒకటి వండేస్తానుగా..."

"నీకు రావాలని లేకపోతే వద్దు... అయితే నేనూ వంటింట్లోకి వచ్చి నీకు సాయం చేస్తాను......."

మళ్ళీ వసంత సందిగ్ధింలో పడింది.

వెనుక నుయ్యి ముందు గొయ్యి.

మనసులో గొణుక్కుంటూనే పైకి మాత్రం "మీ ఇష్టం" అంది.

"అన్నం కూరలు అంటూ ఇప్పుడు హైరానా ఏం వద్దుగాని... సింపుల్‌గా ఉప్మానో అయినా సరిపోతుంది" జవాబివ్వకుండా లోనికి నడిచింది.

చైతన్య షూస్ విప్పుతున్నాడు.

వంటింటిలోకి అడుగు పెట్టి వారమైనా అయివుంటుంది.

అయినా పనిమనిషి వస్తుంది గనక ఎక్కడి వస్తువులక్కడ నీట్‌గానే ఉన్నాయి.

కిచెన్‌లో నుంచుని ఒక్కసారి కలయజూసింది వసంత.

"అబ్బా! ఇప్పుడిదో తలనొప్పా?" అనిపించింది.

ఉప్మా చేసేందుకు ఒక్క రవ్వ తప్ప మరేమీ లేదు. ఆవాలు లేవు, పచ్చిమిరపకాయలు లేవు.

ఇంట్లో ఉన్నవల్లా బియ్యం, కందిపప్పు మొదలైనవే.

అదృష్టవశాత్తూ ఉల్లిపాయలు మాత్రం ఉన్నాయి.

పెసరపప్పు కనిపించడంతో అమ్మయ్య అనుకుని పులగం చేస్తే సరిపోతుందని తీర్మానించింది.

ఉల్లిపాయలు కోసేలోగా చైతన్య లోపలకు వచ్చాడు.

"చూసారా? నే చెప్పింది ఎంత నిజమో! ఏది ఎక్కడా వంట చేసిన గుర్తులే లేవు మరి..."

దొరికిపోయిన దొంగలా నవ్వేసి ఊరుకుందామె. వంట చేస్తున్నంత సేపూ ఏదో ఒకటి మాట్లాడుతూనే ఉన్నాడు.

మధ్య మధ్యలో "నువ్వు కూర్చోరాదూ? నేనూ ఆ మాత్రం వండగలనులే" అనడం.

"ఈ మాత్రం పదినిమిషాల వంటకు ఇద్దరు కావాలా" అంటు ఆమె వారించడం, మొత్తానికి శ్రమ తెలియకుండా అతని మాటలు మంచి ఉత్సాహాన్నిచ్చాయి.

చల్లగాలి వస్తుందని విండో కర్టెన్ పక్కకు తొలిగించినప్పుడు అప్రయత్నంగానే ఆమె పెదవుల మీద చిరునవ్వు బుగ్గల్లో మందారాలు విరిసాయి.

"ఎందుకు నవ్వుతున్నారు?"

అతను అడిగే వరకూ తననే గమనిస్తున్నాడన్న సంగతి తెలీలేదామెకు.

"అబ్బే" అందే కాని తడబాటు దాచుకోలేకపోయింది.

ఎందుకంటే ఏం చెప్పాలి?

ఆ బాల్కనీకి ఎదురుగా సరిగ్గా రోడ్డుకి ఆ వైపున ఐదంతస్తుల అపార్ట్మెంట్స్ బిల్డింగ్ ఉంది.

వసంత వంట గదిలో చాలా బిజీగా పరధ్యానంగా ఉన్నప్పుడు శ్రీ అదాటుగా రావడం, వెనకనుంచి వచ్చి పొట్టమీద అతని చిరు స్పర్శ... ఉలిక్కిపడేది.

"చాల్లెండి, ఇదెక్కడి ఫ్రీ షో, ఎదురుగా జనాలకు, టిక్కెట్ లేని సినిమాలా..." అనేది.

"చూడనీవోయ్ తప్పేమిటి? నేనేమయినా వాళ్ళెవరి పెళ్ళాలనూ ముట్టుకోవట్లేదే? నా భార్య, నా ఇష్టం..."

ఆ సంగతి గుర్తుకు వచ్చే పెదవుల మీద నవ్వు పాకి వచ్చింది, చెక్కిళ్ళ మీద ఎరుపుకు మెరుపుకు తోడుగా....

ఆమె ఇబ్బంది గమనించినట్టుగా మాట తప్పించి

"సరే, నేను టేబుల్ సెట్ చెయ్యనా" అంటూ ఆమె వారిస్తున్నా ప్లేట్లు, గ్లాసులు, నీళ్ళ బాటిల్ డైనింగ్ టేబుల్ మీద సర్దాడు.

చాలా రోజులకు ఇంట్లో మరొకరి కోసం వండటం, మరో వ్యక్తి తోడు మనసుకు బాగానే అనిపిస్తోంది.

"ఈ మధ్య కాలంలో ఏమైనా సినిమాలు చూసారా?" చాలా కాజువల్‌గా ఉందతని ప్రశ్న.

"అబ్బే ఏళ్ళయి వుంటుంది" వెంటనే అప్రయత్నంగా వచ్చింది జవాబు.

"అతను లేకుండా సినిమాలు చూడనని శ్రీకి మాటిచ్చారా?"

ముందు అతనేమి అన్నాడో అర్థం కాలేదు. అర్థమయాక కోపం తన్నుకు వచ్చింది.

అతనెవరు తన స్వంత విషయాలు మాట్లాడటానికి - అనిపించింది.

"నేనెవరు మీ స్వవిషయాల్లో తలదూర్చడానికి అనుకుంటున్నారా??" మనసు చదివినట్టుగా అతని నోట వచ్చిందామాట.

"ఈ క్షణంలో ఎవరైనా అలాగే ఆవేశపడతారు.... కాని ఒక విషయం జీవితమన్నాక ఇలాంటి ఎడబాట్లు కోల్పోవడాలూ తప్పవు.... ఒకరు ముందు ఒకరు వెనక. ఎంత మేడ్ ఫర్ ఈచ్ అదర్‌లా బ్రతికినా ఇద్దరూ ఒక్కసారే పోరుగా....

అలాగని సతీ సహగమనమో పతీ సహగమనమో చెయ్యలేంగా....

ఫిలసాఫికల్‌గా ఆలోచించినా భగవంతుడు మనకు ప్రసాదించిన జీవితాన్ని కడదాకా సద్వినియోగ పరచుకోవాలిగా..... ఆలోచించండి"

జవాబేమీ ఇవ్వలేకపోయినా ఆమె మనసు మాత్రం ఎదురు తిరగలేదు.

గబ గబా తినడం ముగించి

"హాల్లో న్యూస్ చూస్తుంటాను" అంటూ అతను వెళ్ళాడు, కాని తనక్కొంత ఏకాంతం అవసరమనే వెళ్ళాడు ఆమెకు అర్థమయింది.

పదినిమిషాల తరువాత వసంత ముందుగదిలోకి వచ్చేసరికి పదిగంటల వార్తలు అప్పుడే ముగిసాయి.

"చూసారా మాటల్లో పడి ఎక్కువ తినేశాను..... ఆయాసంగా కూడా ఉంది. కాస్సేపు అలా రోడ్డుమీద తిరిగి వద్దాం రండి. ఓ పదినిమిషాలు వాకింగ్"

మారుమాట్లాడకుండా అతని వెనకాల నడిచింది.

"ఆఫీస్‌లో మీ పనేమిటీ?"

అతను యధాలాపంగానే అడిగినా ఆమె అత్యుత్సాహంగా చెప్పడం మొదలు పెట్టింది.

"ముందుగా వచ్చిన రచనలన్నీ తేదీల వారిగా, వేటికవి సార్ట్ చేసుకోవడం, అంటే కథలు వేరుగా, వ్యాసాలూ, కవితలూ విడివిడిగా....

ఆపైన వాటిని చదివి..."

"అన్నీ చదువుతారా?"

"ఓ పేజీ చదవగానే దాని సత్తా ఏమిటో తెలిసిపోతుంది.... ఏ మాత్రం పనికి వస్తుందనిపించినా ఆసాంతం చదువుతాం.... కొందరు అచ్చు ప్రింట్లో మాదిరి వ్రాసి పంపితే కొందరు మాత్రం అక్షరాలు తప్పులు వ్రాస్తారు...........

ఎంచుకున్న రచనలు డీటీపి కి పంపడం పూర్తి పత్రిక సెట్టింగ్ చూసుకుంటూనే కొత్త మార్పులు చేర్పుల గురించి ఆలోచించడం...." ఏకధాటిగా చెప్పుకు పోతున్న ఆమె ఆగి, అతని వంక చూసి, నెమ్మదిగా తలదించుకుని

"బాగా సుత్తి కొట్టానా?" లో స్వరంలో అడిగింది.

పెద్దగా నవ్వేశాడు.

"ఇలా ఫ్రీగా మాట్లాడండి మనసుకెంత హాయిగా ఉంటుందో మీకే తెలుస్తుంది"

దగ్గర్లోని పార్క్‌లో సిమెంట్ బెంచ్‌మీద కూర్చున్నారు.

దాదాపు రెండూ గంటలు ఎలా గడిచాయో ఇద్దరికీ తెలియలేదు.

పదకొండున్నర దాటాక లేచి బయలుదేరారు. దారిలో ఐస్క్రీం తిని ఇంటికి చేరాక వసంత తాళం తీసి తలుపులు తెరిచేవరకూ ఆగి

"గుడ్ నైట్... ప్రశాంతంగా నిద్రపొండి"

ఆమె లోపలికి వెళ్ళి తలుపేసుకున్నాక గాని అతను కదిలి వెళ్ళలేదు.

✡ ✡ ✡

## 6

పది రోజులపాటు వసంతను కంప్యూటర్ ట్రైనింగ్‌కి పంపించాడు ప్రభాకర్.

"ఇప్పుడవన్నీ అవసరమా? ఆ ట్రైనింగ్ లేకుండా ఉద్యోగం చెయ్యలేనా?" అయిష్టంగా అడిగింది.

"టెక్నాలజీ పెరిగేటప్పుడు మనను మనం అప్‌డేట్ చేసుకోవాలి తప్పదు. ఎందుకు మనం వెనకబడి ఉండాలి? ఇదేం బ్రహ్మ విద్యా? ఒకటో తరగతి పిల్లాడు నేర్చుకోగాలేంది మనం నేర్చుకోలేమా?" అంటూ పట్టుబట్టాడు.

"ఒకవేళ పదిరోజుల్లో రాలేదనుకో?"

"దాందేం పోయింది. మరో పదిరోజులు వెళుదువుగాని.... అయినా ఇందులో గొప్పగా రావడం అంటూ ఏమీ ఉండదు... చూస్తావుగా..." భరోసా ఇచ్చాడు ప్రభాకర్.

మరింక తప్పదన్నట్టుగానే వెళ్ళింది వసంత.

ఆశ్చర్యకరమైన విషయం ఏమీటంటే ఎంత అనాసక్తితో వెళ్ళిందో అంతకు రెట్టింపు ఆసక్తితో మంచి శ్రద్ధగా ప్రతి అక్షరం విని సందేహాలు వస్తే అడిగి తెలుసుకుని మరీ పదిరోజుల్లో అనుకున్నదానికంటే ఎక్కువగానే నేర్చుకోగలిగింది.

నిజంగానే తిరిగి ఆఫీసుకి వచ్చాక వసంతకు అనిపించింది.

టెక్నాలజీ జీవితాల్ని ఎంత సులభతరం చేసింది అని.

పేజ్ సెట్టింగ్, వెబ్ డిజైనింగ్ నేర్చుకున్నాక పత్రిక మరింత సుందరంగా ఎవరిమీదా ఆధారపడకుండా స్వయంగా తీర్చిదిద్దగలుగుతోంది.

ప్రభాకరం వ్యాపార దృష్టి మరోసారి అవగాహనకు వచ్చిందామెకు.

తన పత్రిక సర్క్యులేషన్ పెంచుకునేందుకు ఎంత దూరం ఆలోచించాడు?

ఎందుకో ఒక్కసారి చిన్నతనం గుర్తుకు వచ్చింది.

ఈ స్వలాభాపేక్షతోనే కాదూ ఎంత ఇష్టం ఉన్నా తన గురించి కించిత్తయినా ముందడుగు వెయ్యనిది..... జీవిత కాలమంత పిరికితనం.... ఏమైపోతానోనన్న బెదురు.... వెంటనే శ్రీ మనసులో మెదిలి కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

నువ్వు లేకుండ జీవితమే లేదు, ఏమై పోనీగాక నిన్ను విడవలేనన్న శ్రీ ఎక్కడ...ఎక్కడ? ఎక్కడ శ్రీ...

కన్నీళ్ళతో చూపు మసక బారింది.

కనుకొలుకుల చివర ఆగిన కన్నీటి బొట్టు ఇప్పుడో ఇహనో చెక్కిళ్ళపైకి దూకేందుకు సిద్ధంగా ఉంది. అటూ ఇటూ చూసి ఎవరూ చూడట్లేదనిపించాక కళ్ళు నులుముకుంటున్నట్టుగా కొనగోటితో కన్నీటిని తుడుచుకుంది.

మనసులో ఎక్కడా లేని దుఃఖం పెల్లుబికింది.

చటుక్కున లేచి బాత్‌రూమ్‌లోకి వెళ్ళి ఓ రెండు నిమిషాల పాటు ఏడ్చి మొహం కడుక్కుని మరోసారి చల్లటినీళ్ళు మొహాన చల్లుకుని బయటకు వచ్చింది.

ఎంత దాచుకుందామని ప్రయత్నించినా ఆమె కళ్ళు ఎర్రదనం మాత్రం దాగటం లేదు.

అన్యమనస్కంగానే పని ముగించింది.

ఇంటికి వెళ్ళాలనిపించలేదు.

అదే బందిఖానా లాంటి ఇల్లు అదే ఒంటరి పోరాటం.... ఎన్నేళ్ళు ఎన్నాళ్ళిలా... చావుకోసం ఎదురుచూస్తూ బ్రతకాలి?

ఉలిక్కిపడింది... చావు కోసం ఎదురు చూస్తూ.......

ఎక్కడి నుండి వచ్చిందామాట......

చాలా ఏళ్ళ క్రితం....

ఏడాది పాటు ఎన్ని బాధలు పడింది? మై గాడ్!

నిజంగా నరకమే అనుభవించింది.

అసలు మళ్ళీ బ్రతికి బట్టకడతానా... ఈ పిల్ల ఏమౌతుంది అని దిగులు పడిన రోజులు ఎన్నో....

సుమ పుట్టేసరికి...

కాదు కాదు... ఎన్నో ఒడిదుడుకుల మధ్య ఒత్తిళ్ళ మధ్య దాంపత్య జీవితంలోకి అడుగుపెట్టడం చాలా యాంత్రికంగానే జరిగింది.

ఎంతో ఇష్టపడి ప్రపంచాన్ని పక్కకొడ్డి చేసుకున్న శ్రీ అంటే వల్లమాలిన ప్రేమాభిమానాలు.

అలాగని ఒక్కరోజూ సాంప్రదాయకంగా అతని కాళ్ళు కడిగి నెత్తిన పోసుకోవడమో, అతనన్న మాట జవదాటకపోవడంలాంటివి ఎప్పుడూ చెయ్యలేదు.

కాని ఒక్కమాట మాత్రం తనకు తాను మనసులోనే ముద్రించుకుంది.

నిజానికి వైవాహిక జీవనానికి మనశ్శరీరాలు రెండు సిద్ధంగా లేవు.

నచ్చిన వాడిని చేసుకుందన్న తలిదండ్రుల కోపం, మరో వంక పెంచి పెద్దజేసిన వాళ్ళను కాదని దమ్మిడీకి కొరగాని పిల్లను తమ ఇష్టా ఇష్టాలతో నిమిత్తం లేకుండా కొడుకు చేసుకున్నాడన్న అత్తమామల నిర్దాక్షిణ్య అయిష్టత మనసు మూడుచుకు పోయిన భావన....

కాని రాత్రి శ్రీ ఇంట్లో అడుగు పెడుతూనే పురివిప్పిన నెమలి అయ్యేది.

తొలినాళ్ళలో మానసికంగా నేనింకా సన్నద్ధం కాలేదని అతన్ని దూరంగా ఉంచినా.... పూర్తిగా ఆలోచించుకున్నాక జీవితంలో ఎప్పుడూ అతని ఇష్టాలను కాదనకూడదనే నిర్ణయానికి వచ్చింది.

అలాగని శ్రీ మరీ స్వార్థంతో తన సుఖమే ముఖ్యమని ఏనాడు అనుకోలేదు.

ప్రతి క్షణం, ప్రతి నిమిషం ఆమె ఆనందం గురించి ఆరాటపడేవాడు. ఏ మాత్రం అసంతృప్తిగా, అయిష్టంగా అగుపించినా వెంటనే అడిగేవాడు.

"ఇష్టం లేదా చెప్పు వసంతా... నేనేమీ నీ ఇష్టా ఇష్టాలతో నిమిత్తం లేని పశువును కాను " అనేవాడు.

అయినా "అబ్బే అలాంటిదేమీ లేదండి" అని నవ్వేసేది.

అందుకే ఎన్ని ప్రణాళికలున్నా అవి ఆచరణలోకి రాలేకపోయాయి.

దానికి తోడు ఎంత పెద్ద కార్డియాక్ సర్జన్ అయినా శ్రీలోని అమాయక బాల మనస్తత్వం ఆమె పరిధిని దాటి పోలేదు.

ఏమూలో తను అసమర్థుడనేమో నన్న అనుమానం అతనిలో ఉన్న సంగతి అనతికాలంలోనే ఆమెకు అర్థం అయింది. పెళ్ళయిన రోజునుంచీ తండ్రి కావాలని కలలుగనే వాళ్ళుంటారంటే స్వయంగా తెలుసుకోకపోయివుంటే నమ్మలేకపోయేది. రెండూ మూడు నెలల్లోనే నాకంత అదృష్టం లేదేమోనని వాపోయే అతనికి ఇక ప్లానింగ్ గురించి ఎలా చెప్పాలి?

అందుకే ఏడాది తిరిగేసరికి అమ్మ అవడం తప్పలేదు.

సుమతో ఎన్ని బాధలు పడ్డారని?

నిండా ఇరవై ఏళ్ళయినా లేని తనకు పిల్లను ఎలా సముదాయించాలో తెలిసేది కాదు. అప్పటికి రాజీ కొచ్చిన అమ్మ కొన్నాళ్ళు చూసినా ఎల్లకాలం చూడలేదుగా?

అత్తగారు పిల్లలను చూసే ప్రసక్తే లేదు.

అప్పటికే వేరు వచ్చేసారు..........

కొడుకును వలలో వేసుకుందనీ... తమ బిడ్డను తమకు కాకుండా చేసిందనీ..... ఎన్నెన్ని అభాండాలు....

ఎన్ని జరిగినా నోరెత్తడానికి లేదు.... ఏదైనా అంటే శ్రీ వాళ్ళను పూర్తిగా వదిలేసేందుకు సిద్ధమవటం, కాదంటే నాకోసం కొంచం ఓపిక పట్టు వసంతా, ఎప్పుడో నీ మంచితనం అర్ధం చేసుకోకపోరని ఆశాభావం వ్యక్త పరచేవాడు..........

నిర్లిప్తంగా నవ్వుకోవడం తప్ప చెయ్యగలిగేది ఏముంది?

ఇంతకూ ఈ మానసిక సమస్యలు ఇలాగుంటే మరోపక్క ఆర్థిక సమస్యలు.....

అందుకే వెంటనే మరో బిడ్డను పోషించే స్తోమతు లేక ఈ మాట అతనితో చర్చించలేక దగ్గరలోని లేడీ డాక్టర్ దగ్గరకు వెళ్ళి ఆవిడ సలహా మీదే 'కాపర్ టి' ఉత్తమమని నిర్ధారించుకుని దానితో ఒక మూడేళ్ళయినా పిల్లల చింతలేకుండా ఉండచ్చని అనుకుంది. కాని సమస్యలన్నిటికీ అదే ఆరంభమని అనుకోలేదు.

నెలరోజుల తరువాత కాబోలు ఉదయం లేస్తూనే కళ్ళు తిరగడం మాటిమాటికీ బాత్రూమ్‌కి వెళ్ళవలసి రావడంతో అనుమానం వచ్చింది. సుమ పుట్టకముందు ఈ బాధలన్నీ అనుభవించినవే....

వెంటనే లేడీ డాక్టర్ దగ్గరకు వెళ్ళి విషయం చెప్పకుండా చెకప్‌కి వచ్చానంది.

పరీక్షిస్తే కాపర్టి లేదు.

వెంటనే ఎక్స్‌రే - దరిమిలా అన్ని పరీక్షలూ అయ్యాక తేలినది ఎలా జరిగిందో కాని అది శరీరంలో ఉంది కాని యుటెరస్‌లో లేదు.

డి అండ్ సిలు సమస్త ప్రయత్నాలూ అయాక మిగిలినది ఎమర్జన్సీ ఆపరేషన్ ఒకటే. దాన్ని ముందు శరీరంలోంచి తియ్యకపోతే ధనుర్వాతం రావచ్చు లేదా ఏ ఇంటర్నల్ ఆర్గన్‌ని అయినా ఛేదించిందంటే మిగిలేది మరణమే.

ఎలాగయితేనేం ఆపరేషన్ చేసి మజిల్‌లో ఇరుక్కున్న దాన్ని బయటకు తీసారు కాని వసంత బాధలు అక్కడితో ఆగిపోలేదు.

ఒక సూచర్ తగ్గక మాటిమాటికీ ఓపెన్ అయి నీరు కారడం, ఏడాది పాటు కడుపులో రంధ్రంతో ఇక నా రోజులు ముగిసిపోయాయనే అనుకుంది. ఏడాది దాటాక మళ్ళీ చర్మం డీప్‌గా స్క్రేప్ చేసి కుట్లు వేసినా మళ్ళీ మూడో రోజున నీరు రావడంతో జీవితం మీద ఆశ వదులుకుంది.

కాని నెమ్మది నెమ్మదిగా మానుతూ వచ్చింది.

అప్పుడే అనుకుంది ఎప్పుడు ఏ బాధలు పడాలో ఏం జరగాలో ఖచ్చితంగా ఎన్నో జన్మలకిందే వ్రాసి పెట్టి ఉంటుంది... ప్రతివాళ్ళూ నిమిత్త మాత్రులే అని.....

అయినా మళ్ళీ మళ్ళీ ఈ నిరాశ నిస్పృహ.......

ఒక్కసారా రెండుసార్లా?

ఎన్ని సార్లు నారోగా మృత్యువు పక్కనుంచి వెళ్ళిపోలేదు? ఓ సారి ట్రైన్ డీరైల్‌మెంట్ మరోసారి ఒరుసుకుంటూ పోయిన కారు..... ఆరోజున ఏమాత్రం తగిలినా వెనక్కు పడిపోవడం పైనుంచి ఏదో ఒక వాహనం దూసుకెళ్ళడం జరిగేదే... చాలా సార్లు శ్రీని అడిగింది - ఎప్పుడైనా ఏదైనా జరిగి నేను లేకపోతే ఏం చేస్తారని.

"ఏం చేస్తాం.... చచ్చే వరకు బ్రతకాలి ఏదో ఒకరకంగా..."

అవును నేనూ అదే చెయ్యాలి... కాని ఏదో ఒకరకంగా కాదు. ప్రతినిమిషం సార్ధకం చేసుకుంటూ.........

✡ ✡ ✡

హఠాత్తుగా సుమ ఫోన్ చేసి ఈ రాత్రికి ఫ్లైట్ ఎక్కుతున్నాను. రేపు రాత్రికి చేరతాను అనే సరికి కంగారు మొదలైంది.

ఇంత చెప్పాపెట్టకుండా వస్తే ఎలాగ అని కూడా ప్రేమగా విసుక్కుంది.

ప్రభాకర్‌కి ఫోన్ చేసి చెప్పి ఆఫీస్‌కి పదిరోజులు సెలవు విన్నవించుకుంది. మొదట్లో కాస్త నసిగినా కూతురు వస్తోందనేసరికి అతను కాదనలేదు.

కర్టెన్లన్నీ మార్చి ఇల్లంతా దగ్గరుండి పనిమనిషితో క్లీన్ చేయించడం, ఇంట్లోకి కావలసినవన్నీ అమర్చుకోడంలోనే సమయమంతా గడిచిపోయింది. బెడ్ షీట్లు పాతభారాయని కొత్తవి కొంది.

ఎప్పుడూ అద్దంలా ఉంచే ఇల్లేనా ఇది. దీంట్లో ఎలా ఉండగలిగానిలా అని ఆశ్చర్యపడింది.

మధ్యలో ఎక్కడో హాల్ట్ ఉంటే అక్కడినుండి ఫోన్ చేసింది సుమ. ఏర్‌పోర్ట్‌కి వస్తానంటే వద్దని వారించింది.

"ఊరు కొత్తా? ఇల్లు కొత్తా? పైగా సెక్యూరిటీ చెక్ అంటూ గంటలు గంటలు తినేస్తాడు... మేమే వస్తాంలే" అంటూ ఫోన్ పెట్టేసింది.

ఫోన్ పెట్టేసాకగాని మేమే అంటే ఎవరనే ప్రశ్నఆమెకు స్ఫురించలేదు.

స్ఫురించాక మనసు పరిపరివిధాలుగా ఆలోచిందింది. రాత్రంతా కలత నిద్రే.. అస్పష్టమైన కలలే!

తెల్లవారుతూనే మళ్ళీ పనిలో పడిపోయింది.

కూతురికి ఇష్టమని మైసూర్ పాక్ చేసింది. మొదట్లో వంట చెయ్యడమంటే ఎంత ఇష్టమో! కనిపించిన కొత్త రుచులల్లా నేర్చుకుందుకు ప్రయత్నించేది.

అప్పట్లో ఎవరూ తనలా వంట చెయ్యలేరని గర్వంగా అనిపించేది కూడా.

మైసూర్ పాక్ ఎన్నిసార్లో ప్రయత్నించాక గాని సరైన విధానం అబ్బలేదు. కాని ఒకసారి కిటుకు తెలిసిపోయాక అది చిటికెలో చేసే వంటగా మారిపోయింది..

దాంతోపాటు కాస్త కారప్పూస....

ఇటీవలి కాలంలో వంట అనేది పూర్తిగా వదిలెయ్యడం వల్లో ఏమో గాని కాస్త పనికే ఎంతో అలసటగా అనిపించింది.

సాయంత్రం బజారుకి వెళ్ళి అందమైన ఫ్లవర్ బొకేలు తెచ్చి అమర్చింది.

ఫ్లైటు అరైవల్ గురించి ఫోన్ చేసి కనుక్కుంది.

మనసులో కొంత అలజడి కొంత ఉత్సాహం... చిన్నప్పటి నుండి కూతురితోటే చనువు ఎక్కువ... ఇంటికి కావలసిన షాపింగ్ చాలా మటుకు ఇద్దరూ కలిసి వెళ్ళే చేసేవారు.

మళ్ళీ కూతురితో షాపింగ్ ఊహించుకుంటేనే ఆమెకు త్రిల్లింగ్ గా ఉంది.

రాత్రి పన్నెండున్నరకు ఇంటి ముందు టాక్సీ ఆగుతూనే తలుపు తీసి బయటకు వచ్చింది వసంత.

డోర్ ఓపెన్ చేసి బయట కాలు పెట్టిన సుమ తల్లిని చూసి... రెండడుగులు ముందుకు వేసి "అమ్మా, ఎలాగున్నావు?" అంటూ ఒక్క క్షణం అమ్మ కౌగిట్లో ఒదిగిపోయింది.

వసంతకే ఆ స్పర్శ కొత్తగా తోచింది. జీన్స్ పాంట్, స్లీవ్‌లెస్ టాప్‌లో సన్నగా చువ్వలా ఉన్న ఆరడుగుల కూతురిలో ఏదో నిండుదనం.

ఆమె ఆలోచనలను ఆటంక పరుస్తూ, తల్లి చేతుల్లోంచి విడివడి అప్పుడే టాక్సీ దిగిన అతణ్ణి పిలుస్తూ, "కమాన్ రాబర్ట్ దిస్ ఈజ్ మై మామ్.... అమ్మా రాబర్ట్" అంటూ పరిచయాలు ముగుంచింది.

ఎన్నో మాట్లాడాలనుకున్న వసంత మనసు పరిపరివిధాలపోవడంతో లోపలకు నిశ్శబ్దంగా దారి తీసింది.

సుమ ఏదో ఒకటి మాట్లాడుతున్నా అనాసక్తంగానే జవాబులిచ్చింది.

స్నానాలు ముగించి కాస్త కాఫీ తాగి కూర్చున్నాక రాబర్ట్‌ను కంటి కొసలనుంచి గమనించింది వసంత. ఎర్రగా తోలు గీసేసిన కందగడ్డలా ఉన్నాడు. రాగి రంగు తెలుపు కలిసిన జుట్టు... ఎంతలేదన్నా నలభై పై మాటే అనిపించేలా ఉన్నాడు.

సూట్‌కేస్ తెరిచి తల్లి కోసం తెచ్చిన వస్తువులు ఏవేవో బయటకు తీస్తోంది సుమ.

"అర్ధరాత్రి అవుతోంది పడుకోరాదూ.... ప్రయాణంలో అలిసిపోయినట్టున్నావు పొద్దున చూసుకోవచ్చుగా.." పల్చ బారిన కూతురి చెక్కిళ్ళను పరీక్షగా చూస్తూ అంది.

"అదేమిటి? తినకుండానే పడుకోమంటావా? కొంపదీసి ఏమీ వండలేదా! ఏమిటి?" ఆశ్చర్యంగా అడిగింది సుమ.

"అబ్బే అలాగని కాదు..... వంట చేసాను గాని ఇంతరాత్రి తింటారో లేదోనని..." లేచి గబగబ వంటింట్లోకి నడిచింది వసంత. చల్లారిన వంటకాలు మైక్రోవేవ్‌లో వేడి చేసి డైనింగ్ టేబుల్ సిద్ధం చేసింది.

ప్లేట్లో సరిగ్గా పిడికెడన్నం, సుమకు ఇష్టమని చేసిన ఆలూ ఫ్రై మాత్రం ఇష్టంగా వడ్డించుకుంది... మామిడికాయ పప్పు... పెరుగు...

సుమ ఇష్టంగా తినడం తెలుస్తూనే ఉంది. రాబర్ట్ మాత్రం కష్టపడి ఒగర్చుకుంటూ తిన్నాననిపించాడు....

భోజనాలు ముగిసాక వసంత మిగిలిన వంటకాలు సర్దుకుని వచ్చేలోగా రాబర్ట్‌కి రెండో బెడ్‌రూమ్‌లో పడక ఏర్పాట్లు చేసి... "ఐ విల్ స్లీప్ విత్ మైమామ్" అంటోంది సుమ.

ఇద్దరూ వసంత పడకగదిలో మంచం మీద వాలారు.....

ఎప్పుడో చిన్నప్పుడు పక్కన పడుకున్న చిన్నారి సుమ మళ్ళీ ఇన్నాళ్ళకు.... కాని ఎంత అంతరం!

ఈ కొన్నాళ్ళలోనే సుమ ఎందుకిలా పరాయిదానిగా అనిపిస్తోంది?

కాస్సేపటిలోనే ఏదో మాట్లాడుతూ మాట్లాడుతూ సుమ నిద్రలోకి జారిపోయినా వసంతకు మాత్రం నిద్రపట్టలేదు.

ఎప్పుడో తెల్లవారుఝామున.... కాస్త కునుకు పట్టినా వెంటనే మెళుకువ వచ్చేసింది.

హడావిడిగా లేచి వంటగదిలోకి వెళ్ళేసరి సుమ ఫ్రెష్ అయి స్టౌ దగ్గర ఉంది.

"అప్పుడే లేచేసావా? పాలు తాగుతావా?"

"మా నిద్ర సమయాలు అడ్జస్ట్ అయ్యే సరికి టైమ్ పడుతుంది కాని మొహం కడుక్కునిరా... టీ రెడీ...."

ఆశ్చర్యంగా సుమ వంక చూసింది. మొన్న మొన్నటి వరకూ పాలే తాగేది.....

"టీ అలవాటు చేసుకున్నాను.... రాబర్ట్ టీ తాగుతాడు... ఇద్దరికీ చెరొకటీ ఎందుకని........."

రాబర్ట్ టీ తాగడానికీ సుమ టీ అలవాటుకూ లంకె ఏమిటో వసంతకు అర్థం కాలేదు.

ఇద్దరూ టీ తాగడం అంటే.... తనూ రాబర్ట్ అనా లేక నన్ను కలిపి అంటోందా..

మొహం కడుక్కుని వచ్చేసరికి టేబుల్ మీద మూడు కప్పుల్లో టీ ఆమె అనుమానాలాను నివృత్తి చేసాయి...

ఎందుకో సుమ టీ తాగడం మనసుకు నచ్చడం లేదు.

పిల్ల చేతుల్లోంచి జారిపోయిన ఫీలింగ్.

మోకాళ్ళ వరకే ఉన్న పైజమా లాంటిది వేసుకుని వచ్చిన రాబర్ట్ ముందు కూర్చోవడం ఇబ్బందిగానే ఉంది.

సుమ మాత్రం నైటీలో నిన్న మొన్న ఇంట్లో తిరిగిన పిల్లలాగే...

"అమ్మా! నువ్వు ఎక్జయిట్ అవనంటే ఒక మాట చెప్పాలి."

అయోమయంగా చూసింది కూతురివంక.

"అఫ్‌కోర్స్ నువ్వు అర్థం చేసుకుంటావు. నాకా నమ్మకం ఉంది... నువ్వు అందరి అమ్మల్లా కాదు..."

అంటే ముందరి కాళ్ళకు బంధాలు వేస్తోందన్నమాట.

"చెప్పు"

"అమ్మా నేనూ రాబర్ట్ గత ఆరునెలలుగా కలిసి ఉంటున్నాము.... ముందుగా పెళ్ళి విషయం ఏమీ అనుకోలేదు గాని... ఇప్పుడూ పుట్టబోయే బిడ్డకోసం అనుకోవలసి వచ్చింది. అందుకే గత వారం చర్చిలో మా పెళ్ళి రిజిష్టరయింది. రాబర్ట్ అయిదారేళ్ళ క్రితమే తన మొదటి భార్యతో విడిపోయాడు. ... అన్ని విషయాలూ సవివరంగా మాట్లాడుకున్నాకే ఈ నిర్ణయానికి వచ్చాము..."

వెర్రిదానిలా చూసింది సుమ వంక.

"మళ్ళీ చాలా రోజులు రాలేనని ఒకసారి రాబర్ట్‌ను నీకు పరిచయం చేద్దామనీ..."

"సుమ... ఎందుకు మీరిద్దరూ ఇలాంటి జీవితాలను ఎంచుకుంటున్నారో నాకు అర్థం కావటంలేదు... వాడికి వాడూ అంతే... మీ డాడీతో పాటు నేనూ లేననుకున్నారా? నేను మీకోసం ఏమీ చెయ్యలేని అసమర్థురాలననుకున్నరా?" వసంత గొంతు దుఃఖంతో పూడుకుపోయింది.

"అబ్బ! ఈ సీన్లే నాకు నచ్చనివి....ఎందుకు మీ ఒక్కరికే అన్నీ తెలుసనుకుంటారు.... మా జీవితాలగురించి మాకు తెలీదా? వాటిని మేం నచ్చినట్టు మలచుకోకూడదా? ఆ రోజుల్లోనే ప్రేమించి పెళ్ళి చేసుకున్న మీ ఆదర్శం మీ వరకేనా? డోంట్ మేకిట్ ఎ ఫస్ అమ్మా..."

మరింకేమీ చెప్పవలసినది లేదన్నట్టు లేచింది.

నేలలో పాతేసినట్టుగా కుర్చీలోంచి కదల్లేదు వసంత.

అరగంట తరువాత రెడీ అయి వచ్చిన సుమ ఏమీ జరగనట్టుగా "బిర్లా మందిర్ వరకూ వెళదాం వస్తావా?"

వస్తానలో రాననాలో తెలియలేదు వసంతకు... ఏం చెపితే ఏ రియాక్షన్ ఎదురవుతుందో....

"వెళ్ళి రండి వచ్చేలోగా వంట చేస్తాను..."

"సరే... రాబర్ట్‌కి కారం ఎక్కువ అలవాటు లేదు.... ముందుగా కొంచెం తీసిపెట్టు... అన్నట్టు రాబర్ట్‌కి ఫ్రైడ్ రైస్ చాలా ఇష్టం... మసాలా తక్కువ వేసి చెయ్యి. తొందరగానే వస్తాం..." రమ్మని మరోసారి బలవంతం చేస్తే వెళదామనుకున్న వసంత నివ్వెరపోయింది.

రాబర్ట్‌కి అది ఇష్టం, ఇది నచ్చదు అనేది గుర్తుంది కాని అమ్మకు ఏది ఇష్టం, ఏది నచ్చదు అనేది గుర్తుంచుకోవలసిన అవసరం లేదా?

"లేదు... ఇప్పుడు అమ్మ అవసరం ఏముంది?" మనసు జవాబు చెప్పింది.

గిర్రున పది రోజులు ఎలా గడిచిపోయాయో తెలీదు.

సుమ వచ్చిందని సుమంత్ ఒక రోజు వీలు చూసుకుని వచ్చి వెళ్ళాడు.

తమ్ముడి కోసం సుమ ప్రత్యేకంగా తెచ్చిన ఎలెక్ట్రిక్ రేజర్. ఫర్ఫ్యూమ్స్ అందించినప్పుడు.... ఇవి తెచ్చానని నాతో ఒక్కమాటా అనలేదే అనిపించింది వసంతకు.....

సుమకు రాబర్ట్‌కు బట్టలు కొనిచ్చాడు సుమంత్ అవి కూడా కొన్నానని కాని ఇవ్వమని కాని వసంతతో ఒక్క మాటా అనలేదు.

వసంత మనసు చిన్నబుచ్చుకుంది.

ఇక నా ప్రసక్తి ఎవరికీ అవసరం లేదా?

కనిపెంచి పెద్ద చెయ్యటం వరకేనా?

తరువాత ఏళ్ళుగా పెనవేసుకున్న అనుబంధాన్ని ఇలా త్రుంచేసుకోవాలా?

మిత్రులకు విందు ఏర్పాటు చేద్దామన్నా ఇద్దరూ ఒప్పుకోలేదు...

కోడల్ని తీసుకు వస్తే బాగుండేదన్న మాటకు ఎక్కడమ్మా... ఇక్కడ తనను తీసుకు రావడం పెద్ద సమస్య.. సెక్యూరిటీ కావాలి... జనాలను ఆపలేం... అంటూ నసిగాడు...

సుమ ఇప్పట్లో ఇక రాలేదని తెలిసి మాటలు కూడ గట్టుకుని అడిగింది "ఎన్నో నెల?"

"నాలుగు... బహుశా ఆరో నెల స్కానింగ్‌లో చెపుతారు ఎవరు - అబ్బాయా? డెలవరీ ఎప్పుడు కావచ్చనేది...." సీమంతం మాట ఎత్తింది వసంత.

"ఆ చాదస్తాలన్నీ పెట్టుకోకు.. ఎలాగూ అక్కడ ఫ్రెండ్స్ వద్దన్నా బేబీ షవర్ ఏర్పాటు చేస్తారు..."

వచ్చివున్నట్టుకూడా అనిపించకముందే తిరిగి వెళ్ళిపోయింది సుమ.

"నీ వీసా ఏర్పాట్లు చూస్తాను ఎప్పుడు రావాలో చెపుతాను..."

ఎంత యాంత్రికంగా ఉన్నాయా మాటలు?

చిత్రంగా మనసు బాధ పడటం మానేసింది.

ఒక రకమైన మత్తులో ఉండిపోయింది.

సుమ వెళ్ళి పదిరోజులయినా ఆఫీస్ వంక చూడలేదు వసంత.

✡ ✡ ✡

ఏదో వెబ్ సైట్ చూడటం గంటలు గంటలు కంప్యూటర్ ముందు గడపటం...

సుమ వెళ్ళగానే ముందు చేసిన పని కంప్యూటర్ కొనుక్కుని ఇంటర్ నెట్ కనెక్షన్ తీసుకోవడం.... మనస్సుకో రకమైన తెగింపు వచ్చింది. ఇదివరలో ఏం చెయ్యాలన్నా పిల్లల గురించిన ఆలోచనలే... ఇది సుమకు కొనాలి ఈ డ్రెస్ సుమంత్‌కి బాగుంటుందిలాంటి ఆలోచనలే వచ్చేవి.

ముందుగా ఇద్దరూ తనను లెక్కచెయ్యటం లేదన్న అవమాన భావన. అసహాయత మనసును మదించి పారేసినా కాస్త తేరుకుని నేనూ నా జీవితం అనే స్థాయికి రగలిగింది.

నెమ్మదిగా మనస్సుకు సర్దిచెప్పుకుని మళ్ళీ ఆఫీస్‌కి వెళ్ళడం ఆరంభించింది.

ఈలోగా హాసిని అనే వార పత్రిక వాళ్ళు ఒక ప్రపోజల్ తెచ్చారు.

వాళ్ళ దగ్గర సబ్ ఎడిటర్‌గా చేరితే జీతం రెట్టింపుతో పాటు రవాణా సౌకర్యంగా కారుకూడా ఏర్పాటు చేస్తారు.

నాలుగు రోజులు తీవ్రంగా ఆలోచించాక ఒక నిర్ణయానికి వచ్చి ప్రభాకర్‌కు ఫోన్ చేసింది.

"ఇవ్వాళ నా అదృష్టం బాగుంది. నీ అంతట నువ్వు కాల్ చెయ్యటం చెప్పు ...."

"మీ రూములో ఉన్నారా ఒకసారి మాట్లాడాలి ఆఫీస్ విషయమే... ఎప్పుడు వీలవుతుంది?"

"ఎప్పుడోనా... ఇప్పుడే యు ఆర్ మోస్ట్ వెల్కమ్"

వెంటనే అతని గదికి వెళ్ళింది.

సూటిగా విషయానికి వచ్చి.

"ఇదిగో ఇదీ నాకు మరో పత్రికా వాళ్ళిస్తామన్న బెనిఫిట్స్... ఎవరు నా పొజిషన్‌లో ఉన్నా బెటర్ ప్రాస్పెక్ట్స్ వైపే మొగ్గుజూపుతారు....

నాకు కావలసింది నా వర్క్స్ అండ్ కంఫర్ట్స్ అది ఎవరిస్తారనేది ముఖ్యంకాదు.....

ఏం చెయ్యమంటారో మీరే చెప్పండి"

అంత సూటిగా విషయం ముందుంచేసరికి దిమ్మ దిరిగిపోయిందతనికి.

"అరే తొందరేముంది.... ముందు కొంచం రిలాక్సవండి" అంటూ కూల్ డ్రింక్ తెప్పించాక నిదానంగా ఆలోచించి.

"నువ్వేదైనా అడిగితే కాదనే వాడినా?" అంటూ కాళ్ళ బేరానికి వచ్చాడు.

"ఇప్పుడు మనం అఫీషియల్‌గా మాట్లాడుకుంటున్నాము... మన స్నేహం పక్కన పెట్టండి.

ఏదైనా అడిగివుంటే పిలిచి ఉద్యోగం ఇచ్చినందుకు ఫోజులు కొడుతున్నాననో మరేదో అనుకునేవారు... అందుకే నా యోగ్యత గురించి ధ్రుడ పరచుకున్నాకే అడుగుతున్నాను..."

అని క్షణం ఆగి నేను రేపటిలోగా వాళ్ళకు జవాబివ్వాలి... అది మీ నిర్ణయం మీద ఆధారపడివుంటుంది.

ఇక్కడ మొహమాటాలకు తావులేదు. మీకు ఇవ్వడం అనవసరం లేదా ఇబ్బంది అనిపిస్తే మరొకరిని చూసుకోండి..."

"వసంతా, ఇదేనా నీకు తెలిసింది... నా గురించి ఇంతేనా..?."

"చెప్పానుగా... ఆర్థిక విషయాలు ఆర్థిక విషయాల్లాగే మాట్లాడుకుందాం. వ్యక్తిగతంగా కాదు"

"ఓకే. నీ డిమాండ్స్‌కి తల వంచుతున్నాను... కాని ఒక్కమాట ఈ ప్రపోజల్ ఎవరిది?"

"చెప్పను మీరు ఒప్పుకుని నేను వాళ్ళ ఆఫర్ కాదన్నప్పుడు ఎందుకు చెప్పాలి.... ప్రొఫెషనల్ రైవల్రీ మామూలే" అంటూ లేచి వెళ్ళిపోయింది.

ఈ సంఘటన ఎంత చిన్నదిగా తోచినా వసంతలో మాత్రం పెనుమార్పుకు కారణమైంది.

ఎక్కడి నుండి అదృశ్యంగా వచ్చిందో కాని అంతులేని ఆత్మ విశ్వాసం.... తన మీద తనకో నమ్మకం కొండంత బలాన్నిచ్చాయి.

ఇదివరలోలా బేలగా మారిపోవడం. కన్నీళ్ళు నింపుకోవడం తగ్గిపోయాయి.

ఖాళీ సమయం కాస్త దొరగ్గానే ఇంటర్ నెట్లో సమాచార సేకరణ ఇబేలో కొనుగోళ్ళూ...ఒకటేమిటి....

అలా ఓ ఆదివారం తీరిగ్గా కంప్యూటర్ ముందు కూర్చునప్పుడు తగిలింది షాదీ డాట్ కామ్ వెబ్ సైట్.

ఫ్రీ మెంబర్ షిప్ అనేసరికి సరదాగా మారుపేరుతో రిజిష్టర్ చేసుకుంది.

అమ్మాయిలు అబ్బాయిలతో పాటు వయసు దాటిపోయిన వాళ్ళూ పెళ్ళయి విడాకులు తీసుకున్నవాళ్ళూ... భార్య గతించి పిల్లలు ఎక్కడో ఉండి ఒంటరిగా తోడుకోసం వెతుక్కునే వాళ్ళూ.... ఎన్ని రకాలో.....

అందులో యాభై దాటిన ఆడవాళ్ళూ ఉండటం విస్మయాన్ని కలిగించింది.

యాభైలోకి వచ్చినా పెళ్ళి చేసుకోని ఆడవాళ్ళు ఇప్పుడెందుకు పెళ్ళికి సిద్ధమవుతున్నారు? సరిపడక విడాకుల వరకూ వెళ్ళిన వాళ్ళు మళ్ళీ ఏ విధంగా కొత్తవాళ్ళతో సరిపెట్టుకోగలరో...

పిల్లల్ని వదిలేసి మళ్ళి పెళ్ళి చేసుకోవడం అక్కడ ఆగిపోయాయి ఆమె ఆలోచనలు.

✡ ✡ ✡

# 7

ఆదివారం. ఎప్పటిలాగే పొద్దున్నే లేచి టీ తాగి కంప్యూటర్ ముందు కూర్చుంది.

షాదీ డాట్ కాం ఓపెన్ చేసి ఒక్కొక్కరి వివరాలూ చదువుతూ పోతోంది.

అసలు మనసులో ఏదైనా ఉద్దేశ్యం ఉంటేగా ఎవరైనా నచ్చేందుకు...

ఆ సేతు హిమాచలం నుంచే కాకుండా విదేశాల్లో స్థిరపడిన వాళ్ళు....

వీళ్ళల్లో ఒక్కరైనా నాకు కావలసిన సపోర్ట్ ఇవ్వగలరా అనిపించింది ఆమెకు.

ఇంకా దానికి తోడు ఒకరిద్దరు తన వివరాలు అడగటం..అలా అడిగిన వారి ప్రొఫైల్ ఓపెన్ చేసి వాటిని క్షుణ్ణంగా చదివింది.

ఒకరిద్దరి ఫోటోలూ ఉన్నాయి. లావుగా గుమ్మటంలా ఉన్నవాడిని చూసి "అబ్బే లాభం లేదు వీడికి జీవితాంతం వండి వడ్డించడానికే పెళ్ళి - వంట మనిషిని చూసుకుంటే పోయేదిగా వీడినెవరు పెళ్ళిచేసుకున్నా పెనం మీంచి పొయ్యిలో పడటమే" అనుకుంది... ఒకరిద్దరు సిటీలో వాళ్ళే..ఫోటో క్లిక్ చేసి చూసి ఉలిక్కిపడింది. అది శ్రీ మిత్రుడు రంగాచారిది. ప్రొఫైల్ చదివింది.. ఇద్దరు పిల్లలు. డైవోర్సీ...ఓరినాయనో... ఎన్ని అబద్దాలు. చక్కని అందమైన భార్య, పిల్లలు మంచి సోషల్ సర్కిల్ ఇవన్నీ పెట్టుకుని ఇన్ని అబద్దాలు ఎందుకు...ఇంకా నయం తన అసలు పేరుతో రిజిస్టర్ చెయ్యలేదు..ఉలిక్కిపడి, భుజాలు తడుముకుంది... అందరూ ఇంతేనా... కొందరు ఆస్తిపాస్తులు ఉన్న వాళ్ళు కావాలని ఆరాటపడితే కొందరు ఉద్యోగం ఉన్న భార్య కావాలని..

కొందరు కలిసి మాట్లాడాలన్న అభిలాష వ్యక్తం చేసారు.

కొందరు భార్య మరణించి పిల్లలు ఎవరి దారిన వాళ్ళు సెటిల్ అయ్యాక ఒంటరిగా మిగిలిపోయిన వాళ్ళు, ఒకరిద్దరు విడాకులు తీసుకున్నవాళ్ళు. నూటికో కోటికో ఒకళ్ళు పెళ్ళి మాట ఇంతవరకూ తలపెట్టనివాళ్ళు...

ఈ లోకం ఆమెకు కొత్తగా ఉంది. ఇది వరకు ఎప్పుడూ తెలియని విషయాలు.

బొంబే నుండి ఎవరిదో ఉత్తరం... ఆసక్తిగా చదివింది.. ఇద్దరమ్మాయిలూ తల్లీ మద్రాసులో ఉన్నారట.. మంచి పేరు ప్రతిష్టలున్న మెడికల్ ఇన్స్టిట్యూట్‌లో జనరల్ మానేజర్....

విపుల్ పాణిగ్రహి....డైవోర్సీ.. ప్లీస్ ఫీల్ ఫ్రీ టు కాల్ మి. అంటూ ఫోన్ నంబర్, ఈ మెయిల్ ఐడీ కూడా వ్రాసాడు...

ఉన్నట్టుండి ఓ చిలిపి సరదా మనసులో దూరింది. వెంటనే కనిపించిన ఫోన్ నంబర్ డయల్ చేసింది.

రెండు క్షణాల్లో రింగ్ అవగానే అసంకల్పితంగా ఆపేసింది.

రెండు నిమిషాలు గడవకముందే అతని నుంచి ఫోన్

ఏం మాట్లాడాలో ఆలోచించలేదు గనక ఎత్తలేదు.

నిమిషం వ్యవధిలో అయిదారు సార్లు రింగయింది..

చివరకు ఫోన్ ఆన్ చేసింది వసంత.

"హలో"

"ఐ రిసీవ్డ్ ఎ కాల్ ఫ్రమ్ యు..."

"ఈజ్ ఇట్? ఓకే..గెస్..హు..అమ్ ఐ?"

ఈ మధ్య కాలంలో ఇంగ్లీష్ మర్చిపోయాననే అనుకుంది. మళ్ళీ ఇన్నేళ్ళకు చక్కటి యాక్సెంట్‌తో మాట్లాడటం ఆమెకే అబ్బురంగా తోచింది.

ఏవేవో పేర్లు చెప్పాడు...

జవాబుగా కిల కిలా నవ్వింది.

''ఐ యామ్ అరవుండ్ యూ...ఇన్ యువర్ ఆఫీస్ ...గెస్..''

అయిదారు నిమిషాలు బాగా ఏడిపించి.... మరింక తన వల్లకాదని ఒప్పుకున్నాక, చల్లగా చెప్పింది వసంత ''ఐ యామ్ స్వీటీ..''

''స్వీటీ ఫ్రమ్ షాదీ..ఓహ్! హౌ వెల్ యు ఫూల్డ్‌మి..''

''ఐ యామ్ సారీ... జస్ట్ ఫర్ జోక్..''

''స్వీటీ యువర్ నేమ్ ఈజ్ సమ్ థింగ్ స్పెషల్...బట్ నవ్ ఐ సే అబి ఫిట్టింగ్ నేమ్...''

''హౌ?''

''యువర్ వాయిస్ .. సో స్వీట్..''

అది వసంతకు తెలుసు... ఆ స్వరం భగవంతుడిచ్చిన వరం.

ప్రతివారినీ ముందుగా ఆకర్షించేది ఆమె తీయని స్వరమే.

''యామ్ ఐ డిస్టుర్బిన్స్ యూ ఇన్ ఆఫీస్?''

''ఓకె. వెన్ ఐ రీచ్ హోమ్. ఐ'ల్ గివ్ ఎ రింగ్..''

అలా ఆరంభమయింది పరిచయం.

సాయంత్రం ఎంత తొందరగా ఇంటికి వద్దామని చూసినా ఏడు దాటిపోయింది

అనాలోచితంగానే తన మెయిల్ ఐడీలో అతన్ని యాడ్ చేసుకుంది... సరిగ్గా పదినిమిషాల్లోనే ఆన్‌లైన్ లో కొచ్చాడు...

పరస్పర పరిచయాలు ఒకరి గురించి ఒకరు తెలుసుకోవడం... పలకరింపులు.. తొలిరోజున కొంచెం సందిగ్ధంగా అనిపించింది వసంతకు.

తప్పు చేస్తున్నానా అన్న భావన ఏ మూలో..

కాని ...ఒరకమైన తెగింపు...

రాత్రి ఏడయేసరికి చాటింగ్ మొదలు పెడితే తొమ్మిదికి ..

''కొంచెం పర్మిషన్ ఇస్తే మెస్‌కి డిన్నర్‌కి వెళ్ళి వస్తా''ననేవాడు

''ఇంట్లో వండుకోలేరా..''అడిగేది

''ఊహు. పొద్దున వంటావిడ వచ్చి ఇక్కడి తరహాలో పుల్కాలు పప్పు కూర చేసి వెడుతుంది.. అవే తిని లంచ్ అవే తీసుకు వెడతాను. మళ్ళీ రాత్రికి అవేతినే ఓపిక లేదు అందుకే మెస్‌కి వెళ్ళి..''

''సరే..''

''మరి నీ సంగతి..''

''నాకేం అలా మెస్‌కి వెళ్ళాల్సిన అవసరం లేదుగా..కాని చిక్కంతా ఎక్కడంటే ఒక్కదానికి వండుకోవాలనిపించదు...''

''మరి..''

''ఏదో ఒకటి తినడం ఫ్రూట్స్...కాఫీ తాగి.. ఓకె మీరు వెళ్ళి డిన్నర్ చేసి రండి...''

నిద్ర వచ్చేవరకు అతనితో చాటింగ్..

ఆఫీస్‌లో ఉన్నా అప్పుడో ఇప్పుడో అతను పంపే ఎస్.ఎమ్.ఎస్ లు..

మెయిల్ ఐడీలో చూసి అతని డేట్ ఆఫ్ బర్త్ మే పంతొమ్మిది అని నిర్ధారించుకుని అడిగింది కూడా...

ఎప్పుడు ఎలా అంత చనువు వచ్చిందో కాని వసంతను స్వీటీ అని అతను పిలిచేవాడు' షల్ ఐ కాల్ యూ'

"అవును... నువ్వు చాలా తెలివయిన దానవు.."

"అబ్బో చాలానే కనుక్కున్నారు... నిజానికి పదో తరగతి పదిసార్లు ఫేలయాను...." నవ్వేది

"మీ నవ్వే మీ స్పెషాలిటీ వెయ్యి వరహాల పెట్టు.."

"వరహాల వరహాలా.."

"తేడా ఏమిటి.."

"తెలుగు చదువుకున్నానంటారు....ఎవరబ్బా మీకు తెలుగు చెప్పిన టీచర్.."

"నిజమే నాకు లాంగ్వేజెస్ అంత బాగా రావు.."

"ఓకే ఈసారి మీ బర్త్డే ఒక ప్రత్యేక దినంగా సెలబ్రేట్ చేసుకుందురు గాని.."

"ఎలా.."

"నేనక్కడికి వస్తానుగా.."చాలా క్యాజువల్గా అనేసింది.

రోజుల కొద్దీ మాటల్లో గత జీవితాల చరిత్ర ఒకరి గురించి మరొకరు మాటలు మాటలుగా తెలుసుకోవడం--- ఇద్దరమ్మాయిలనీ పెద్దపిల్ల అర్చన ఎమ్.సి.ఎ, రెండోది అర్పిత ఎమ్.బి.ఎ చదువుతున్నారనీ చెప్పాడు. ఇద్దరి పెళ్ళిళ్ళూ చెయ్యాలి. భార్య మాత్రం గత పది సంవత్సరాలుగా విడిగా ఉంటోందనీ ఎక్కడో ఉద్యోగమనీ చెప్పాడు.

వారం రోజులుగా రోజూ ఒకటే బ్రతిమాలటం..ఈసారి నువ్వు వస్తేనే నా పుట్టినరోజు అని.

ఈలోగా సుమ ఫోన్ మే ఇరవై ఐదున టికెట్ దొరికిందని సిద్ధంగా ఉండమనీ -

ఒంటిగా వెళ్ళాలని కాస్త దిగులనిపించినా..మార్పు అనేది కాస్త బాగుంటుందనే అనిపించింది. అయితే ఉన్న సమయం చాలా తక్కువ.

ఈలోగానే కావలసిన షాపింగ్ చెయ్యాలి ఫ్రెండ్స్కి చెప్పాలి - పుట్టబోయే పాపాయికి అవసరమయే వస్తువులు తీసుకువెళ్ళాలి వీటన్నిటి మధ్యా విపరీతంగా బాధిస్తున్న పంటి నొప్పి - డెంటిస్ట్ దగ్గరకు వెళ్ళాలి.

ఆలోచిస్తుంటే ఈ పనులకో అంతం లేదనిపిస్తోంది...

అసలు సంగతి ముందు ప్రభాకర్కి చెప్పాలి ఈ ప్రయాణం గురించి - నాలుగైదు నెలలన్నా ఎంత గింజుకుంటాడో.. వీటన్నింటి మధ్యా విపుల్ ఆహ్వానం.

ఒక్కసారి వెళితే ఎలా ఉంటుంది అన్న ఆలోచన.. అదీగాక ఈసారి మే పంతొమ్మిది ఆదివారం. శనివారం రాత్రికి బస్ ఎక్కితే ఆదివారం వెళ్ళి పరిస్థితిని బట్టి ఆ రాత్రికి తిరిగి వచ్చెయ్యవచ్చు.

ఏపీటీడీసి వాళ్ళవి మంచి లక్జరీ బస్లు ఉన్నాయి.

వెళ్ళాలనే అనుకుంది.

అయితే వెంటనే విపుల్కి చెప్పదలచుకోలేదు.

ఈ ఆలోచనల్లో ఉండగానే చైతన్య ఫోన్.

ఈ మధ్య అతని ఫోన్ ఎత్తటం మానేసింది. పెద్దగా మాట్లాడాలనిపించక.

"చెప్పండి. బాగున్నారా.."

"ఏం బాగు లెండి... ఎంత కోపమైతే మాత్రం మరీ ఫోన్ ఎత్తకపోవడం ఏం బాగాలేదు." డైరెక్ట్‌గా అంటాడని అనుకోలేదు.

"అలాగేం లేదు లెండి.. తీరిక లేకపోవడం ఎప్పుడో చేద్దాంలే అనుకున్నా గుర్తుండకపోవడం.."

"సరేలెండి ఇప్పటికయినా ఫోన్ ఎత్తారు అదే మహా భాగ్యం.. నిజం చెప్పనా..ఈపాటికి మరెవరైనా అయితే తెగతెంపులు చేసుకుని మాట్లాడకపోతే పోనీ నాకేం తక్కువ అనుకునే వాడిని.. నా ఇన్నేళ్ళ జీవితంలో ఎవరితోనైనా కాంప్రమైజ్‌కి రావడం ఇదే మొదటిసారి. ఏమిటో నీతో మాట్లాడకపోతే మనసు నిస్సారంగా వ్యాకులంగా..ఎందుకో తెలీదు"

వసంత మాట్లాడలేదు.

ఏం చెప్పాలి?

లేచి వెళ్ళి అద్దం ముందు నిల్చుంది?

అక్కడో ఇకడో నెరిసిన వెంట్రుకలు... కనీ కనిపించని వయసు ఛాయలు.. యాభై దాటిన ఈ శరీరంలో ఏం ఉందని వీళ్ళకింత ఆసక్తి?

నా మనసూ ఆలోచనల ఊసే అక్కరలేదా?

"హలో.. ఉన్నావా? ఫోన్ పెట్టేసావా? నీతో ఇదో చిక్కు.."

సర్రున కోపం వచ్చింది అసంతకు.

రోజురోజుకీ ఇవ్వకపోయినా చనువు తీసుకోవడం ఎక్కువైపోయింది. ఏమనుకుంటున్నాడస్సలు?

ఠక్కున ఫోన్ పూర్తిగా స్విచ్ ఆఫ్ చేసేసింది.

గత ఆరు నెల్లుగా రోజూ ఫోన్ చేసి మరీ బుర్ర తినేస్తున్న విజయేంద్ర చక్రవర్తి కథ ముగిసిపోయిందనే అనుకుంది.

ఇహ లాభం లేదు వీళ్ళందరి పిచ్చి వాగుళ్ళనూ ఎందుకు భరించాలి?

ఒక్కొక్కరిని తొలిగించుకుంటూ పోవాలి అంతే!

సరిగ్గా ఆరు నెలల క్రితం ఆఫీస్‌కి వచ్చి ఎంతో హుందాగా మాట్లాడి ఫోన్ నంబర్ చాకచక్యంగా పట్టుకెళ్ళిన విజయేంద్ర చక్రవర్తి తెల్లారగానే ఫోన్ చేస్తాడని ఎంత మాత్రం ఊహించలేదు.

ఉదయం ఆరు ఆరున్నర మధ్య నాలుగైదు సార్లు ఫోన్ రింగైనా పెద్దగా పట్టించుకోలేదు. తన సమయాని వృధా పరచుకుంటూ ఎవ్వరితోనూ కర్టెసీకి కూడా మాట్లాడదలచుకోలేదు వసంత.

ఆఫీస్‌కి వెళ్ళేముందు మిస్డ్ కాల్స్ చెక్ చేసుకుని కొత్త నంబర్ ఎవరిదో తెలీక ఫోన్ చేసింది.

"హలో" వెంటనే అతని స్వరం గుర్తించింది..

ఏదైనా అనే లోపలే అతనే మాట్లాడాడు.

"నేను విజయేంద్ర చక్రవర్తిని.. బిజీగా ఉన్నారా ఫోన్ ఎత్తలేదు?"

"ఏదో పనిలో.."

"ఇది నా నంబర్ సేవ్ చేసుకోండి." అజ్ఞాపించినట్టుగానే అన్నాడు.

"సరే.."

"నా గురించి ఏమీ అడగనే లేదు.."

"చెప్పండి"

"ఎయిర్ ఫోర్స్‌లో వింగ్ కమాండర్‌గా చేసి రిటైర్ అయ్యాను... ప్రస్తుతం ఐసీ ఐసీ ఐ బ్యాంక్‌లో మేనేజర్‌గా వర్క్ చేస్తున్నాను.. నా పేరు. రచనలూ డైలీ వీక్లీ పత్రికల్లో చూసే ఉంటారు.. "

"అవునా.."

"బ్యాంక్‌కి బయలు దేరగానే మీరు గుర్తుకు వచ్చారు. ఓసారి పలకరిద్దామని'

"థాంక్యూ.."

"ఓకే మరి ఉండనా.. తీరిక దొరికితే కాల్ చెయ్యండి.. బై"

అతను ఎందుకు ఫోన్ చేసాడో అర్థం కాలేదు..

అప్రయత్నంగానే అతని నంబర్ సేవ్ చేసుకుంది.

సరిగ్గా మధ్యాహ్నం లంచ్ టైంలో మళ్ళీ అతన్నించి ఫోన్.

"హలో"

"చెప్పండి"

"ఈ రోజు వసుధ పత్రికలో నా కవిత వచ్చింది. ఉదయం నుంచి కనీసం ఓ పాతిక మంది ఫోన్ చేసారు. మీకూ చెప్తే చూస్తారని.."

వసంత అసలా పత్రిక పేరు కూడ వినలేదు. అయినా మర్యాదకు "చూస్తాలెండి" అని చెప్పింది

కాని అదో వంక మాత్రమేనని కాస్సేపటిలోనే అర్థమయింది.

"లంచ్ చేసారా?"

"లేదు"

"పోనీ బయటకు రాకూడదూ. నా కవిత ప్రచురించిన సందర్భంగా పార్టీ ఇస్తాను.."

ముందు కొంచెం మొహమాట పడినా వెంటనే సర్దుకుంది

"ఆఫీస్ టైంలో కుదరదండి" కాస్త నిక్కచ్చిగానే చెప్పింది.

"అఫ్ కోర్స్ బ్యాంక్ వదిలి రావడం నాకూ కుదరదనుకో. అయినా ఓకే సీ యూ"

ఇంత తక్కువ పరిచయంలోనే ఇలా లంచ్‌కి రమ్మనడం ఏమిటి.. ఎందుకిలా వెంటపడుతున్నాడని కాస్సేపు మధనపడింది వసంత.

అయితే అక్కడితో ఆ పీడ వదల్లేదు

రాత్రి ఏడింటికి మళ్ళీ ఫోన్.

"ఇంటికి వెళుతూ మీరు గుర్తొచ్చారు... చెప్పండి ఏం చేస్తున్నారు?"

కంప్యూటర్ ముందు కూర్చుని వర్క్ చేస్తున్న వసంతకు కాస్త చిరాకనిపించింది.

"ఏముంది ఏదో చదువుకోవడం.. చెప్పండి"

"రోజంతా అలిసి పోయి, పనులన్నీ వదిలించుకుని వెళుతూ వెళుతూ మనసుకు నచ్చిన వాళ్ళతో మాట్లాడటం ఎంతో బాగుంటుంది కదు.."

"నిజమే"

"మీ గురించి చెప్పండి?" అడిగాడు

"ఏం చెప్పమంటారు?"

"ఏదైనా.."

"ఏదైనా పెద్ద గొప్పగా ఏమీ లేదు.. పొద్దున లేచి ఆఫీస్‌కి వెళ్ళడం.. పని, మళ్ళీ సాయంత్రం ఇంటికి చేరడం.."

"అది తెలుసులెండి.. అందరూ చేసేది అదేగా.."

"పెద్ద స్పెషాలిటీ ఏమీ లేదు చెప్పుకుందుకు"

"ఎందుకు లేదు. మీ మృదువైన స్వరం. మీ చక్కని రూపం విలక్షణమైనవా.."

అతని పొగడ్త కాస్త ఇబ్బందిగానూ ఉంది.

అంతకు మించి సంతోషాన్నీ ఇచ్చింది.

మానసికంగా బలహీన పడుతున్నానా అనిపించింది.

"మాట్లాడరేం? నేనేమైనా అబద్దం చెప్పానా?"

ఏం చెప్పాలో తెలీని సందిగ్ధం

"హలో ఏం ఆలోచిస్తున్నారు?"

"అబ్బే ఏం లేదండి"

"సరే మీ పిల్లల గురించి చెప్పండి... ఏం చదువుతున్నారు?"

"అమ్మాయి పెళ్ళి అయ్యింది. అబ్బాయి ముంబైలో.. "అంతకంటే ఎక్కువ చెప్పాలనిపించలేదు

"నిజమా? నేనింకా ఏ స్కూల్లోనో ఉన్నారనుకున్నాను.. మీరస్సలలా కనిపించరు?"

ఇంకా నయం నేనే స్కూల్‌కి వెళ్ళేలా ఉన్నానన్నారు కాదు.. ఆమాట పైకి అనలేదు..

ఏదో అనుమానం వచ్చింది..

"ఇంటికీ బ్యాంక్ కీ చాలా దూరమా?"

"ఉహూ అరగంట.. కారు ఇంటి దగ్గర చెట్టుకింద ఆపుకుని మాట్లాడుతున్నాను."

"సరే.. ఓకె బై" ఫోన్ స్విచాఫ్ చేసింది వసంత.

ఇతను మరో శలభమా.. ఆ ప్రశ్నకు సమాధానం ఆలోచించలేదు.

✡ ✡ ✡

రాత్రి చాలా ఆలస్యంగా పడుకుని తెల్లారి మెళుకువ వచ్చినా లేవబుద్ధి కాక అలాగే ఓ రకమైన మగతలో ఉండి ఆ మగతలోనే ఓ రకమైన ఆత్మ విమర్శకూ లోనయింది.

ఒకే ఒక్క చిన్న మార్పు శ్రీ ఉండటం లేకపోవడం... అది జీవితంలోనే కాదు మానసిక స్థితిలోనూ ఇంత పెను మార్పులను తీసుకు వస్తుందా?

అవునని వేరే చెప్పాలా?

ఒకప్పటి ఆలోచనా సరళికీ ఇప్పటి తీరుకూ ఎంత తేడా?

శ్రీ ఉన్నప్పుడు ఒకరకమైన కట్టు బాటులో ఉన్న భావన..

ఇప్పుడో అపరిమితమైన స్వేచ్ఛ..

దాన్ని దుర్వినియోగ పరుస్తున్నానా?

ఒక సారి ప్రభాకర్‌తో పునః పరిచయం అది పెరగడానికి తను దోహదపడినది ఎంత వరకని ఆలోచించుకుంటే మనసులో ఏదో చాపల్యం ఉండటం వల్లే అతని ఉద్యోగాన్ని ఒప్పుకున్నానా? ఇక్కడ కాకపోతే మరో చోట అనుకుని ఎందుకు ప్రయత్నించలేదు?

శ్రీని ఎంత గాఢంగా ఇష్టపడ్డ ఇంకా ఏమూలో ప్రభాకర్ పట్ల చిన్నప్పటి ఆరాధనా భావం మిగిలిపోయిందా? అందుకే అతనితో పరిచయాన్ని పెరగనిచ్చిందా?

ఏమో?

అప్పట్లో ముందుగా ఆలోచించినది ఒక వ్యాపకం కావాలనేనా.. ఇంకేదైనా..?

ఆత్మ పరిశీలన ఎంత కష్టమో అర్ధమైంది.. అసౌకర్యంగా తోచింది ఆలోచనో.. పడకతీరో కాని మంచం మీద ఆపక్కనుంచి ఈ పక్కకి దొర్లి కొంచెం వెసులుబాటు దొరికినట్టుగా ఫీలయింది.

ఓకే! ప్రభాకర్‌ని ఓ పక్కన పెడితే మరి చైతన్య సంగతి? అతనెంత ప్రయత్నిస్తే మాత్రం తనెందుకంతలా రియాక్టవాలి.. శ్రీ వుంటే మరొకరితో ఇలా మాట్లాడేదేనా?

అంటే మాట్లాడే మనిషి కోసం ఏమైనా చెయ్యిడానికి సిద్ధంగా ఉందా తను..?

ఇద్దరినీ కాస్త దూరంగా పెట్టాలి.. తల విదిల్చి లేచి మ్యూజిక్ సిస్టం ఆన్ చేసింది.

చాలా రోజుల తరువాత.. కాదు కాదు.. నెలల తరువాత ఆ ఇంట్లో మళ్ళీ పాటలకు చోటు దొరికింది. పాత పాటలంటే శ్రీకి ఎంత ఇష్టమో.

ప్రతి పాటా తన గురించే పాడేవాడు..

ఎప్పుడైనా చాలా కోపం వస్తే మాట్లాడకుండా మౌనంగా ఉంటే చాలు ఎన్ని పాటలు వినిపించేవాడు...

"అలిగితివా ప్రియా సఖీ అలక మానవా.." అంటూ నిజంగా అడుగుతున్నట్టే..

పాటలు వింటూ కళ్ళు మూసుకుని ఈజీ చెయిర్‌లో కూర్చుంటే మరేదో లోకంలో ఉన్నట్టే అనిపించింది. చాలా సేపు అలాగే వుండి పోయి ఎప్పటికో కళ్ళు విప్పితే సన్నగా వినబడుతూ ఫోన్ రింగింగ్ లేచి వెళ్ళి ఫోన్ అందుకుంది.

స్క్రీన్ మీద పేరు ప్రత్యక్షమైంది - చక్రవర్తి.

క్షణం సేపు ఆలోచించింది.

మాట్లాడాలా? వద్దా - అని. ఏదీ తేల్చుకోకముందే ఆగిపోయింది రింగింగ్

అమ్మయ్య అనుకునే లోగానే మళ్ళీ ఫోన్ రింగ్ .

"హలో"

"ఇంత సేపు ఏం చేస్తున్నావు.. మిస్డ్ కాల్స్ చూసావా. సరిగ్గా ఇరవై ఏడు సార్లు చేసాను.."

"అయ్యో అలాగా..?"

"నువ్వు పాత పాటలు వింటున్నట్టున్నావు?"

"అవును చాలా రోజుల తరువాత"

"ఈ పాట ఇష్టమా?"

అప్పుడు కాని గమనించలేదు మ్యూజిక్ సిస్టంలోంచి పాట మంద్రంగా వినిపిస్తూనే ఉంది.

"అవును పాత పాటలేవైనా ఇష్టమే."

"ఒక్కసారి వాల్యుం తగ్గించు..."

ఫోన్ లోనే మంద్ర స్వరంతో పాడటం మొదలు పెట్టాడు. మరీ గొప్పగా కాకపోయినా బాగానే ఉందతని స్వరం.

"ఎలాగుంది?"

"బాగా పాడారు" అడిగాక మెచ్చుకోక తప్పలేదు.

"ఒకప్పుడు నేను సినిమాలకోసం పనిచేసాను. అప్పట్లో చాలా నష్టపోయాను కూడా.."

"అవునా?"

"ఉద్యోగానికి సెలవు పెట్టి మరీ."

"నడి రోడ్డున నిలుచున్నాక గాని సినిమా పిచ్చి వదల్లేదు.."

"అందుకే మా అమ్మాయిలకు నా మీద కోపం.. పెద్దగా మాట్లాడరు"

"ఎంతమంది అమ్మాయిలు."

"నలుగురు."

"ముగ్గురు.. ఇద్దరు అమెరికాలో ఉన్నారు ఒక పిల్ల ఇక్కడే ఉంది"

"నేనూ బహుశా అమెరికా వెళతానో టూ త్రీ మంత్స్‌లో. కూతురు ఇదివరకు లండన్‌లో ఉండేది. ఇప్పుడు అమెరికాకు మారింది"

చెప్పాక గాని ఎందుకు చెప్పానా అని అనిపించలేదామెకు.

ఎంత తప్పించుకుందామన్నా పొద్దున్నా సాయంత్రం రాత్రి ఎప్పుడు పడితే అప్పుడు ఫోన్ చెయ్యడం మానలేదతను. అలా అనే కంటే చేసినప్పుడల్లా మాట్లాడి తనే అతన్ని ప్రోత్సహించిందేమో!

తన భార్య అనారోగ్యం గురించి.. ఇరవై ఏళ్ళకే పెళ్ళి చేసుకోవడం గురించి, తనకున్న ఎక్స్ట్రా మారిటాల్ రిలేషన్ షిప్ గురించి ఒకటేమిటి ప్రపంచంలో ఉన్న సమస్త విషయాలూ మాటల్లో దొర్లేవి

ఓ పెద్ద పోస్టులో ఉన్నావిడ తనంటే ఎలా పడి చచ్చిపోయేదో చెప్పాడు

"ఆవిడ జుట్టు నల్లగా పొడుగ్గా మోకాళ్ళు దాటి నేలకు తాకేట్టుగా ఉండేది. వారానికి నాలుగు రోజులు వాళ్ళింట్లోనే ఉండేవాడిని.. అఫ్‌కోర్స్ అప్పటికింకా ఆమెకు పెళ్ళికాలేదు.. మద్రాసులో ఉండేది. ఇప్పుడావిడ లేదు... చచ్చిపోయింది .. కాన్సర్‌తో పదేళ్ళక్రితమే"

"అంటే ఈ వ్యవహారం అంతా మీ పెళ్ళయ్యాకేగా! ఏమైనా అనండి ఇల్లీగల్ సంబంధం ఇల్లీగలే."

"నా భార్యకు కూడా తెలుసీ సంగతి.."

మరో రోజు ఇప్పటికీ తన గురించి ఎంతమంది ఆసక్తి కనబరుస్తారో వివరించాడు.

"నీ అంత అందగాడు గొప్ప రచయిత ఏమడిగినా ఇచ్చేస్తాం అంటారు.."

"నైతిక విలువలు అంతగా దిగజారిపోయాయా?" అమాయకంగానే అనేది,

మరోమారు బ్యాంక్ పనిమీద ఊటీ వెళుతున్నానని, ఒక్కణ్ణే వెళ్ళాలంటే బోర్‌గా ఉందనీ చెప్పాడు.

"పోనీ నువ్వూ రారాదూ..?"

ఎప్పటినుండో నువ్వనే అంటున్నా పట్టనట్టుగానే ఉండి వసంత.

"నేనేం పనీ పాటా లేకుండా ఉన్నానా? నా ఉద్యోగం నాకు ముఖ్యం"

ఒక్కోసారి అతని మాటలు మళ్ళీ మళ్ళీ పునశ్చరణ చేసుకుంటే అన్నీ అబద్ధాలనే అనిపించేవి.

ఓ రకంగా తను బుట్టలో పడకపోతుందా అని ప్రయత్నిస్తున్నాడేమోననిపించేది.

వాళ్ళ బ్యాంకులో మణి ప్రైమ అని ఒక ఆఫీసర్ తనంటే ఎంతో ఆసక్తి చూపిస్తోందనీ ఇరవై నాలుగ్గంటలూ ఫోన్ చేసి విసిగిస్తుందనీ చెప్పాడు.

ఎందుకీ పరిచయాన్ని పొడిగిస్తుందో వసంతకే అర్థం కాలేదు.

ఓసారి ఏదో పనిమీద స్వప్నిక స్వంతంగా డిజైనింగ్ ఇన్సిటిట్యూట్ పెట్టుకునే ప్రయత్నంలో ష్యూరిటీ సంతకం కావాలంటే బ్యాంక్‌కి వెళ్ళింది అక్కడ అతన్ని చూసాక కాని బ్యాంక్‌లో అతను పనిచేస్తాడని గుర్తుకు రాలేదు.

"మానేజర్ నాకు తెలుసు.. అదుగో ఆ వెనకాల కూర్చున్నాడు అతనేగా."

స్వప్నిక అతన్ని చూసి, "అతను మానేజర్ కాడు. జస్ట్ వన్ ఆఫ్ ద ఆఫీసర్స్ అంతే. మానేజర్‌నని చెప్పాడా? ఎలా తెలుసు నీకు"

చెప్పింది.

"డోంట్ ఎంటర్ టయిన్ హిమ్ వాడ్ పెద్ద రోగ్. నోరు విప్పితే అన్నీ అబద్ధాలే మా ఇంటి పక్కనే ఉంటారు. ఏదో రకంగా అనుకున్నవన్నీ సాధించాలని చూస్తాడు.. వాడు వాడు వాడి బట్టతలా? పెద్ద అందగాడినని ఫోజ్.. గట్టిగా మాట్లాడమ్మటే మనకే కారెక్టర్ లేదని ప్రచారం చేస్తాడు.. జాగ్రత్త"

వసంత మనసు పరిపరి విధాల పోయింది.

ఎందుకిలాంటి వాళ్ళందరితో మాట్లాడుతున్నాననిపించింది.

ఒంటరితనం దూరం చేసుకునే దిశలో తనను తాను వంచించుకుంటోందా?

ఏమో!

తరువాత ఫోన్ ఎత్తీ ఎత్తకా బిజీగా వున్నాననీ తప్పించుకోజూసింది.

అయినా పట్టు వదలని విక్రమార్కుడిలా తన ప్రయత్నం మాత్రం మానలేదతను.

"గోవా వెళ్ళాలనుంది వెళ్ళి ఓ నాలుగు రోజులు రెస్ట్ తీసుకుంటే గాని లాభం లేదు"

"వెళ్ళండి"

"ఒక్కణ్ణీ వెళ్ళలేకే గద."

"ఆవిడను తీసుకు వెళ్ళండి"

"తనొస్తే ఇంకలేనిదేం. రాదు.. పోనీ నువ్వు రారాదూ.."

"మీరిలా అడగటం ఏమీ బాగాలేదు. పరాయి ఆడవాళ్ళను అడగ్గానే పరుగెత్తుకు వస్తారనుకుంటున్నారా?"

"తప్పేముంది. ఫ్రెండ్స్ మనుసులు సరిగ్గా ఉండాలే కాని ఒక్కగదిలో ఉన్నా తప్పులేదు"

"ఏమో నాకు మాత్రం తప్పుగానే అనిపిస్తుంది.."

"ఓకే ఓకే రాకపోతే మీ ఇష్టం.. ఎంత మంది ఎన్ని విధాల అడుగుతున్నా కాదని నిన్ను అడుగుతున్నానంటే ..ఇష్టమనిపించబట్టే కద.."

"మీకనిపించవచ్చు. కాని నాకలాంటివి నచ్చవు"

"సన్నగా నాజూగ్గా ఉన్నామనుకుంటారు గాని పుల్లల్లా ఉంటే ఆ శరీరంలో కోరికలు ఎక్కడవుంటాయి? కొంచమైన కండవుంటే.. అందుకే రాయిలా కసాయిలా జడపదార్థంలా మారిపోయారు.."

వసంత సహనాన్ని కోల్పోయింది.

"చూడండి.. నేను రాయిని కావచ్చు రప్పనూ కావచ్చు అది మీ కనవసరం.. ఇలా మీ ఇష్టం వచ్చినట్టు మాట్లాడే అధికారం మీకెక్కడిది..? నేనూ ఒక్క మాట చెప్పదలచుకున్నా.. సన్నగా ఉన్నా లావుగా ఉన్నా ప్రతివారికీ ఒక మనసనేది ఉంటుంది... నచ్చటమనేది ఉంటుంది. ఇలా మరెప్పుడూ ప్రయత్నించకండి" అంటూ ఫోన్ ఆఫ్ చేసింది. అంతే అది ముగింపనే అనుకుంది.

కాని ఎవరెవరి దగ్గరో తన గురించి నోటికి వచ్చినట్టు మాట్లాడాడని తెలిసి తనను తనే నిందించుకుంది. పెనం మీంచి పొయ్యిలోకి వెళుతున్నానా అని అనిపించింది.

ఆ ఉడుకులోనే విపుల్‌తో పరిచయం పెంచుకుంది

తన పిల్లల విషయం తనూ అతని పిల్లల విషయం అతను చూసుకుంటే జీవినికి ఒక తోడూ నీడా బాగానే ఉంటుందనిపించింది.

అందుకే పెరిగిన పరిచయాన్ని పురస్కరించుకుని అతని పుట్టిన రోజుకు వెళ్ళి వద్దామనే నిర్ణయానికి వచ్చింది.

✡ ✡ ✡

## 8

**చివరి నిమిషం వరకు** సంకోచిస్తూనే ఉంది వసంత.

వెళ్ళాలా? వద్దా?

వెళ్ళటం సమంజసమేనా? కాదా?

ఎందుక్కాదు? మనిషి పెద్దగా పరిచయం లేదనుకోడానికి నెలలుగా గంటలకొద్దీ కబుర్లు కలబోసుకున్నాక అతను కొత్తని అనిపించడం లేదు.

ఒక మిత్రురాలిగా వెళితే తప్పేమిటి? సాయంత్రం బయలుదేరితే ఉదయం ఆరున్నరకల్లా అక్కడ దిగుతుంది. కావాలంటే రాత్రికి ట్రైన్ లేదా బస్ కాదంటే ఫ్లైట్‌లో అయినా వచ్చెయ్యవచ్చు.

చివరకు ధైర్యం చేసి సాయంత్రం ఆరింటికి బయలుదేరింది. టూరిజం వారి బస్. మంచి ఏసీ బస్... లక్జరీ కోచ్ ప్రయాణానికి అనుకూలంగా ఉంది... రెండు చీరలు ఓ ఎయిర్ బాగ్‌లో సర్దుకుని బయలుదేరింది.

అంతకుముందురోజే చెప్పాడు "నా పుట్టినరోజున మా ఆఫీస్‌లో పార్టీ... నువ్వుండకపోతే ఎలాగ?" అని.

ఉంటే ఏమని పరిచయం చేస్తాడు? అతన్ని అడగలేదు.

మధ్యలో టూరిజం వారి రెస్టారెంట్ దగ్గర ఆగినప్పుడు ఫోన్ చేసింది...

"రానా వెనక్కు వెళ్ళిపోనా అని ఆలోచిస్తున్నాను" అని.

హడావిడిలో టవల్ మర్చిపోయాను.. మరేదో మర్చిపోయాను అంటూ నాన్చింది.

ఏమైతేనేం ధైర్యంగా అతన్ని కలిసి రావాలనే నిర్ణయానికి వచ్చింది.

ఉదయం పూనె దాటగానే మళ్ళీ ఒకసారి రింగ్ చేసింది....

మొత్తానికి తెలతెలవారేసరికి బాంబే అతను చెప్పిన స్టేజ్ వద్ద బస్ దిగింది.

అక్కడినుండి ఎలా వెళ్ళాలి? ఎక్కడకు వెళ్ళాలి?

వెంటనే ఫోన్ చేసింది.

"ఎక్కడవున్నారు? " '

'బస్ దిగి ఇక్కడ నిల్చున్నాను"

"ఒక్క పదినిమిషాలు  వస్తున్నా"

"ఇంకా ఇంట్లోనే ఉన్నారా?"

అడిగినదానికి జవాబివ్వకుండా, "ఒక్క పదినిమిషాలు "

పదినిమిషాలు పది యుగాలుగా ఎదురు చూసాక, ఈలోగా పదిమంది ఆటోవాళ్ళు అడగటం వద్దనడం అయ్యాక అప్పుడు ఆటో దిగాడు విపుల్.

ఇదివరకే ఫోటో చూసివున్నా ఫోటోకూ అతనికీ చాలా తేడా ఉంది.

అతని కోసం ప్రత్యేకంగా తెచ్చిన ఫ్లవర్ బాస్కెట్ అతని చేతుల్లో వుంచి "మెనీ హేపీ రిటర్న్స్" అంటూ పుట్టిన రోజు శుభాకాంక్షలు అందించింది.

హడావిడి పడుతూ టాక్సీ మాట్లాడాడు.

"వస్తావని అనుకోలేదు... రాత్రి వెనక్కు వెళ్ళిపోనా అనగానే వెళ్ళిపోయావనే అనుకున్నా... " అతని కళ్ళలో అదో విధమైన మెరుపు.

ఏదో చెప్పబోయేలోగానే అతనికి ఫోన్ ..

బెంగాలీ లో మాట్లాడాడు, అయినా వసంతకు కాస్త అర్థం అవుతూనే ఉంది.

వదినగారితోలా ఉంది, మా మిత్రురాలు వచ్చింది ఆమెను ఇంటికి తీసుకు వెళుతున్నానని చెపుతున్నాడు.

"నిజంగా ఇది నా అద్భుతమైన పుట్టినరోజే... ఒక మిత్రురాలు నాకోసం నా పుట్టిన రోజు కోసం ఐదారు వందలమైళ్ళు ప్రయాణించి రావడం.... అద్భుతమే..."

"ఇందులో పెద్ద అద్భుతమేముంది... స్నేహం కోసం ఇంత మాత్రం చెయ్యలేమా?"

ఏడో ఫ్లోర్ లో ఒక మూల ఫ్లాట్...

తాళంతీసి చేసి లోనికి ఆహ్వానించాడు. చిన్న పాసేజ్, దానికి ఎడం వైపు కిచెన్... నేరుగా సిట్టింగ్ రూమ్ కమ్ డైనింగ్, సోఫాసెట్, చిన్న దివాన్ నాలుగైదు కుర్చీలు.. ఓ మూలగా టీవీ..

"కాఫీ నా? టీ నా?"

"నేను చెయ్యనా?"

అతను వద్దనలేదు.

స్వతంత్రంగా కిచెన్‌లోకి వెళ్ళింది.

ఓ పక్కన వాడుతున్న వంట సామాగ్రి బాగానే ఉన్నా, మరోవైపు దుమ్ము కొట్టుకుపోయిన వస్తువులు.. ఫ్రిజ్ ఓపెన్ చేసి పాలు తీసిచ్చాడు...

ఫ్రిజ్ తెరిచినప్పుడు కింద రాక్‌లో బీర్ బాటిల్స్ ఆమె దృష్టిని దాటిపోలేదు.

ఎలాగైతేనేం టీ చేసి రెండు కప్పుల్లో తెచ్చుకున్నారు.

ఒక్కడినే ఉన్నానంటాడు.. ఇంట్లో మాత్రం ఇల్లాలికి కావలసిన సమానంతా ఉంది.

ఇత్తడి డబ్బాల్లో పురుగు పడుతున్న సరుకులు.. దుమ్ముపేరుకుపోయి రంగు వెలసిన పాత్రలు...

అతనికోసం ప్రత్యేకంగా కొన్న పార్కర్ పెన్ అందించింది. ఫ్లవర్ బాస్కెట్ ఎదురుగా షో పీస్ పైన పెట్టాడు.

"మార్వెలస్ సెలెక్షన్..."

ప్లాస్టిక్ పూలు నిజానికి అసలు పువ్వుల్లానే ఉన్నాయి. వాటి మీద స్ప్రే చేసిన పర్ఫ్యూమ్ సువాసనలు గదంతా పరుచుకున్నాయి.

ఈలోగా పనిమనిషి వచ్చి ఇల్లంతా తుడిచి గిన్నెలు గ్రటాతోమేసి వెళ్ళింది.

చుట్టాలు పనిమీద వచ్చారు - ఆమెతో చెప్పాడు.

ఏదో ఊసుపోక మాట్లాడుకున్నట్టుగా ఉన్నాయి మాటలు...

ఇద్దరూ మాట్లాడుతుండగానే వంటమనిషి వచ్చి వంటచేసి వెళ్ళింది.

"ఉదయం ఇలా వచ్చి ఓ పది పుల్కాలు కాస్త పప్పు కూర చేసి పెడుతుంది. అవే తిని టిఫిన్‌లో పెట్టుకుని వెళతాను.. రాత్రికి మెస్"

ఆవిడ వెళ్ళిపోయాక తలుపు వేసి వచ్చాడు. ఇదివరకు చాట్లో మాట్లాడుకున్న విషయాలే మళ్ళీ కలబోసుకున్నారు.

"నీ స్వరంలో ఇది అని చెప్పలేని మార్దవం, దగ్గరితనం మనసును పట్టిలాగేస్తాయి. చెప్పు వసంతా.. ఈ రెండు మూడు నెలలుగా నాకోసం ఎంత లేదన్నా ఫోన్‌లకు ఇప్పుడిలా రావడానికి ఎంతో ఖర్చు పెట్టివుంటావు...దేనికి వసంతా...?"

"ఇది మరీ బాగుంది... దీనికోసం అనుకుని చేస్తామా? స్నేహానికి హద్దులుంటాయా? ఎవరి సంగతయినా ఏమోగాని నేను మాత్రం స్నేహం కోసం నా శరీరం కోసివ్వడానికి సిద్ధమే.."

"అది నా అదృష్టం"

రాత్రి పెద్దగా నిద్రపట్టలేదేమో కాస్త మగతగా ఉంది వసంతకు.

"అప్పుడే పదవుతోంది, స్నానం చేసి రెడీ అయితే ప్లానెటేరియమ్ చూద్దాం.. అలాగే మహాలక్ష్మీ టెంపుల్ కూడా.."

"ఆఫీస్‌కి వెళ్ళరా?"

"మిత్రురాలికోసం ఒక్కరోజు సెలవు పెట్టలేనా?"

అరగంటలో స్నానాలు ముగించి ఇద్దరూ బ్రేక్ ఫాస్ట్ ముగించారు.. పుల్కాలు కూర.. పప్పు..

"నీ కోసం ఆరెంజ్ జ్యూస్ తెచ్చాను.."

"థాంక్యూ"

ఇద్దరూ బయటకు వచ్చారు. ఫ్లాట్స్ కావడం వల్ల కాబోలు ఎవరూ పెద్దగా పట్టించుకున్నట్టు అనిపించలేదు. కాస్త నడిచి ట్రైన్ ఎక్కి, మళ్ళీ ట్రైన్ దిగి ఆటో ఎక్కి ప్లానెటేరియమ్‌కి వెళ్ళారు. అక్కడ రెండు టికెట్స్ కొని లోపలకు వెళ్ళారు. ఆ చుట్టూ తిరిగి చూసాక అరగంట తరువాత షో మొదలైంది. అతని పక్కన కూచుని చూడటం కొత్తగా ఉంది.

నిజమే...

ఒక మంచి మిత్రుడు కావాలి..

ఇలా ఎక్కడికి వెళ్ళినా తోడుండటానికీ... మనసులో మాటలు పంచుకుందుకూ...

ఎంత నిశ్చింతగా ఉందిప్పుడు.

పక్కన కూర్చున్న విపుల్ తన చేతిని అతని చేతుల్లోకి తీసుకున్నా అదో విధమైన దగ్గరితనమే తప్ప మరేమీ అనిపించలేదు.

గంట షో చూసి బయటకు వచ్చారు.

మళ్ళీ ఆటో ఎక్కి మహాలక్ష్మి గుడికి వెళ్ళారు. ఎత్తుగా ఎన్నో మెట్లెక్కాక సముద్రతీరానికి దగ్గర్లో అమ్మవారి దర్శనం ఆమె మనసుకు శాంతి నిచ్చింది.

అక్కడినుండి టీ తాగి మళ్ళీ ట్రైన్ ఎక్కి వచ్చేసరికి దాదాపు ఆరు దాటింది. రోజంతా తిరిగారేమో బాగానే అలిసిపోయారు.

ఇంటికి వచ్చి మొహం కడుక్కుని రెడీ అయేసరికి ఆరున్నరైంది. ఈ లోగా రెస్టారెంట్‌కి ఫోన్ చేసి డిన్నర్ ఆర్డర్ చేసాడు విపుల్.

ఆరున్నర దాటింది ఏడు దాటింది.... ఏరీ గెస్టు?

అనవసరంగా పార్టీ పేరు చెప్పి ఆపేసాడా?

ఏమిటితని ఉద్దేశ్యం?

ఎనిమిది అవుతుండగా వచ్చారు వాళ్ళిద్దరూ... శాలినీ మిశ్రా... రఘునాయక్

ఒకనొకరికి పరిచయం చేసారు.

తన ఫ్రెండ్ భార్యగా పరిచయం చేసాడు... వీసా పనిమీద వచ్చిందనీ తన పుట్టిన రోజు కారణంగా ఆగిపోయిందనీ చెప్పాడు.

"విపుల్ బర్తడేకోసమే ఉన్నాను. లేకపోతే వెళ్ళిపోయేదానను.." చెప్పింది వసంత.

ఆ అమ్మాయికి ముప్ఫై ముప్ఫై ఐదేళ్ళుంటాయి. వారం క్రితమే పెళ్ళయిందంట. ఆమె కంటె ఆ అబ్బాయి రెండేళ్ళు చిన్నవాడట.. అటు వాళ్ళూ ఇటు వాళ్ళు అవుననడానికి రెండేళ్ళు పట్టిందట... ఏవో ఆఫీస్ విషయాలు మాట్లాడుకున్నారు. డిన్నర్ అరేంజ్‌మెంట్‌కి కావలసిన ఏర్పాట్లలో వసంత కూడా సాయపడింది. ప్లేట్లు కడిగి పెట్టడం, పార్సెల్స్ టేబుల్ మీద అరేంజ్ చెయ్యడం.. కొత్త జంటకు తను కొన్న రెండు గులాబీల గుచ్చం అతను అందించాడు విపుల్. ఆ అమ్మాయి మాత్రం పెద్ద గ్రాండ్‌గా ఉన్న బొకేతో పాటు మంచి గిఫ్ట్ కూడా తెచ్చింది.

మధ్యాహ్నం వసంతతో కలిసి షాప్‌కి వెళ్ళి అతను ఆ అమ్మాయి కోసం వెండి కుందుల జత కొన్నాడు. తన డిజిటల్ కెమేరాతో ఫోటోలు తీసాడు.

భోజనాలు ముగిసి, స్వీట్లు పాన్లు అన్నీ అయి వాళ్ళు వెళ్ళేసరికి పదీపదిన్నర దాటింది.

"నాకు చాలా సంతోషంగా ఉంది" చెప్పాడతను. నేలబారుగా ఉన్న దివాన్ మీద కూర్చున్న ఆమె పక్కన వచ్చి కూచుని చటుక్కున ఆమె ఒళ్ళో తలదూర్చి "చాలా సంతోషంగా ఉంది... థాంక్యూ" - మరోసారి చెప్పాడు. వసంత ఏమీ మాట్లాడలేదు. అది మనసుకు హాయినిచ్చింది.

ఏమీ మాట్లాడలేక పోయింది వసంత. కాస్సేపాగి లేచి లోపలకు వెళ్ళాడు...

"లోనికి రా వసంతా.."

వసంత లేచి లోనికి వెళ్ళింది,

డబుల్ కాట్ వున్న బెడ్ రూమ్ అది. అక్కడే ఉంది అతని కంప్యూటర్...

రోజూ ఇక్కడ కూర్చునే చాట్ చేస్తాడు.... అనుకుంది... మొదటిసారి చూస్తున్నా ఎంతో పరిచయం ఉన్నట్టుగా...

అతను బయటకు వెళ్ళగానే తలుపు వేసి చీర మార్చుకుని తెచ్చుకున్న నైటీలోకి మారింది...

తలుపు తీసి లోనికి వచ్చిన అతను ఒకసారి పరీక్షగా చూసి "అచ్చం ఇంగ్లీష్ అమ్మాయిలా ఉన్నా"వన్నాడు

"ఇక్కడే పడుకోరాదూ... !? "

అప్పటికే అతనిమీద ఎంతో నమ్మకం ఏర్పడిపోయింది వసంతకు.

అతను హాని చేసే రకం కాదు.. నూటికి నూరు శాతం నమ్మవచ్చు...

చాలా సేపు ఇద్దరూ పక్కపక్కనే పడుకున్నారు..

స్లీవ్‌లెస్ భుజాలు స్పృశిస్తూ "ఎంత మెత్తగా ఉందీ స్పర్శ నీ మనసులా" అని అన్నాడు... రాత్రంతా దాదాపు నిద్రలేకుండానే గడిచిపోయింది. ఒక అద్భుతాన్ని చూసినట్టు ఆమె వంక చూస్తుండిపోయాడే తప్ప ఎలాంటి సాహసానికీ ఒడిగట్టలేదతను...

ఉదయం లేచి ఏమాత్రం సంకోచం లేకుండా అతనితో మామూలుగా మాట్లాడగలిగింది వసంత.

బ్రేక్‌ఫాస్ట్ చేసి బయటకు వెళ్ళి ఫ్లైట్ టికెట్ కొన్నారు. ఇంటికి వచ్చి లంచ్ ముగించి, కూర్చునే నిద్రలోకి జారిపోయింది వసంత. మెలుకువ వచ్చేసరికి ఎదురుగా విపుల్ - "మంచి నిద్రలో ఉన్నావు అందుకే డిస్టర్బ్ చెయ్యలేదు. "

అతని వంక కృతజ్ఞతగా చూసింది.

"ఫ్లైట్ ఆరింటికి. కనీసం నాలుగింటికైనా అక్కడుండాలి" అప్రయత్నంగా టైమ్ చూసింది. మూడున్నర...

"ఇక్కడికి ఎయిర్ పోర్ట్ దూరమా?"..

"దూరమే.. కనీసం అరగంట పడుతుంది.."

లేచి గబగబా మొహం కడుక్కుంది... సరిగ్గా రెండు నిమిషాల్లో తయారైంది. బాగ్ సర్దుకుంది.

ఈలోగా అతనూ రెడీ అయాడు.

"మరిక వెళ్ళడమేనా?"

తలూపింది వసంత.

"పోనీ ఈ రోజుకి ఉండిపోరాదూ..."

"లేదు వెళ్ళాలి... మీరు రండి నేను వెళ్ళేలోగా.."

హాల్ మధ్యలో నిల్చుంది వసంత. బాగ్ పక్కన సోఫా మీద ఉంది. కీస్ తీసుకున్న వాడల్లా విపుల్ ఒక్కసారి ఆమెకు దగ్గరగా వచ్చి ఎదురుగా నిలుచున్నాడు...

"సెలవా మరి!?" అప్రయత్నంగానే ఆమె పెదవుల మీద పెదవులాన్చాడు.

వసంత వారించలేదు.

"పద" అతను ముందుకు కదిలాడు.

"ఒక్క నిమిషం" అతను వెనక్కు తిరగ్గానే తనంతటతానుగా అతని భుజాలమీద చేతులు వేసి పెదవులపై పెదవులాన్చి.. "థాంక్యు" అని మాత్రం అంది.

అప్పుడు కూడా అతనిలో ఒక మంచి మిత్రుడినే చూసిందామె.

✡ ✡ ✡

జీవితమంతా గుర్తుంచుకోతగ్గ మిత్రుడని మురిసిపోయింది.

ఇలాంటి స్నేహితుడు ఒక్కడున్నా చాలుకదా అనిపించింది.

అందుకే తరువాత ఎన్నిసార్లు మాట్లాడినా మీ ఆవిడతో రాజీ పడండని సూచించేది.

"ఇద్దరూ అమ్మాయిలే కదా? అమ్మాయిలకు అమ్మ అవసరం చాలా ఉంటుంది.. అలాగని తండ్రినీ వదులుకోలేరు... పిల్లల కోసం ఆమెతో అంత మాత్రం సరిపెట్టుకోలేరా?" అని అడిగేది.

మాటల్లో ఆమెకు అర్థమైందేమిటంటే - ఆవిడ కూడా ఉద్యోగస్తురాలే... ఇతనికి బదిలీ అవగానే ఆవిడ ఇతనివెంట రాలేదు.. పిల్లలు వాళ్ళ చదువులు అంటూ వాళ్ళతో ఉండిపోయింది.

అందుకే మళ్ళీ పెళ్ళి చేసుకుంటానని బెదిరించడమే కాకుండా ప్రయత్నాలూ మొదలుపెట్టాడు. అంతకుముందు కూడా ఒకమ్మాయి కథంతా తెలిసి వెనక్కు తగ్గింది.

"నువ్వు గట్టిగా నిలబడి పెళ్ళికి సరేనంటే అప్పుడు ఆవిడను వదిలించుకుంటా.."

అది నచ్చలేదు వసంతకు.

ఈలోగా ఆమె అమెరికా ఫ్లైట్ ఎక్కెయ్యడం జరిగింది.

"కాల్ చెయ్యడానికేం అప్పుడో ఇప్పుడో ఫోన్లో మాట్లాడచ్చుగా.." వెళ్ళే ముందు అతని అభ్యర్ధన.

"వసంతా మీరు నాకు చాలా నచ్చారు.. నా బలహీనతను సొమ్ముచేసుకోకుండా.. నన్ను రాజీ పడమనే చెపుతున్నారు...ఏదేమైనా మనం మంచి మిత్రులుగా ఉండిపోదాం"

అతని అభ్యర్ధనను ఆమె అవునని కాని కాదని కాని జవాబివ్వలేదు.

✡ ✡ ✡

ఎప్పటిలాగే నెట్ ఓపెన్ చేస్తూనే ఆన్‌లైన్ లో కనిపించిన అతనికి "హలో" చెప్పింది.

అమెరికానుంచి తిరిగి వచ్చి నాలుగురోజులైంది.

కూతురి తీరు అంతగా నచ్చకపోయినా.. పురుడూ, పుణ్యమూ నా బాధ్యతే కదా అనుకుని వెళ్ళింది. వెళుతూ వెళుతూ చంటిపాపకు అవసరమయే జుబ్బాలు, చిన్న పరుపు మొదలైనవెన్నో పట్టుకుని అమెరికాలో దిగింది.

కాని... ఆలోచన ఠక్కున ఆగిపోయింది... కంప్యూటర్ స్క్రీన్ మీద కనిపించిన అక్షరాలు చూసి...

"హలో..."

"హౌ ఆర్ యూ?"

"నేను అర్చనను..."

"హాయ్"

"నువ్వు మా డాడీతో మాట్లాడటానికి వీల్లేదు... అర్ధమయిందా... మాట్లాడావో నేను ఏం చేస్తానో నాకే తెలియదు"

దిమ్మెరపోయింది వసంత.

ఇది బెదిరింపా? ఎందుకు? ఏం జరిగివుంటుంది? అర్ధం కాలేదు.

"మే గాడ్ బ్లెస్ యూ" అని యాహూ నుండి లాగవుటయింది.

కాని మనసు పరిపరివిధాల పోయింది. ఏమి జరిగివుంటుంది? ఎందుకాపిల్ల అంత తీవ్రంగా మాట్లాడింది? ఏమీ అర్ధంకాలేదు... అన్యమనస్కంగా పని ఆపేసి టీవీ చూస్తూ కూర్చుంది.

ఓ పక్క టీవీ చూస్తున్నా మనసు మాత్రం మాట వినకుండా ఆలోచనల్లోకి చెదపురుగులా దూరిపోతూనే ఉంది.

ఇదివరకులా కొడుకూ, కూతురూ తరచుగా ఫోన్లు చెయ్యరు... ఎవరి కుటుంబాలు వారికి, ఎవరి కాలక్షేపాలు వారికున్నాక ఎంగేజ్ మెంట్స్‌లో వ్రాసుకుంటే తప్ప అమ్మకి ఫోన్ చెయ్యాలని గుర్తురాదు. వసంత కూడా నెమ్మదిగా వారి ఫోన్‌లకోసం ఎదురు చూసే అలవాటు తప్పించుకుంది.

ఆ ప్రయత్నంలోనే విపుల్‌కి దగ్గరయింది. అమెరికా వెళ్ళివచ్చాక ఆ ఆలోచన మరింత బలపడింది.

తను తన ప్రపంచం సృష్టించుకోవాలే తప్ప వాళ్ళ జీవితాల్లో ఒక తలనొప్పిగా మారకూడదు అని... అనుకోని విపత్తులా విపుల్ కూతురి ప్రవర్తన...

అన్యమనస్కంగానే సినిమా చూసి నిద్రలోకి ఎప్పుడు జారి పోయిందో కూడా ఆమెకే తెలియదు.

✡ ✡ ✡

"మీ అమ్మాయి మొన్న ఆన్ లైన్‌లో మీ ఐడీలో ఉండింది"

తరువాత ఒకసారి విపుల్ చాట్‌లోకి వచ్చినప్పుడు చెప్పింది..

"అవునా... నాకు అనుమానంగానే ఉండింది. నా పాస్ వర్డ్ హ్యాక్ చేసారని..."

"ఏమందో తెలుసా..."

"ఊహూ..."

"మీతో ఇంకోసారి నేను మాట్లాడటానికి వీల్లేదట... మాట్లాడితే ఏం చేస్తుందో తనకే తెలియదటా..."

"నీ పిల్లలయినా నా పిల్లలయినా అలాగే అనుకుంటారు... వాళ్ళేదో అన్నారని మనం పట్టించుకోనవసరం లేదు.."

అతను కూల్‌గా మాట్లాడటంతో ఆ విషయం అతనికి తెలుసనేది అర్థమైంది.

తెలిసినా కనీసం సారీ అని కూడా అనకుండా..

మై గాడ్!

ఏమనుకుంటున్నాడు తనగురించి?

మనసులో అంతులేని కోపం..

అంతేనేమో... అవసరానికి వాడుకుని వదిలేద్దామనుకున్నాడా?

పిల్లలు ఎలా మాట్లాడినా సపోర్ట్ చేస్తున్నాడా?

కోపంతో మరో మాట మాట్లాడకుండా లాగవుటయింది.

అయితే ఆకోపం ఎంతో సేపు నిలవలేదు.

తీరిగ్గా ఆలోచించుకుంటే అతనికున్న ఇబ్బందులేమిటో ఇంట్లో ఏం జరిగిఉంటుందో ఆమె ఊహకందలేదు.

కాని మరో ఎదురు చూడని షాక్ మాత్రం రెండురోజుల్లో ఆమెను కుదిపేసింది.

మరో మెయిల్ ఐడీ నుండి విపుల్ పంపిన మెయిల్ అది.

"మరెప్పుడూ యాహూ ఐడీ వాడవద్దు."

ఒకరకంగా అలా అనటం స్నేహాన్ని వదులుకోవడమే ననిపించింది.

ఎక్కడలేని దుఃఖం పొంగివచ్చింది వసంతకు.

జీవితంలోంచి ఒక భాగం పూర్తిగా వేరైపోయిన ఫీలింగ్..

అయినా తనను తాను నిలవరించుకుని మనసును సరిపెట్టుకోవడం పెద్ద శ్రమ అనిపించలేదు.

ప్రాణంలో ప్రాణం అనుకున్న శ్రీ అర్థంతరంగా వంటరిని చేసి వెళ్ళిపోతే జీవితం ఆగిపోయిందా? చిన్నప్పుడు ఎంతో ఇష్టపడిన ప్రభాకర్ నిశ్శబ్దం జీవితాన్ని ఆపేసిందా?

జీవితమంతా వాళ్ళే అనుకున్న పిల్లలు పరాయిదానిలా చూస్తుంటే ఊపిరి తీసుకోవటం లేదా?

విపుల్ మాట్లాడనంత మాత్రాన ప్రపంచం వట్టిపోతుందా?

స్థిర నిశ్చయానికి వచ్చినట్టు లేచి పుస్తకం తీసుకుంది. సరికొత్త నవల. కొని చాలా రోజులైనా విపుల్‌తో చాటింగ్‌లో పడి దాన్ని చదవనేలేదు.

కష్టపడి ఓ పదిపేజీలు చదివినా మనసుకు నచ్చలేదది.

ఇంత కృత్రిమంగా పాత్రలను ఎందుకు సృష్టిస్తారు?

వాస్తవాన్ని వాస్తవంగా వ్రాయలేరా?

రాసే ధైర్యం లేదా?

ఏదో నిశ్చయానికి వచ్చినదానిలా లేచి రైటింగ్ పాడ్ తెల్లకాగితాలు తెచ్చుకుంది.

అది ఓ నవలకు స్వీకారమని ఆమె ఎంతమాత్రం అనుకోలేదు

✡ ✡ ✡

పత్రిక ఆఫీస్‌లో పని చెయ్యడం వల్ల తోటి పత్రికల ఎడిటర్లు చాలామందే తెలుసు.

ముందుగా వ్రాస్తున్న నవల తమ పత్రికలోనే సీరియల్‌గా వేద్దామని అనుకుంది. కానీ ప్రభాకర్ బిజినెస్ స్టింక్ట్ తెలుసు గనక మరో పత్రికకు పంపితే కనీసం డబ్బైనా వస్తుందనిపించింది. అందుకే లంచ్ టైమ్‌లో సప్త రాగిణి పత్రిక ఆఫీస్‌కు ఫోన్ చేసింది.

"హలో నేను వసంత..." అనగానే

"చెప్పండి మేడమ్ శ్రీనివాస్‌ని మాట్లాడుతున్నాను..."

"ఏమీ లేదు నాదొక రచన... ఒక నవల రాస్తున్నాను... సీరియల్‌గా మా పత్రికలో కాక మరేదైనా దాంట్లో వస్తే బాగుంటుందనిపించి...."

"మేడమ్ మీరు ఈ విషయానికి అడగాలా.. పంపండి వెంటనే మొదలు పెడతాము.... మీరు రాసిస్తాననడమే మహా భాగ్యం..."

"రచన చూడకుండానే..."

"ఏడాదిలో మీరు పత్రికను ఎంత పైకి తెచ్చారో చూసాక మళ్ళీ మీ రచనను ప్రత్యేకంగా చూడాలా? మీరు మా పత్రికకు ఇవ్వదలచుకోవడమే ఎక్కువ..."

"అది కాదు.. ముందుగా అన్ని విషయాలూ మాట్లాడుకుంటే.."

"ఓకే. చెప్పండి ఎప్పుడు రమ్మంటారు?"

"రమ్మనడమా?' ఆమె అంతవరకూ ఆలోచించలేదు?"

"అదే. మరెలా పర్సనల్‌గా మాట్లాడుకోగలం... పోనీ మీ ఆఫీస్‌కి రమ్మంటారా?"

"ఒద్దొద్దు.. ఒక పని చెయ్యండి రేపు మా ఇంటికి వచ్చారంటే.."

మర్నాడు అతను వచ్చాక వసంత అడగకముందే చెప్పాడు.

"పదహారు వారాల సీరియల్‌కు మామూలుగా పదహారు వేలిస్తున్నాము... కాని మీకు ఇరవై వేలిస్తాము.."

అసలు వసంత అంత డబ్బు ఎదురు చూడనే లేదు.

రాసిన పేజీలు అందించాక లోనికి వెళ్ళి కాఫీ తెచ్చేలోగానే అతను గబగబా చదివేశాడు.

"ఎక్స్‌లెంట్.. చాలా అద్భుతంగా ఉంది... తప్పకుండా మా పత్రిక పేరూ ఖ్యాతీ పెరిగి తీరుతాయి..."

"ఏదైనా కలం పేరుతో..." సందేహంగా ఆగింది.

"వద్దు వద్దు... ఓ ఫోటో వేసి మరీ వేద్దాం... ఇంతవరకు ఇంత ధైర్యంగా ఇలాంటి విషయం మీద ఎవరూ రాయనే లేదు... ఈ మొదటి నవలే మీకొక బ్రేక్ అవుతుంది..." మరి అయిదు నిమిషాలు కూర్చుని అతను వెళ్ళిపోయాడు.

ఆ రోజిక ఆఫీస్‌కి వెళ్ళాలనిపించలేదు వసంతకు.

మనసునిండా పొంగి పొర్లుతున్న భావాలకు అక్షర రూపం ఇవ్వాలన్న తపన ఆమెను ఎక్కడా ఆగనివ్వడం లేదు.

ప్రభాకర్ ఆఫీస్‌కి రావడం పదకొండు దాటాకే.. ఈలోగా ఆఫీస్ మేనేజర్‌కి ఇన్‌ఫాం చేసేస్తే సరి.. అనుకున్నవెంటనే అతని ఫోన్ చేసి ఒంట్లో బాగాలేదని రావటం లేదని చెప్పి....

డైనింగ్ రూమ్ పరదాలు పక్కకు లాగి ఫ్రెంచి విండో ఓపెన్ చేసింది.

ఎన్నాళ్ళకో మనసు ప్రశాంతంగా అనిపించింది.

పెన్ను పేపర్లు తెచ్చుకుని డైనింగ్ టేబుల్ మీద పెట్టి వ్రాసుకోడం ప్రారంభించింది.

దాదాపు రెండు గంటలపాటు అలా రాస్తూనే ఉన్నాక డోర్ బెల్ శబ్దానికి కానీ ఈ లోకంలోకి రాలేదు.

ఉలిక్కిపడి టైమ్ చూసింది. పన్నెండున్నర దాటింది...

ఆఫీస్‌కి వెళ్ళదలచుకోలేదు గనక నైటీ మార్చుకోనేలేదు...

ఇప్పుడెలా...

లేచి వెళ్ళి ముందు చీర కట్టుకుని మరీ తలుపు తీసేందుకు వెళ్ళింది.

ఈలోగా మరో రెండు సార్లు డోర్ బెల్ మోగింది.

తలుపు తెరుస్తూనే ఎదురుగా ప్రభాకర్

"ఒంట్లో బాగాలేదు రాలేదంటేను ... చూసి వెడదామని..."

పక్కకు తప్పుకుంది...

లోపలకు వచ్చాక "కూర్చోండి" అంటూ సోఫా చూపింది.

"తలుపు తియ్యకపోతే కంగారు పడ్డాను... నిద్రలో ఉన్నారా.... డిస్టర్బ్ చేసానా...?"

"లేదు... పనిమనిషి ఎక్కడో ఉంది... తను తీస్తుందని నేను, నేను తీస్తానని తను....." అప్రయత్నంగానే అబద్దం ఆడేసింది. ఎందుకో అతని ఒంటిగా ఉన్నానని చెప్పాలనిపించలేదు.

"ఓకే. ఏమిటి జ్వరమా... డాక్టర్ దగ్గరకు వెళ్ళావా... అని నవ్వుతూ "అఫ్కోర్స్.. డాక్టర్ గారి శ్రీమతివి గనక నీకే మందులు తెలిసివుండాలి."

"అబ్బే అంత పెద్ద విషయమేం కాదు.. కొంచెం ఫీవరిష్‌గా ఉండి తలనిప్పి అంతే... కొంచెం రెస్ట్ తీసుకుంటే సరిపోవచ్చు..."

అని ఒక్క నిమిషం అంటూ క్షణంలో చిన్న ట్రేలో ఒక గాజు గ్లాస్‌లో ఆరెంజ్ జ్యూస్ తెచ్చింది.

"అబ్బే నో ఫార్మాలిటీస్. జస్ట్ యాజ్ ఎ ఫ్రెండ్ చూసి పోదామని వచ్చానంతే..."

అంటూనే గ్లాస్ అందుకున్నాడు. దాన్ని రెండు గుక్కల్లో గటగటా తాగేసి "ఓకే, టేక్ కేర్" అంటూ వెళ్ళిపోయాడు.

వసంతకే ఆశ్చర్యంగా ఉంది.

శ్రీ లోటు మర్చిపోయేందుకు ఇన్నాళ్ళుగా ఒకరకంగా ఇన్నేళ్ళుగా కనిపించిన ప్రతివారితో పరిచయం పెంచుకుంటూ వచ్చిన తను ఇది ఇప్పుడు మొదటి సారి... ముక్తసరిగా మాట్లాడి అతన్ని పంపించెయ్యడం...

మళ్ళీ ఏదో మార్పు వస్తోందా తనలో?

అది మంచికా చెడుకా?

ఏమో?

✡ ✡ ✡

9

సోమవారం ఉదయమే ఆఫీస్ కి వెళ్ళగానే ప్రభాకర్ పిలుస్తున్నాడని చెప్పడం కాస్త ఆశ్చర్యమనిపించింది. అసలు ఇంత తొదరగా ఆఫీస్‌కి వచ్చాడంటేనే వింతగావుంది.

సాధారణంగా పదకొండుదాటితేగాని రాడు ఒకసారి భోజనం చేసి ఏ రాత్రికి ఇల్లు చేరినా ఇబ్బంది లేదని అతని అభిప్రాయం.

వసంత అతని రూంలోకి అడుగు పెట్టేసరికి అప్పటికే మిగతా ఆఫీస్ ఎగ్జిక్యూటివ్స్  కూడా వున్నారక్కడ.

"రండి మీకోసమే చూస్తున్నాం "

కాస్తరిలీఫ్‌గా వూపిరి పీల్చుకుంది ఏదో అఫీషియల్ మీటింగ్ లెమ్మనుకుని సరిపెట్టుకుంది.

పత్రిక తీరుతెన్నులగురించి దాని సర్క్యులేషన్ పెంచాల్సిన అగత్యం గురించీ పెరిగిపోతున్న ఖర్చులగురించీ సవివరంగా గంటన్నరపాటు చర్చ జరిగింది. అందరికీ టీలు స్నాక్స్ ఇచ్చారు..

ఒక్కొక్కరు సెలవుతీసుకునే సమయంలో వసంత కూడా బయటకు రాబోయింది.

"వసంత గారూ మీరొక్కసారి ఆగండి మీతో మాట్లాడాలి" అన్నాడు. దాని భావం తెలిసిన మిగతా సిబ్బంది త్వరత్వరగా వెళ్ళిపోయారు.

అందరూ వెళ్ళిన రెండు నిమిషాలకు హఠాత్తుగా "ఇదేమైనా బాగుందా వసంతా?" కాస్త నిష్టూరంగా వుందతని స్వరం.

"ఏది? ఏం జరిగింది?" కంగారు పడింది.

"ఇక్కడ పనిచేస్తూ ..నువ్వు వ్రాస్తావని నాకు చెప్పకపోవడం?"

"ఓహ్ అదా ...ఏవో మామూలు వ్రాతలేగా ..."

"అదిసరే ఒక్కమాట చెప్పివుంటే మన పత్రికలోనే పెద్ద పబ్లిసిటీ ఇచ్చి మరీ నవల వేసే వాళ్ళం కదా..."

అతనికీ సంగతి ఎలా తెలిసిందా అని ఆలోచిస్తూనేవుంది.

"వెయ్యరని కాదు ...నా రచన మన పత్రికకు తగ్గదో కాదో..."

"అయినా ... ఇది చూడు .... " సప్తరాగిణి వారి పత్రిక మొదటిపేజీలో పూర్తి పేజీ కొత్త సీరియల్ అడ్వటైజ్‌మెంట్

ఓ పక్కన ఆమె ఫోటో

రంగురంగుల అక్షరాలతో నిజంగానే అద్భుతంగావుంది.

కొత్త పత్రిక ఆ రోజే వచ్చింది...

"అరె! నాకు తెలీనే తెలీదింకా " ఆశ్చర్యంగా పత్రిక తీసుకుని మురిపెంగా చదువుకుంది.

"సీరియల్ వేసుకుంటారా అని అడగ్గానే వేసుకుంటామన్నారు కాని ఇంత తొందరగా ప్రకటిస్తారని అనుకోలేదు .."

"ఎన్ని వేలిస్తామన్నారు సీరియల్‌కి ?"

"పాతిక" కావాలని కాస్త ఎక్కువే చెప్పింది.

"ఓ పని చెయ్యి , నేను ముప్పై వేలిస్తాను , ఇప్పుడీ సీరియల్ వాళ్ళకు ఇవ్వడంలేదని చెప్పు. మన పత్రికలోనే వేసుకుందాం" ప్రభాకర్‌కి అది ప్రెస్టేజ్ ఇష్యూగా తోచింది.

గొంతులో పెనుభూతం అడ్డుపడ్డట్టయింది వసంతకు -నిమిషంలో ఏదో ఒకటి చెప్పాలి -ఈ ప్రభాకర్ దేవాంతకుడు... అంతేనా లాభనష్టాల బేరీజు ఈపాటికే వేసుకుని వుంటాడు.

అతనికిచ్చినా బాగుందనీ బాగాలేదనీ ఎన్నయినా అనగలడు.

ఏంచెయ్యాలి?

"అదెలా కుదురుతుంది ప్రభాకర్? ముందు అగ్రిమెంట్ వ్రాసుకున్నాకే వాళ్ళు డబ్బిచ్చి మరీ పట్టుకెళ్ళారు నవలను" కావాలనే కాస్త అబద్ధాన్ని జోడించింది.

"ఇక్కడ పనిచేస్తూ వేరెవరికో నవల ఇవ్వటం బాగుందా? " కాస్త తీక్షణంగానే వుందతని స్వరం.

వసంతకూ కోపం తన్నుకు వచ్చింది

"ఉద్యోగవిషయంలో మనం ఎలాంటి కండిషన్స్ వ్రాసుకోలేదనుకుంటాను" కాస్త నిక్కచ్చిగానే జవాబిచ్చింది.

"అది కాదు వసంతా"

కాస్త మెత్తబడ్డాడు.

"సరేలే ఇకపైన ఇలా చెయ్యకు "

ఇహ మాట్లాడటం అయిపోయిందన్నట్టుగా ఏదో ఫైల్ ఓపెన్ చేసాడు.

ఒక్క క్షణం అక్కడే నిల్చుంది వసంత.

ఇకపైన సంగతి కూడా వేడిలో వేడి అప్పుడే తేల్చుకుంటే పోతుందన్నట్టు.

మళ్ళీ మనసు మార్చుకుని బయటకు నడిచింది.

సీట్‌లో వెళ్ళి కూర్చున్నా మనసంతా వికలమైపోయింది.

ఇంతవరకూ ఎవరూ ఇప్పుడూ ఇలా ఎందుకు చేసావని ఆమెను అడగలేదు. అలాంటిది...

ఎక్కడ లేని ఉక్రోషం ఆమెను నిలవనియ్యడంలేదు.

వెంటనే సెలవుపెట్టి ఇంటికి వెళ్ళిపోదామనిపించినా తమాయించుకుంది.

ఏది చదివినా మనసుకు పట్టడం లేదు.

పని చేసేందుకు ఇష్టంగా లేదు.

ఉద్యోగం చేసినంతమాత్రాన తన రచనలు తన ఇష్టం వచ్చిన వాళ్ళకు ఇవ్వకూడదా? ఇదెక్కడి నియమం?

అలాంటి నిబంధనలకు తలవంచే మనిషి కాదు తను. ఏం చేస్తాడో చేసుకోనీ మరో నవల ఈరోజే ఆరంభిస్తాను..

ఈ పత్రికకు తప్ప మిగతా అన్నింటికీ ఇస్తాను ..మహా అంటే ఉద్యోగం మరొకరికి ఇచ్చుకుంటాడేమో ... ఇచ్చుకోనీ...

ఇక్కడ భయంతో గుండెలాగిపోయే వాళ్ళెవరూ లేరు...

ఓ పక్క ఆలోచనలు సాగుతూనే ఉన్నాయి మరో పక్క మనసు పొరల్లో కొత్త నవలకు ఆవిష్కరణ ఆరంభమైంది.

మనిషికీ మనిషికీ మధ్య మాటల లోకం ఒకటైతే నిశ్శబ్దలోకం మరొకటీ -ప్రతిమనిషికీ రెండు లోకాలు

అవును రెండు లోకాలు

సంస్కారం ముసుగులో ఒక లోకం.. నగ్నంగా మరొకలోకం..

నవలకు చక్కని పేరు

రెండు లోకాలు...

కొత్త నవలకు ఆ పేరుతో శ్రీకారం చుట్టడం జరిగింది.

ఒక కుటుంబం.. అందులోని ప్రతివ్యక్తి .. రెండులోకాలూ చాలు నవలకు..

నెమ్మది నెమ్మదిగా నవల రూపకల్పనలో మునిగిపోయిన ఆమె మనసు చిత్రంగా శాంతించింది.

తన యాభై ఏళ్ళ జీవితంలో అనుభవంలోకొచ్చిన ఏపాత్రలు నవలకు చక్కగా అద్దినట్టు సరిపోతాయో కూడా ఏరి పెట్టుకుంది.

గడియారం ఐదు గంటలు కొట్టగానే లేచి ఆఫీస్ బయటకు వచ్చెయ్యడం ఆమెకే కొత్తగావుంది.

ఇంటికి వస్తూనే టీవీ ఆన్ చేసే అలవాటు మరచిపోయింది.

వంటింటిలోకి వెళ్ళి టీ కూడా చేసుకోవాలనిపించలేదు.

డైనింగ్ టేబుల్ మీద రైటింగ్ పాడ్ పేపర్లు సిద్ధంగా ఉన్నాయి.

శ్రీ గుర్తుకు వచ్చాడు ఇదివరకులా మనసు విషాదంలో కొట్టుకుపోలేదు.

అతనే తనకో చక్కని స్ఫూర్తిలా అనిపించింది.

నవలకంటే ముందు భావానికి రూపకల్పన ఇవ్వాలనిపించింది.

నాకు తెలుసు

నాచుట్టు పక్కలే తారట్లాడుతుంటావు

కంటికి కనిపించకపోయినా

స్పర్శ నిశ్శబ్దంగా పలకరిస్తూనేఉంటుంది

నడివేసవి నిట్టూర్పుల్లో

మలయ మారుతంలా

మంచిగంధంలా

నా అధరాగ్రాలను అలవోకగా స్పృశించిపోయేది

నీ చిలిపితనం కాక మరేమిటి

ఊపిరాడని ఉద్విగ్నతలో

గాలి ఉరేసుకుని తలవాల్చేసిన నిర్జీవ క్షణాన

నీ చేతి పలకరింపు నా చెక్కిళ్ళపై

వెన్నెలె చల్లదనంతో

వినూత్న కావ్యాల నావిష్కరించటం

నాకు తెలీదా?

హఠాత్తుగా జనసంద్రం నడిమధ్యన

నీటి బొట్టులా నేను
నిశ్చలంగా పయనించేవేళ
అగుపించని నీ బాహువుల మధ్య
అనునయ కౌగిట్లో నేను ఓ పులకింతగా

అందరి మధ్యనా నిర్లజ్జగా
నీలో ఓఅణువై చెమ్మగిలిన మనసై
ద్రవించి ద్రవించి ఓ ప్రవాహాన్నవుతాను
ప్రణయగీతాన్నవుతాను
ప్రేమ వల్లరినౌతాను
నాకు తెలుసు
మనిద్దరి ఊసులకూ బాసలకూ
దేహాల ప్రసక్తిలేదు
అలలు అలలుగా సాగే నీ ప్రేమ గానంలో
నేను తుంపర్లు తుంపర్లుగా
జల్లులు జల్లులుగా కురుస్తాను
రారమ్మని పిలిచే వలపు బాహువుల్లో
ఓ చిరుగువ్వనై ఒదిగిపోతాను
నిన్ను చూడలేని లోకం నాకో
రుగ్మత నాపాదిస్తుంది
అయితేనేం గాక
అనుక్షణం నీకోసమే నేనో
సజీవ చైతన్యాన్నవుతాను
సజీవ చైతన్యాన్నవుతాను..

చిత్రంగా వ్రాసుకున్నదాన్ని పదే పదే చదువుకుని ఓ రకమైన ఓదార్పును పొందగలిగింది వసంత.
ఆత్మ సంతృప్తి --ఒక దిశానిర్దేశం ఆమె మనసుకు గోచరించాయి.
ఏళ్ళ తరువాత మొదటిసారి ఆకలి అనిపించిందామెకు
లేచి వెళ్ళి వంటింట్లో ఉన్నవాటితో ఉన్నంతలో వంట చేసుకుంది.
అన్నం, చారు, కంది పచ్చడి ... ఎన్ని రోజులకు
డైనింగ్ టేబుల్ దుమ్ముకొట్టుకుని వుంది. ముందు దాన్ని సర్ఫ్ నీళ్ళతో పైన కోలిన్‌తో శుభ్రంగా తుడిచి టేబుల్ మాట్స్ తెచ్చి వేసుకుంది.

అలవాటుగా రెండు ప్లేట్స్ తెచ్చి పెట్టి, నవ్వుకుని ఎదురుగా అతను వున్నట్టుగానే ఫీలయి ఎలా మర్చిపోతాను చూసారుగా యూ ఆర్ విత్ మీ

మొదటి ముద్ద ఖాళీ ప్లేట్‌లో వుంచి తినడం ప్రారంభించింది.

తింటున్నంత సేపూ కూడా నవల ప్లాన్ ఆలోచిస్తూనేవుంది

టీవీ నైన్ లో వార్తలు చూసి , అప్పుడు ప్రారంభించింది "రెండు లోకాలు" రచన.

నెల రోజులు తిరగలేదు.

ఓపక్క సప్త రాగిణిలో సీరియల్ మంచి వేగం పుంజుకుని ప్రతివారినీ ఆకర్షిస్తూనేవుంది.

మరో మాసపత్రికలో రెండు లోకాలకు మొదటి బహుమతి..!

ఒక్క క్షణం ఉక్కిరిబిక్కిరైంది వసంత.

ఎదురు చూడని విజయం. పదిరోజుల ముందుగానే ఉత్తరం వచ్చినా పత్రికా ముఖంగా వస్తే తప్ప ప్రభాకర్‌కి చెప్పదలుచుకోలేదు.

అయితే మిత్రురాళ్ళకు మాత్రం ఓ సాయంత్రం సరదాగా పిలిచి బ్లూ మూన్‌లో పార్టీ ఇచ్చింది.

నిజంగా వసంతలో మార్పుకు సంతోషించింది వాళ్ళే

ఎంత మామూలుగా కనిపిస్తున్నా ఆమె మొహంలో విషాదం వాళ్ళకు కనిపిస్తూనేవుండేది.

అలాంటిది ఇప్పుడు కాస్తా తేరుకున్నట్టు ఉత్సాహంగా వుండటం సంతోషకరమైన మార్పే.

నిజమే ఇదివరలో ప్రతి రోజూ నిద్రంతా అతని కలలతోనే గడచిపోయేది.

ఎంతో దిగులు పడుతున్నట్టూ, విపరీతమైన బాధలో వున్నట్టు కలల్లో కనిపించేవాడు శ్రీ

అలాంటిది ఇప్పుడు ఎంతో ఉత్సాహంగా ... ఎప్పటి చిరునవ్వుతో ...

అంటే నా సంతోషమే అతని సంతోషమా ? ఏదో పరిశోధించి కనుగొన్నట్టు ఫీలయింది వసంత.

అవును .

నేను సంతృప్తి గా వుండటమే అతనికి ఆనందం

నేను ఇదివరలోలా ఎప్పటిలావుండాలి ...

ఆలోచన వచ్చిందే తడవుగా అమలుకు తలపడింది.

మాసిపోయి పాతబడిపోయిన కర్టెన్లు మార్చుకుంది...

వాడి ఎండిపోయిన పూల మొక్కలు మార్చి కొత్త కుండీలు తెచ్చుకుంది..

చీరలు సైతం ఒక్కటీ బాగున్నట్టుతోచడం లేదు

ఎప్పుడూ లేనిది బీరువా తెరిచి పదినిమిషాలు వెతుక్కుంటే గాని ఏం కట్టుకు వెళ్ళాలో తెలియడం లేదు.

అందుకని సేవింగ్స్‌లో ఎంత డబ్బుందో ఒకసారి చూసుకు మరీ పెద్ద ఖరీదులో కాకుండా రెండు చీరలు ఓ మోస్తరు ధరల్లో కొత్త డిజైనర్‌వేర్ లో తెచ్చుకుంది.

నగలంటే ఎప్పుడు పెద్ద మోజులేదు.

ఇల్లు పరిసరాలు ముఖ్యంగా బెడ్ షీట్స్ లాటివన్నీ మార్చుకుంది.

పుస్తకానికంటే ముందు డబ్బు పంపించివేసాడు మాసపత్రిక ఎడిటర్.

ఈ విషయం ఇవ్వాళో రేపో ఎలాగూ ప్రభాకర్‌కి తెలుస్తుంది.

అంతవరకూ ఆగేకంటే ముందుగా తనే చెప్పెయ్యడం మంచిదనిపించింది.

అంతకుముందురోజే కొత్తచీరలన్నీ ఫాల్ కుట్టించుకుని తెచ్చుకుంది. దాంట్లో బాగా నప్పుతుందనిపించిన మెరూన్ ప్రింటెడ్ క్రేప్ కట్టుకుని పుల్లారెడ్డిలో స్వీట్స్ కొనుక్కుని మరీ వెళ్ళింది ఆఫీసుకు.

వసంతలో కొత్త నేవళం మనిషిలో మార్పు ప్రభాకర్ గమనించకపోలేదు. అయితే ఎలా అడగాలో అతనికి తెలీటం లేదు.

ఇదివరకులా వ్యక్తిగత విషయాలు మాట్లాడే అవకాశం ఇవ్వటం లేదామె. ఆఫీస్ పని ఎంతవరకో అంతవరకే..

ఇహ ఇంటికి ఎవరూ వచ్చే ప్రసక్తే లేదు.

చెప్పి రావడానికి ఉండటం లేదంటుంది.

చెప్పకుండా ఒకటీ రెండు సార్లు ప్రభాకరే కాదు, చైతన్య కూడా వచ్చినా ఇంటికి తాళం ఎదురయ్యేది.

కొద్ది రోజులక్రితమే ఇంటికి డోర్ లాక్ పెట్టించుకుంది వసంత... దొంగతనాలు ఎక్కువయ్యాయనీ ఇలాగయితే ఇంట్లోనే ఉన్నాననుకుంటారనీ చెప్పింది అందరికీ..

కాని ఇంట్లో వున్నాలేరనుకోగల వాస్తవం లాభం ఆమెకొక్కదానికే తెలుసు.

ప్రభాకర్ వస్తూనే అతని గదికి వెళ్ళి ముందుగా అతనికి స్వీట్స్ ఇచ్చాక ఆఫీస్ బోయ్‌తో అందరికీ పంపించింది.

"ఏమిటి విశేషం ఈరోజు నీపుట్టిన రోజు కూడా కాదు..."

"పుట్టిన రోజున మాత్రమే హేపీగావుండాలా? ఇవ్వాళనా జీవితంలో ఓ విశిష్టమైన రోజు....నా నవలకు జ్యోతి నవలలపోటీలో మొదటిబహుమతి వచ్చింది "

అంతవరకు తియ్యగా తోచిన కాజూ బర్ఫీ ఒక్కసారి వెగటనిపించింది ప్రభాకర్‌కు.

## 10

**ఉదయమే మెలుకువవచ్చింది.**

మెలుకువ వస్తూనే కల కరిగిపోయింది.

కాని కలమాత్రం స్పష్టంగా గుర్తుంది.

శ్రీ రాత్రంతా తనతోనేవున్నట్టూ, ఇంకా అనుభూతినించి బయటకు రావడం ఇష్టం లేనట్టుగా చాలా సేపు మెలుకువగా వున్నా అలాగే పడుకుని వుండిపోయింది.

ఒకప్పుడు అలాగే పిల్లలిద్దరూ వెళ్ళిపోయాక అలవాటుకొద్దీ ఉదయమే లేస్తే శ్రీ వారించేవాడు.

"అబ్బ, కొంపలుమునిగినట్టు ఇప్పుడే లేచి ఏం చెయ్యాలని కాస్సేపు పడుకోరాదూ" ఓ సారి నవ్వుకుని మళ్ళీ అతని ఎడం చేతిమీద తలవాల్చి గుండెల్లో ఒదిగి నిద్రలోకి జారిపోయేది. ఇప్పుడూ మెలుకువ రాగానే గుర్తున్నది అదే , అతని గుండెల్లో గువ్వలా ఒదిగి పడుకున్న అనుభూతి.

ఎప్పటికో పనిమనిషి వచ్చి బెల్ కొట్టాక అయిష్టంగానే లేచి తలుపు తీసింది.

కాస్త మబ్బు మబ్బుగావుండటంతో ఇంకా ఎండపొడ రాలేదు. ఆహ్లాదంగా అనిపించి బయటకు అడుగు పెట్టింది. ద్వారానికి ఎండి వాడిన మామిడి కొమ్మలు ఎప్పటివో... ముందు వాటిని తొలగించాక కనిపించాయి సాలెగూళ్ళూ బూజులూ ..

పనిమనిషిని కేకేసి వాటిని చూపించి తాపీగా మెట్లకు రెండువైపులావున్న కుండీలను చూసింది. పోషణ లేక బక్కచిక్కిన పిల్లల్లా అనిపించాయి వాటిల్లోని క్రోటన్స్.

ఇంటి చుట్టూ పూల మొక్కలే ... ఏళ్ళుగా వాటి సంరక్షణ ఎంతగా చూసుకునేదంటే నడివేసవిలోనూ పచ్చదనంతో ఇల్లు ఎంత ప్రశాంతంగా అగుపించేదనీ ..అలాంటిది ఇప్పుడు మొక్కలన్నీ బిక్కమొహాలతో మాకిదేం శిక్ష అని అడుగుతున్నట్టుగా తోచింది.

వెంటనే ఇంట్లోకివెళ్ళి మొక్కల్నలా ఎండబెడుతున్నందుకు పనిమనిషిని సంజాయిషీ అడిగింది.

"రోజూ నీళ్ళు వేస్తూనేవున్నాను ..నిన్ననే ..." నాన్చుతూ అది చెప్పిన పద్ధతిలోనే తెలుస్తోంది అబద్ధం చెపుతోందని. కావలసిన చిన్న గడ్డ పార తవ్వేందుకు పనికివచ్చే ఊచ పుచ్చుకుని బయటకు వెళ్ళిన వసంత ఒక్కో కుండీ మట్టీ లూజ్ చేసి ఎరువేసి ఎండిన ఆకులూ కొమ్మలూ తొలగించి సరిచూసుకునేసరికి మధ్యాహ్నం పన్నెండయింది.

అప్పుడు బ్రష్ చేసుకుని వేడి వేడి టీ తాగాక గాని అలసట తీరినట్టనిపించలేదు.

ఒక్కో మొక్క నన్ను ఎంతగా తిట్టుకుని వుంటాయో, ఇలా వాటిని సజీవంగా చిత్ర హింసలు పెట్టే అధికారం తనకెక్కడిది అనుకోగానే వసంతకు తనమీద తనకే వెర్రికోపం వచ్చేసింది.

ఎంతసేపూ ప్రపంచాన్ని నా దుఃఖంలో ముంచెయ్యాలని చూశాను కాని... ఒక్కసారైనా...

టీ తాగుతూ పుస్తకాలు తిరగేసింది.

అయినా మనసు మాత్రం మాటిమాటికీ ఆమెను నిందిస్తూనేవుంది... మరీ ఇంతగా...

ఇంత క్రమ శిక్షణలేకుండా ఇలా ప్రవర్తించినది నేనేనా? అస్తవ్యస్తంగా ఆలోచనలూ ఓదారిలో పెట్టుకోలేక కనిపించిన ప్రతి వ్యక్తినించీ స్నేహం ఆశించి, భంగపడి....

ఇంతగా దిగజారిపోయానా...

ఓపక్కన కాస్తంత కనువిప్పుగానూ అనిపిస్తోది ఇప్పటికయినా పరిసరాలగురించి ఆలోచించగలుగుతున్నందుకు.

తన జీవితం తను ముగించుకుని వచ్చిన పని కాగానే వెళ్ళిపోయాడు శ్రీ...తనో ...ఇలా కర్తవ్యాన్ని విస్మరించి...

వంట చేసుకోవాలన్న ధ్యాస కూడా లేకుండా ఆలోచించి ఆలోచించి మళ్ళీ వెళ్ళి నిద్రలోకి జారిపోయింది. మూడున్నరకు మెలుకువ వచ్చాక కాని ఆమెకు అర్థం కాలేదు ఆరోజు శుక్రవారమనీ ఆఫీస్ ధ్యాసే లేకపోయిందనీ ..చిత్రంగా ఎవరూ ఫోన్ కూడా చెయ్యలేదు.

లేస్తూనే వెంటనే ఆఫీస్‌కి ఫోన్ చేసింది.

ప్రభాకర్ ఉన్నాడంటే అతనితోనే మట్లాడింది... ఒంట్లో బాగాలేక రాలేకపోయాననీ, ఫోన్ చేసే ధ్యాస కూడా లేకపోయిందనీ చెప్పింది.

"డాక్టర్ దగ్గరకు వెళ్ళావా? అశ్రద్ద చెయ్యకు వెళ్ళిరా ... తొందరగా తగ్గితే ఆఫీస్‌కి తొందరగా రాగలవని నా ఆశ అంతే, టేక్ కేర్" అంటూ ఫోన్ పెట్టేసాడు.

అయితే అరగంటలోపే ఆఫీస్ కుర్రాడితో ఒక బొకే, ఓ డజను యాపిల్స్ పంపించాడు.

దాంతో పాటు ఒక కార్డ్ కూడా "రికవర్ సూన్.. ఐయాం యువర్ వెల్ విషర్ ఆల్‌వేస్" అని రాసి మరీ.

వసంత మనసు మెత్తబడింది. ఇన్నాళ్ళూ ఏదేదో అనుకుంది కాని నిజానికి అతని గురించి చెడుగా అనుకునేంత ఏంవుందని?

అసలు నాకు చిన్నప్పుడు ఇలాంటి ఉద్దేశ్యం వుండేదని చెప్పకపోతే తెలిసేదే కాదు. ఇహ శ్రీ గురించి కామెంట్ ఈర్ష్య కావచ్చు... తనకు లభ్యం కాకున్నా అతను ఆకట్టుకోగలిగినందుకు అసూయ కావచ్చు...

వెంటనే అతని సెల్ కి ఫోన్ చేసింది. "ఫోన్ ఎత్తుతూనే ఈ రోజు నా అదృష్టం బాగుంది నీ అంతట నువ్వు ఫోన్ చెయ్యడం చెప్పు..."

" ప్రభాకర్ , థాంక్యూ థాంక్యూ వెరీమచ్ ... "

" థాంక్స్ ఎందుకు వసంతా , మనం మంచి మిత్రులం ... ఇప్పుడిక మిగిలింది మనమధ్య ఓ మంచిమాట, సానుభూతి అప్పుడో ఇప్పుడో అవసర పడ్డప్పుడు ఓ పరామర్శ అంతేగా..."

మరోసారి థాంక్స్ చెప్పి ఫోన్ పెట్టేసినా ఆమె మనసు ఆలోచిస్తూనే వుంది..

ఎన్నడూ లేనిది ఇలా ప్రతి మనిషినీ తప్పుపట్టడం ఎప్పుడు నేర్చుకున్నాను? ఎవరో ఏదో అన్నారని బాధ పడే కంటె ఇదివరలో శ్రీ ఉన్నప్పుడు నాలో ఉండే హుందాతనం ఏమైంది? ఇంతేనా మానవ సంస్కారం? ఏదో కష్టం రాగానే దిగజారిపోయి స్థాయి మరచిపోయి ఆలోచించటమా?

"ఎవరినైనా విమర్శించేముందు మనను మనం విశ్లేషించుకోవాలి వసూ...ఏ పరిస్థితులు వాళ్ళనా స్థాయికి తెచ్చాయో అర్థం చేసుకుంటే ఎవరి ప్రవర్తనా ఇబ్బంది పెట్టదు. మనకు నచ్చకపోతే నచ్చలేదని చెప్పాల్సిన అవసరం ఏముంది ..దూరంగా వుంటే పోలా?" ఎంత బాగా చెప్పేవాడు శ్రీ

చిత్రంగా ఇప్పుడు శ్రీని తలుచుకుంటే కోపం రావడంలేదు, దుఃఖమూ రావడం లేదు.

నా ఏకాంతపు శిక్షకు అతన్నెందుకు కారణం చెయ్యాలి ?

ఇది నా జీవితం. దీంట్లో ఎవరికైనా ఏదైనా చెయ్యగలిగితే చెయ్యాలి లేదూ తలవంచుకు నా బ్రతుకు నేను బ్రతకాలి అంతే !

లేచి గీజర్ ఆన్ చేసి మళ్ళీ టీ చేసుకుంది వసంత. టీ తాగుతూ ఏం చెయ్యాలని ఆలోచించింది.

సాయంత్రం బయట తిరిగి వస్తే బాగుంటుందనిపించింది.

కొన్ని కుండీలలో మొక్కలు చచ్చిపోయి ఖాళీగావున్నాయి.

ఏవైనా మంచి పుస్తకాలో రెండు కొనుక్కోవాలి....

వేడి వేడి నీళ్ళతో తలస్నానం చేసాక మనసూ శరీరమూ తేలిక పడ్డట్టనిపించాయి.

కాస్త హుషారు వచ్చింది..

లేచి షాపింగ్ కి బయలుదేరింది.

✡ ✡ ✡

పూలమొక్కలు చూస్తుంటే కనిపించాడు చైతన్య.

"బహుకాలదర్శనం.. ఎలాగున్నారు?" నవ్వుతూ పలకరించాడు.

అతనితో మాట్లాడి చాలా కాలమైంది. కొన్నాళ్ళు ఇష్టం లేక తప్పించుకుంటే రాసుకునే బిజీలో కొన్ని సార్లు...

"ఫైన్, మీరెలా ఉన్నారు?" నవ్వుతూనే బదులిచ్చి తిరిగి ప్రశ్నించింది.

"ఇదో ఇలాగా.... చూస్తున్నారుగా? కాస్త ఒళ్ళు చేసి... "

అతని సెన్సాఫ్‌హ్యూమర్ కి నవ్వుకుంది..

"ఇంట్లో ఈ మధ్య ఆలనా పాలనా లేక మొక్కలు కొన్ని చచ్చి పోయాయి అవి రీప్లేస్ చెయ్యాలి... "

అవును మీ ఈస్థెటిక్‌సెన్స్ మాకందరకూ పరిచయమేగా..ఏదేమైనా మళ్ళీ మీరిలా మనుషుల్లో పడటం మాకు చాలా హాపీగావుంది"

ఇద్దరూ కలిసి కొన్ని మొక్కలు సెలెక్ట్ చేసి బేరం కుదిరాక మొక్కలు చాలా వుండటంతో నర్సరీ వ్యక్తే వాటిని ఇంటికి పంపుతానన్నాడు. చైతన్య ఏదో మాట్లాడుతూనే వున్నాడు. అయితే ఇది వరకులా విసుగనిపించడంలేదు వసంతకు.

అతన్ని అర్ధం చేసుకుందుకు ప్రయత్నిస్తోంది.

ఇద్దరూ కలిసి పుస్తకాల షాప్‌లో పుస్తకాలన్నీ తిరగవేసి రెండు గంటలు గడిపి ఓ పది పుస్తకాలు సెలెక్ట్ చేస్తే వసంత ఓ ఐదు అతనో ఐదు కొన్నారు.

"చాలా అలసిపోయాం కదూ! కాస్త ఏదైనా తింటే తప్ప మరింక బండి ముందుకు కదలదు..."

వసంతక్కూడా అలాగేవుంది. అందులో పొద్దుట్నించీ టీ తప్ప మరేమీ తాగలేదేమో....

"పదండి"

చైతన్య ఆమె వంక ఆశ్చర్యంగా చూశాడు.

"ఏంటి అలా చూస్తారు ? నాక్కూడా చాలా ఆకలిగావుంది"

"అవునా? మీరు అమృతం త్రాగిన దేవతలేమో ఆకలి వెయ్యదేమో అనుకున్నాను"

"మీకు తెలుసో లేదో దేవతలకూ ఆకలి వేసినప్పుడల్లా అమృతమే తాగివుంటారు"

ఇద్దరూ నవ్వుకుంటూ కారువైపు కదిలారు. హోటల్ బ్లూమూన్ ముందు కారు దిగాక ఒక్క క్షణం ఇంటికే వెళదామా అనిపించింది వసంతకు.

మళ్ళీ అంతలోనే తనలోని బాల్య భావనని ఓ కసురు కసురుకుని అతని వెనకాల లోపలకు నడిచింది.

ముందుగా స్వీట్ కార్న్ సూప్‌కు ఆర్డరిచ్చి ,

"చెప్పండి వసంతా ఎలాగున్నారు?" చైతన్య అడిగాడు

"ఇది మరీ బాగుంది నాలుగ్గంటలనుండీ నాతోనే వుండి ఇప్పుడిలా అడగటం ?"

"నవ్వుతూ కొట్టి పారెయ్యకండి... నేనడిగినదేమిటో మీకూ తెలుసు.."

కాస్సేపు మౌనంగా ఉన్నాక

"చైతన్య గారూ ... మరచిపోలేని అనుభూతులు మనసులో కలకాలం మిగిలేవుంటాయి... ఒక స్థాయి తరువాత గతమూ జీవితంలో ఓ భాగమే అవుతుంది.

అయితే గతాన్ని తలుచుకుని బాధ పడటమో దుఃఖపడటమో చేసేకంటే భూత భవిష్యత్తుల మధ్య ప్రయాణిస్తూ వర్తమానాన్ని జీవించటమే ఉత్తమంలా తోస్తూంది."

"అలా అని తప్పించుకోకండి.. ఎంత ఉట్టుట్టి మాటలు పైకి ఎన్ని చెప్పినా ఒంటరితనపు బాధ పోగొట్టుకోగలరా?మనం జీవించివుండటం ఎంత నిజమో ఒంటరితనాన్ని శపించుకుంటూ ప్రతిక్షణమూ అంతే నిజం "

ఈలోగా సూప్ వచ్చింది. దాంతో పాటు స్ప్రింగ్ కూడా..

"ఒక్కమాట చెప్పనా... శ్రీ లేదని ఊపిరి పీల్చడం మానేశారా? నీళ్ళు తాగడం మానేశారా? నిద్ర మానేశారా? ఏదీ మానేశారు చెప్పండి?

అల్లాగే జీవితంలో ప్రతి క్రియా...

అతను లేడని ప్రపంచం ఆగిపోదుగా...అవకాశం ఉన్నప్పుడే వినియోగించుకోవాలి.. ఒంటరితనం వేదన ఏమిటనేది మనిద్దరకూ తెలిసినంతగా మరెవ్వరికీ తెలియదేమో.. మీరిప్పుడు అందివచ్చిన అదృష్టాన్ని కాలదన్ని తరువాతేప్పుడో తప్పకుండా బాధ పడతారు ... కావాలంటే రాసి పెట్టుకోండి"

"ఏం రాసి పెట్టుకోమంటారు? అయినా మీరన్నంత వేదనలో లేను నేను ... అలాగని శ్రీ లేని లోటు ఒకరు తీర్చేది కాదు.. - లోటు లోటే. కళ్ళు లేని వాళ్ళు కాళ్ళు లేని వాళ్ళు అమ్మా నాన్నలు లేని వాళ్ళు తల్లిదండ్రులు లేనివాళ్ళు ఎన్నో లేనివాళ్ళు ఎందరో వున్నారు. వాళ్ళతో పోల్చుకుంటే నా జీవితం తొంభై తొమ్మిది శాతం ఉత్తమంగా వుందనే అనాలి.

శ్రీ లేడు ఈ ఒక్క లోటూ తప్ప మరి దేనిగురించి నేను చింతపడాలి? సంపాదించుకునే చదువు సంధ్యలున్నాయి, ఉండటానికో ఇల్లు ఓ వృత్తివ్యాపకం ఉన్నాయి. చక్కగా జీవితంలో స్థిరపడ్డ పిల్లలున్నారు. ఇహ దేని గురించి నేను చింతపడాలి?"

"ఇలా ఎవర్ని వారు మభ్య పెట్టుకోవడం, సులభమే... ఇవన్నీ అందరికీ ఉన్నాయి. నాకు తెలుసు ఇవన్నీ శుష్కవచనాలే ... రాత్రంతా నిద్ర రాక తోడు లేక ఒంటరిగా ఉండటం అనేది శాపం కాక మరేమిటి?"

"మీ రెందుకిలా అంటున్నారో నాకు అర్థం కావడం లేదు.జనన మరణాలు సహజమైనప్పుడు అది వరమో శాపంగానో ఎందుకనుకోవాలి.."

"అనుకోక ఏం చెయ్య మంటారు వసంతా...నన్ను చూడు నా జీవితం చూడు వసుమతి వెళ్ళి పోవడం.. పిల్లలు చెయ్యి దాటిపోయి ఇష్టం వచ్చినట్టు బ్రతకడం.. నా జీవితానికే అర్థం లేకుండా పోయింది"

"మీరు మంచి పేరున్న డాక్టర్ ... చాలా సమయం ఆసుపత్రిలోనే గడిపేస్తారు...మంచి పుస్తకాలు చదవండి... మంచి హాబీలు అలవరచుకోండి ...."

"ఏం చేసినా ... ఒక్కడినేగా? మీకు అలా అనిపించదా?"

"ఎందుకు అనిపించదు? కాని నా మనసు అక్కడ ఆగిపోదు... నాదంటూ నాకో జీవితం వుంది... నా ప్రతిక్షణాన్నీ సద్వినియోగపరచుకోవాలన్నదే నా ప్రయత్నం"

ఈలోగా డిన్నర్ సర్వ్ చెయ్యడంతో డిస్కషన్ ఆపి ఆవురావురుమంటూ భోజనం ముగించారు..

" కాస్సేపు టాంక్ బండ్ మీద కూర్చుని వెళదాం "

అవునని కాని కాదని కాని అనలేదు వసంత.

ఎక్కడినించో ఒలకబోసినట్టున్న వెలుగులు.. చల్లటిగాలి చాలా సేపు నిశ్శబ్దంగా కూర్చున్నాక చైతన్య అన్నాడు

"మీరు ఏమనుకోనంటే ఒక్క మాట అడగనా? "

"అడగండి మనం మిత్రులం ఏదున్నా ఓపెన్ గా మాట్లాడుకుందాం " చాలా మామూలుగా జవాబిచ్చింది వసంత.

"మీరూ ఒక్కరే వుంటున్నారు నేనూ ఒక్కడినే. కారణం ఏమైనా గానీ మనం మన పిల్లలతో రాజీ పడలేం..

మనిద్దరం పెళ్ళి చేసుకుంటే తప్పేమిటి? ఈ వయసులో ఒకరికొకరంగా..."

చాలాసేపు సమాధానం చెప్పలేదు వసంత.

చైతన్య మళ్ళీ మళ్ళీ అడిగాడు

"ఇలా అడిగి మీ మనసు గాయ పెట్టానా? ఇబ్బంది పెట్టానా? అది నా అభిమతం కాదు...ఏదో ఒక దిశా గమ్యం లేకుండా మాట్లాడే కంటే మనసులో మాట చెపితే బాగుంటుందని... మిమ్మల్ని గాయ పరిస్తే క్షమించండి"

చెయ్యి పైకెత్తి ఆపమన్నట్లు సైగ చేసింది వసంత.

"ఒక్క క్షణం ...నాకు మాట్లాడేందుకు వ్యవధినివ్వండి ప్లీజ్ "

ఒక ఐదు నిమిషాల మౌనం తరువాత అతని చేతిని తన చేతుల్లోకి తీసుకుని,

"చైతన్య గారూ ... మీరు నిజంగా నాకు ఆపులు ...గొప్ప కష్టంలో ఉన్న సమయాన మంచి ఓదార్పునందించారు... ఇంతకీ మీరూ అదే కష్టంతో బాధ పడుతూ కూడా ...

మీరు ఆలోచించిన విషయం మీకు సబబుగానే అనిపించవచ్చు.. చాలా మందికి సబబుగానే వుంటుంది కూడా...

అంతెందుకు రెండేళ్ళక్రితం, మా చుట్టాల అమ్మాయే ఇద్దరు పిల్లలు ఇంకా చదువుకునే స్టేజ్ లోనే వున్నారు ఆయన హఠాత్తుగా పోయారు. ఏదో నానా తంటాలు పడుతూ పిల్లల్ని పెంచుకొస్తోంది. ఈ లోగా పెద్ద తోడికోడలు బ్లడ్‌కాన్సర్‌తో పది రోజుల వ్యవధిలో పోయారు. చాలా రోజులు ఆడదిక్కులేని బావగారి కుటుంబాన్నీ ఈవిడే చూసేది. ఇద్దరిలో ఎలాంటి ఉద్దేశాలూ లేకుండానే ప్రతి ఒక్కరూ వాళ్ళిద్దరి పెళ్ళి జరిగినట్టుగా మాట్లాడటంతో చివరికి ఇద్దరూ పెళ్ళి చేసుకున్నారు. నా సలహా అడిగినప్పుడు చేసుకోమనే చెప్పాను.

ఇప్పుడు అంటారేమో సలహాలు చెప్పటమే కాని పాటించేందుకు కాదా అని. కాని మీరు అర్థం చేసుకుంటారు. నాకు మళ్ళీ పెళ్ళి చేసుకునే ఉద్దేశ్యం లేదు. నా జీవితం శ్రీ అనే అభిప్రాయంతోటే బ్రతికాను..నా పిల్లల కోసం నా అనుకున్న ప్రతిదీ వదిలేసుకున్నాను.

అలాగని ఇప్పుడేదో నేను త్యాగం చేసాననో పిల్లలకు కృతజ్ఞత లేదనో నిందించను. నేను నా పిల్లలకోసం ఏమేం చేశానో వాళ్ళూ వాళ్ళ పిల్లలకు చెయ్యాలిగా. అమ్మగా ఓ పాతిక సంవత్సరాలు ప్రతి నిమిషం ప్రతి క్షణం ప్రతి రక్తపు బొట్టూ వాళ్ళకోసమే ధారపోసిన నాకు ఇప్పుడు నేను నాది అనే స్వార్థం ఎలా వస్తుంది.?

నేనూ కొన్ని రోజులు ఆలోచించాను నా జీవితంలోకి నాకంటూ ఒక తోడు కావాలని

కాని అదంత సులభం కాదు. మళ్ళీ జీవితం తొలినించీ ఆరంభించేంత ఓపిక లేదు నాకు... మళ్ళీ నన్ను నేను త్యాగం చేసుకునే సత్తా లేదు. అలాగని త్యాగం చెయ్యమని ఎవరన్నారని అడుగుతారేమో. ఒక చోట ఉన్నాక ఒక ఇల్లన్నాక ఒకరు తగ్గడం తప్పనిసరి. అయినా నా జీవితంలో బెస్ట్‌పార్ట్ అనుకోగల భాగాన్ని శ్రీ కీ పిల్లలకూ ధారపోసాను..ఇక ఎవరికైనా ఇవ్వడానికి ఏం మిగిలింది? రాజీ జీవితానికి నేను సిద్ధంగాలేను. ఏమో రేప్పొద్దున నా పిల్లలకే నా ఉనికో మీ ఉనికో నచ్చకపోవచ్చు. ఇక మహా బ్రతికితే ఓ పది పదిహేనేళ్ళు! గడచిన జీవితంతో పోల్చుకుంటే ము ప్పై ఏళ్ళపాటు పిల్లలకోసం త్యాగం చేసినా నాకు ఇప్పుడు కూడా పిల్లలే ముఖ్యం మరో కొత్త జీవితం కాదు

మీకంత ఒంటరితనం భరించలేనిదనిపిస్తే ఓకే చూద్దాం.. మంచి అమ్మాయి ఎక్కడో అక్కడా దొరక్కపోదు.

మన స్నేహం మాత్రం ఎవరేమనుకున్నా అలాగేవుంటుంది.. మీకు తోచినప్పుడల్లా ఇంటికి రండి. ఇదివరకులా సరదాగా క్యారమ్స్ ఆడుకుందాం, చెస్ ఆడుకుందాం.. సినిమాలు చూద్దాం. ఇలా సరదాగా డిన్నర్‌లు చేద్దాం .

అంతే గాని మరోరకపుటాలోచనలు వద్దు. మీ మనసు నొప్పిస్తే సారీ"

చెప్పదలుచుకున్నది చాలా సూటిగా చెప్పేసింది వసంత.

చాలా సేపు మాటా మంతీ లేకుండా అలాగే కూర్చుండి పోయాడు చైతన్య.

వసంత అతన్ని డిస్టర్బ్ చెయ్యలేదు.

జనం పలచబడి ఎవరిదారిన వారు పోతున్నారు..

చాలా సేపటికి ఓ రకమైన మైకం లోంచి బయట పడ్డట్టుగా లేచి

"చాలా రాత్రయింది కదూ ... పదండి వెళదాం " అన్నాడు.

దారిపొడుగునా ఇద్దరూ ఒక్కమాటా మాట్లాడుకోలేదు.

ఇంటిముందు దింపాక "లోపలకు వస్తారా" అడిగింది వసంత

"చక్కటి కాఫీ ఇస్తానంటే ..."

తలుపు తీసి లోపలకు నడిచింది.

పుస్తకాల బ్యాగ్‌తో లోపలకు వచ్చాడు చైతన్య.

కాఫీ తాగుతూ " థాంక్యూ వసంతా... దేనికో చెప్పనా ... నువ్వు ఆఫర్ చేసిన నీ మిత్రత్వానికి.. నీ సలహాకు...

చెప్పావుగా నాకు తోచినప్పుడల్లా వస్తూనేవుంటాను.. కంగారు పడకు, మరోసారి నీకు నచ్చని విషయాల ప్రసక్తి నీ దగ్గర రాదు"

కిల కిలా నవ్వింది వసంత .

"అదిగో నవ్వు తోటే మాశ్రీని కట్టి పడేసుకున్నావు.."

"ఇప్పటికీ నామనసులో" పైకి అనలేదు వసంత

"ఓకె. దెన్ బై సీ యూ "

చెయ్యి చాపాడు

నిస్సంకోచంగా చెయ్యందించింది వసంత.

"బై" బయటకు కదిలాడు.

"మీ పుస్తకాలు.... ?"

"ఉండనీ ఆదివారం వచ్చి చదువుకుంటానిక్కడే"

అతను వెళ్ళిపోయాడు.

తలుపు వేసి వచ్చి సోఫాలో కూర్చుని అలాగే వుండిపోయింది వసంత.

✡ ✡ ✡

## 11

**మనసు ప్రశాంతంగావుంది.**

చాలా రోజుల తరువాత ఏదో ఇది అని చెప్పలేని హాయి పొంగిపొర్లింది.

వెంటనే కొడుకు నంబర్ డయల్ చేసింది.

మూడు రింగ్స్ వచ్చినా ఎత్తకపోయేసరికి

"బిజీగా వున్నాడేమో ... ఎక్కడ షూటింగ్ లో వున్నాడో ఏమిటో " అనుకునే లోగానే తనే ఫోన్ చేసాడు.

"మమ్మీ"

"చెప్పు సుమంత్ బిజీగావున్నావా? ఏదైనా షూటింగ్ లో వుంటే తరువాత మాట్లాడుకుందాం"

"ఏషూటింగ్ అయినా ఏదైనా అంతా నీ తరువాతే మమ్మీ. ఎలాగున్నారు ? ఇంతరాత్రి ఫోన్ చేసావంటే భయం వేసింది"

"పిచ్చినాన్నా ! చిన్నప్పుడూ ఇలాగే అనే వాడివి ... బుంగ మూతి పెట్టి నన్నొక్కడినీ వదిలేస్తావు ఎంత భయం వేసిందోనని"

"అవును, మీకింకా గుర్తుందా?"

"ఎప్పటికయినా మర్చిపోగలనా? మీ జీవితంలో ప్రతి చిన్న మాటా నాకో మధురమైన జ్ఞాపకమేగా "

"ఈ పొగడ్తలు ఎప్పుడు నేర్చుకున్నారు?"

"నేర్చుకోవడమా? ఇదివరలో మనసులో వుండేది ఇప్పుడు మాటల్లో పెడుతున్నానంతే "

"మమ్మీ నిజం నేనూ చెప్పనా, మీరిలా ఎప్పటిలా మాట్లాడూతుంటే మనసుకు ఎంతో హాయిగావుంది, నా మీదకోపం పోయిందా?"

"కోపమా అదేమిటి ...అయితే గియితే అలాంటిదేమయినావుంటే నన్ను నానమ్మను చెయ్యలేదే ఇంకా అని కోపగించుకోవాలి. ఇంతకీ అమ్మాయి ఎలాగుంది?"

"అమ్మాయా? అదెవరు?"

"ఇది మరీ బాగుంది..నేనడిగినది ఏమిటో నీకు తెలీదని నేను అనుకోను. రోషిణి గురించి అడిగాను... "

"తనకేం నిక్షేపంలావుంది..."

"కనీసం ఓ రెండు రోజులు వీలు చేసుకుని రారాదూ..."

"మమ్మీ నువ్వలా అంటుంటే ఇప్పుడే వచ్చేద్దామనిపిస్తోంది.. తప్పకుండా ఈ నెలలోపే రాడానికి ప్రయత్నిస్తాం"అతని స్వరంలో ఓ రకమైన ఆర్ధ్రత.

"ఓకే . మరి వుండనా ...?"

"ఓకే మాం, నాకు వీలున్నప్పుడల్లా ఫోన్ చెస్తూంటాను"

ఫోన్ స్విచ్ఛాఫ్ చేసి తృప్తిగా నిట్టూర్చింది.

*మనసుల మధ్య అగాధాలు ఏర్పరచుకోడం కాదు, వాటిని ఎలా అంతరింపజెయ్యాలో ఆలోచించాలి.* ఓ నిమిషం తరువాత సుమకు రింగ్ చేసింది.

"పెట్టెయ్యి అమ్మా నేను కాల్ చేస్తాను"

మరు నిమిషంలో తనే కాల్ చేసింది .

"చెప్పమ్మా , ఏం సంగతులు? "

"సంగతులకేం వుంటాయి, అన్నీ మామూలే నా ఉద్యోగం వ్రాసుకోవడం, అన్నట్టు ఈ మధ్యే నా నవల సినిమా కోసమని అడిగారు..ఇవి సరే కాని మీ పిల్ల ఎలాగుంది...?"

అడిగిందే చాలన్నట్టుగా గంటన్నర సేపు పిల్ల విశేషాలను ఏకరువు పెట్టింది.

ఇప్పటినించే దానికున్న ఇష్టాఇష్టాలని, వ్యక్తిత్వాన్ని అల్లరి పనులనీ ...

అవన్నీ అయ్యాక 'టేక్ కేర్' అంటూ ముగించింది.

✡ ✡ ✡

"చెప్పు వసంతా"

ప్రభాకర్ తో మాట్లాడాలని వచ్చింది. అతని గదిలో ఒక్కడే ఉన్నాడు.

"ప్రభాకర్, నేను ఎంతో --అంతా ఇంతా అని చెప్పలేనంత మానసికమైన ఒత్తిడిలో ఉన్నప్పుడు ఒక మిత్రుడిగా నువ్వు చేసిన మేలు మరచిపోలేను...

ఓనమాలు రాని నాకు ఉద్యోగం ఇవ్వడం ఒక ఎత్తు, ప్రతి నిమిషం నా బాగోగులను పరామర్శించి, మానసికంగా నాకు బలాన్నివ్వడం మరో ఎత్తు. మీ అందరి సహకారం వల్లే నేనీ రోజున మానసిక సంఘర్షణ నించి, నిరాశా నిస్పృహలనించి బయట పడగలిగాను... మీ అందరికీ ఎంత ఋణపడివున్నానో ..."

"ఏంటి వసంతా ఏవో అప్పగింతలు పెడుతున్నట్టుగా..."

"లేదు ప్రభాకర్, నా వ్రాసుకోవడం... రచనావ్యాసంగంతో నా వృత్తికి న్యాయం చేకూర్చలేనేమో ననిపిస్తోంది..నీకు తెలుసు ఒక ఆలోచన మనసులో వచ్చిందంటే అది కాగితం మీదకు చేరే వరకు పిచ్చి పట్టినట్టు మాటిమాటికీ అవే ఆలోచనలు రొద పెడుతుంటాయి.

ఇక్కడ ఉద్యోగం యాంత్రికంగా నిర్వహించేది కాదు.. సృజనాత్మకత లోపించగానే పత్రిక పేలవమైపోతుంది. సజీవత నశించిపోతుంది.

అదీగాక ఒకసారి సుమ దగ్గరకు వెళ్ళి రావాలనుకుంటున్నాను. ముందుగా చెపితే నువ్వు ఏదైనా ఆల్టర్నేటివ్ ఆలోచిస్తావని..."

"అంతేనా ,... మరెవరైనా గొప్ప ఆఫరిచ్చారా?"

"ఛ. అలాంటిదేమైనా వుంటే ముందుగా నీకే చెప్పేదాన్ని ..."

"నాకు తెలుసు వసంతా, ఈ మధ్యన మన పత్రిక సర్క్యులేషన్ పెరిగింది. దాంతో పాటు పనీ డబుల్ అయ్యిందని. నేనే అనుకుంటూ ఉన్నాను మరొకరిని నీకు అసిస్ట్ చెయ్యడానికి వేసుకుందామని.. ఒక పని చెయ్యి, ఇద్దరిని అసిస్టెంట్స్‌గా వేసుకుందాం. వాళ్ళ ట్రైనింగ్ అయ్యాక డైలీ వర్క్ వాళ్ళకిచ్చి కనీసం వారానికి ఒకటీ రెండు రోజులు ఆఫీస్‌కి రా .. ఫైనల్ టచెస్ మాత్రం చూసుకో ...

ఈ రోజుల్లో ప్రపంచంలో ఏమూల ఉన్నా క్షణాల్లో రీచవగలం.

నీ కోసం లాప్ టాప్ కొందాం. ఎక్కడవున్నా యూ కెన్ వర్క్ ఫ్రం దేర్"

కాదనడానికి కారణం దొరకలేదు వసంతకు. నిజమే... ఎక్కడినించయినా పని చెయ్య గలిగినప్పుడు ఎందుకు కాదనాలి?

ఇంతగా సాయపడుతున్న ప్రభాకర్ గురించా తప్పుగా ఆలోచించుకున్నాను, అసలు ఉన్న మాట స్పష్టంగా చెప్పాడనా నా అహంకారంతో అతన్ని తక్కువ అంచనా వేసుకున్నాను?

నిజానికి మనసులో ఒకటి పైకి మరొకటీ మాట్లాడితే ఏం చెయ్యగలిగేదాన్ని?

నేనేమైన అపురూపమైన వ్యక్తినా, నాకోసం ప్రతివాళ్ళూ ప్రపంచన్ని ఎదిరించాలని ఆశ పడటానికి?

"ఏమంటావు వసంతా..."

"నువ్వింత అవకాశం ఇచ్చాక కాదని ఎలా అనగలను? అయినా నాలో అంత యోగ్యత వుందా అని ఆలోచిస్తున్నా"

"నీ యోగ్యత ఇదివరకే నిరూపించుకున్నావు, ఇప్పుడు పేరు ప్రఖ్యాతులు సంపాదించుకున్నాక నీ పేరు ఎడిటర్ గా వుండటమే మాకు కొండంత అండ"

అలా ఉద్యోగసమయాల్లో వెసులు బాటు దొరకడంతో చాలా సమయమే లభ్యమైంది వసంతకు.

అసిస్టెంట్లుగా కొత్తతరానికి పెద్దపీటవేస్తూ కొత్తగా జర్నలిజం పూర్తి చేసి కాస్త సృజనాత్మకత ఉన్న అమ్మాయిలను ఎంచుకుంది.

వాళ్ళ భావాలు ఆలోచనలు ఎంతగా ఆశ్చర్యపరచేవో.

ఈ తరాన్నా తప్పుగా అంచనా వేసుకుంటూన్నాం. కలల ముసుగులను పక్కకు నెట్టి ఇంత వాస్తవికంగా ఆలోచించే ఈ తరానికి ఎవరి చేయూత కావాలి? తప్పకుండా కొత్తబాట వేసేది వీళ్ళే అనిపించేది.

✡✡✡

చాలా రోజుల తరువాత విపుల్ నించి వచ్చిన సుధీర్ఘమయిన మెయిల్ ఆశ్చర్య పరచింది.

*మై డియర్ వసంతా*

నీపైన నా గౌరవం వెయ్యింతలుగా పెరిగింది.

నిజానికి మన పరిచయ ఆరంభమయినప్పుడు నా భార్య పట్ల ఒకరకమైన కసితో ఓ విధమైన ప్రతీకార భావనతో ఆలోచనా రహితంగా ప్రవర్తించాను.

కొంత వరకు కొన్ని అబద్ధాలు కూడా చెప్పాను.

నిజానికి ఇప్పుడు ఆలోచించుకుంటే ఆమె స్థానంలో నన్ను ఊహించుకుని విశ్లేషించుకుంటే తన తప్పేమీ లేదనే అనిపిస్తోంది.

అందరు ఉద్యోగస్తుల్లాగే నా భార్యకూ కాస్త వ్యక్తిత్వం పాలు ఎక్కువ.

నాది మధ్య తరగతి ఈగో నిండిన మగ మనస్తత్వం. నాది ప్రతి మూడేళ్ళకీ బదిలీ అయ్యే ఉద్యోగం పిల్లల చిన్నప్పుడు పెద్ద ఇబ్బందిగా అనిపించలేదుగాని వాళ్ళు హైస్కూల్‌కి వచ్చాక స్కూళ్ళు వెతుక్కోవడం మళ్ళీ కొత్తవాతావరణం, నాతో పాటు తన ట్రాన్స్ఫర్ కూడా చేయించుకోడం ఇవన్నీ వేగలేక నాభార్య పిల్లలతో పాటు ఉండటానికి నిశ్చయించుకుంది.

అక్కడమొదలైంది అసలు కథ.

"నీ ఉద్యోగం లేకపోతే గడవదా? ఉద్యోగం మానేసి రావచ్చుగా......." అంటూ ఆరంభించి

"పిల్లలని ఎక్కడైనా హాస్టల్ లో చేర్చుదాం, లేదంటే మీ అమ్మను వచ్చి వాళ్ళ దగ్గరవుండమను "

అంటూ మొదలు పెట్టాను. నా సౌకర్యాల కోసం భార్య ఉద్యోగం, పిల్లల చదువులు తృణప్రాయంగా ఆలోచించడం ఎంత అమానుషమో ఇప్పుడు అర్ధమవుతోంది.

కాని ఒక విచక్షణా రహిత సమయంలో నా ఒక్కడి లాలస కోసం తనకు విడాకులిచ్చి ఎవరినైనా పెళ్ళాడదలచుకున్నాను. అదీ నాకు నచ్చి నన్ను చేసుకునేందుకు ఒప్పుకునే వాళ్ళు దొరికాకనే.

ఇప్పుడు నీముందు ఇలా నన్ను నేను నగ్నంగా విశ్లేషించుకో గలగడం దానికి కారణం నీ ఔన్నత్యమే.

పిల్లలకు తల్లి అవసరం అందులోనూ ఆడపిల్లలకు తల్లితో పాటు తండ్రి అవసరం నువ్వు తెలియజెప్పాక కూడా మరోసారి ఆలోచించాను. నిన్నూ నీ స్నేహాన్నీ వదులుకోవడం ఎంత బాధాకరమన్నది అర్ధం చేసుకున్న వాళ్ళకే అర్ధమవుతుంది.

కాని కాంప్రమైజ్ అనేది నీ దగ్గరే నేర్చుకున్నాను. వ్యక్తిత్వాన్ని వదులుకోకుండా రాజీ పడటమెలాగో నీ ద్వారా తెలుసుకున్నాను.

విషాదంలోనూ సజీవత ఏమిటో నిన్ను చూశాక అర్ధమయింది.

"నా మూలంగా ఏ ఒక్కరూ బాధ పడకూడదని ఎన్నో సార్లు నువ్వన్నాక, నేనొక్కసారీ ఇలా ఎందుకు ఆలోచించ లేకపోయానని నాకనిపించింది.

నాభార్య నా పిల్లలు -మనసునిండా పొంగిపొర్లే భయంతో -అదీ నేను నీ గురించి మాటిమాటికీ చెప్పడం వల్ల కావచ్చు నానించి కోరినది ఒక్కటే. ఎట్టిపరిస్థితుల్లోనూ నేను నీతో కాంటాక్ట్‌లో వుండరాదు.

నాకు తెలుసు నీ ఎల్లలు లేని ప్రేమ తత్వానికి నేనెక్కడ దాసోహమంటానోనని వాళ్ళ భయం.

రాజీ యత్నంలో నాట్రాన్స్ఫర్ ప్రయత్నం సఫలీకృతమైంది. ఇప్పుడు మేమంతా కలిసేఉన్నాము. పిల్లలకు పెళ్ళి సంబంధాలు చూస్తున్నాము.

ఏదేమైనా చెప్పినా మానినా ప్రతి క్షణం నీ జ్ఞాపకం నీ మేలు తలుచుకోకుండావుండలేను.

నీలా స్థిత ప్రజ్ఞత సాధించటం మామూలు విషయం కాదు.

సదా నీకు ఋణపడేవుంటాను.

ఎప్పటికీ మానసికంగా

నీ

*విపుల్*

ఉత్తరం చదివి కాస్సేపు ఇది అని చెప్పలేని ఉద్విగ్నతకు లోనయ్యింది.

అంతలోనే సర్దుకుని "ఆల్ ద బెస్ట్ " అని ఎసెమెస్ పంపింది.

✡ ✡ ✡

ఆదివారం!

అయినా ఇప్పుడు వసంతకు ఆదివారమా సోమవారమా అనేది పెద్ద తేడా లేదు. కాని ఈ ఆదివారానికి పెద్ద ప్రత్యేకతేవుంది.

మిత్రులంతా కలిసి చాలా రోజులైంది. చాలామటుకు వర్కింగ్ కాబట్టి ఆదివారం తప్ప కలుసుకోలేరు. అందుకే ఆదివారం గెట్ టుగెదర్ ఏర్పాటు చేసింది వసంత.

ముందు ఇంట్లోనే కలుద్దామన్నా వంటా వార్పులు ఇలాంటి వాటితో నీ అమూల్యమైన సమయాన్ని దుర్వినియోగపరచడం మాకు సమ్మతం కాదు ఎక్కడైనా రెస్టారెంట్‌కి వెళదామని మిత్రులు ప్రపోజ్ చేసారు.

మళ్ళీ కొందరు అక్కడ చాలా నార్మల్‌గా వుంటుంది, కాబట్టి ఇంట్లోనే కలుసుకుందాం కాని ఫుడ్ మాత్రం ఆర్డరిచ్చి హోం డెలివరీ తెచ్చుకుందామన్నారు.

చివరికి ఆ ఒప్పందం ప్రకారమే అందరూ రాబోతున్నారు.

చాలా సంవత్సరాల తరువాత మళ్ళీ పార్టీ కోసం ఇంటి డెకొరేషన్ మీద శ్రద్ధ కనబరచడం, వేజ్‌లో గులాబీలఅమరికా, కొత్త కర్టెన్స్ మళ్ళీ ఇంటికి మునపటి కళ వచ్చినట్టుగానే తోచింది.

పది దాటాకముందే అనుకున్న ప్రకారం వచ్చేసారు ఆమె స్నేహితులు - ముఖ్యంగా హితులు.

అందరినీ చిరునవ్వుతో రిసీవ్ చేసుకుని ఆరెంజ్ జ్యూస్ ఆఫర్ చేసింది.

యామిని, స్వప్నిక, పద్మ, శ్రీ లత అందరూ ముక్త కంఠంతో అడిగినది ఒక్కటే - ఇన్ని కథలు ఇన్ని నవలలు ఇలా పుంఖానుపుంఖాలుగా ఎలా వ్రాయగలుగుతున్నావు? అని.

"టూ సింపుల్.. ఇది వరలో నేనొక్క వసంత గానే బ్రతికేదాన్ని ఇప్పుడు ప్రతి రచనలో ప్రతి పాత్రలో జీవిస్తున్నాను..అంతే "

"మళ్ళీ పాత రోజులు తిరిగి వచ్చినట్టుగానే వున్నాయి వసూ... కాదంటే ఏమనుకోనంటే ఒక్క శ్రీ లేని లోటు తప్పించి.." యామిని అంది.

"ఇది మరీ బాగుంది శ్రీ లేని లోటు నువ్వు ఫీలయితే నేనేమనుకుంటాను... ప్చ్! ఈ మాట శ్రీ ఉన్నప్పుడు మీ ఆయనముందు చెపితే ఎంత బాగుండేది..." పెదవుల వెనక నవ్వు బిగబట్టి జవాబిచ్చింది వసంత.

"ఇదిగో నువ్విలా ప్రతిమాటాకూ అల్లరి చెయ్యడం బాగాలేదమ్మాయ్ "

"నాకు బాగానేవుంది.. మీరు బెదిరిపోకపోతే... శ్రీ ఇక్కడే వున్నాడు అదిగో." ఎప్పటిలా తన స్లీవ్స్ పైకి లాక్కుని వేజ్‌లో ఫ్లవర్స్ సరిచేస్తూ ...

"ఈ పిల్లకు మరీ బొత్తిగా భయం భక్తి లేకుండా పోయాయి..."

ఆహ్లాదకరంగా సాగిన సంభాషణలో వసంతను ఎవరూ నెగ్గుకు రాలేకపోయారు.

సరిగ్గా లంచ్ ఆరంభించబోయే సమయంలోనే సుమంత్ ఫోన్.

స్పీకర్ ఆన్ చేసి మరీ విన్నారు.

"అమ్మా నీకేదో దివ్యదృష్టి వుండివుండాలి. మేం కలలోకూడా అనుకోలేదు..ఇదిగో ఇప్పుడు డాక్టర్ దగ్గరే ఉన్నాము ..నీకోరిక ప్రకారం నువ్వు నానమ్మవు కాబోతున్నావు.. ఒక్క క్షణం రోషిణి మాట్లాడుతుందటా ...

ఆంటీ విన్నారుగా మీ అభీష్టం సిద్ధిస్తోంది"

సంతోషంతో తబ్బిబ్బయింది వసంత.

"మీ హాప్పినెస్సే మాకానందం .."అంటూ జాగ్రత్తలు చెప్పింది" ఇవ్వాళ ఆంటీస్ అందరితో ఇంట్లో గెట్ టుగెదర్ అందరూ చాలా చాలా హాప్పీగా అభినందనలు చెపుతున్నారు " అని తెలియ జేసింది.

"ఓకే. కారీ ఆన్ మళ్ళీ కాల్ చేస్తాను"

"శుభాలు కూడా జంటగానే వస్తాయి" ఆ మాట పూర్తయిందో లేదో మరో కాల్,

వసంత సీరియల్ పడమట సూర్యోదయం సినిమా హక్కులు కొనుక్కుందుకు పేరున్న నిర్మాత ఆఫర్ అది.

సంభ్రమాశ్చర్యాలతో ఏం చెప్పాలో అర్థం కాలేదు వసంతకు.

"సాయంత్రం మీరు టైం ఇస్తే మాట్లాడుకుని అగ్రిమెంట్ వ్రాసుకుందాం. ఆరింటికి రమ్మంటారా? "

"అల్లాగే రండి" అనాలోచితంగానే జవాబిచ్చింది.

"నాకిదంతా కలలానే అనిపిస్తోంది"

"కాదు వసంతా, నీ కృషి, నీ పట్టుదల నీ ఆత్మవిశ్వాసానికి ప్రతిఫలం. నీ నిస్సహాయతను జయించడమే కాకుండా నిన్ను నువ్వు జయించుకున్నావు అందుకే ఈ పురోగతి... "

"ఓకే. ఈ శుభ సందర్భంగా ముందుగా స్వీట్స్ ఆరగించి ..." స్వప్నిక మాటలు మధ్యలోనే ఆపేస్తూ,

"ఏం తీపి మీదకు మనసు పోతోంది ఈ మధ్య పుటాన్ చేసిన వెయిట్ చాలదా" అడిగింది పద్మ...

"ఉండనీ వోయ్, మన పెద్దలు అననే అన్నారు తిండి కలిగితె కండకలదోయ్ కండకలవాడేను మనిషోయ్ అని"

"మరేం బాధలేదు, మన రచయిత్రి వుండనేవుందిగా కొత్త కొత్త పరిష్కారాలు చెప్పడానికి"

"ఈ మధ్య రచయిత్రి గారికే స్విమ్మింగ్ మీద శ్రద్ధ తగ్గినట్టుంది."

"నిజమేనే ఈ కంప్యూటర్‌కి అలవాటు పడ్డక ఎక్కడలేని టైం అదే మింగేస్తోంది. ఎలాగైనా నాకోసం నేను కాస్త సమయం కేటాయించుకోవాలి"

సాయంత్రం వరకు ఆటలు పాటలతో గడిచిపోయింది. ఒక్కొక్కరి అనుభవాలను నెమరువేసుకోవడం..

సరదాగా పాటలు

వెళతామన్న వాళ్ళని ఆగమని అడిగింది వసంత.

"సినిమా ప్రొడ్యూసర్ వస్తానన్నాడుగా మీరంతావుంటే గాని నేనొక్కదాన్నీ ఏమీ మాట్లాడలేనని" చెప్పేసింది.

సాయంత్రం ఆరంభమయిన మాటలు ముగిసేసరికి రాత్రి ఎనిమిది దాటింది.

ముందు నవలను ఎందుకు ఎంచుకున్నారు, ఎప్పటిలోగా సినిమా తీస్తారు లాంటి వన్నీ చర్చించి చివరకు వాళ్ళకున్నా ఆసక్తిని కాష్ చేసుకుంటూ బేరసారాలు మొదలు పెట్టి యాభై వేలతో ఆరంభమైన ఆఫర్ చివరకు రెండు లక్షల వద్ద ముగిసి అగ్రిమెంట్ వ్రాసుకుని అడ్వాన్స్‌గా సగం చెక్కు కూడా ఇచ్చారు.

అప్పుడిక మళ్ళీ సెలెబ్రేషన్ అంటూ ఇళ్ళకు ఫోన్ లు చేసి అందరూ కలిసి బ్లూ మూన్ కి డిన్నర్ కి వెళ్ళారు.

✡✡✡

## 12

**ఇంకా నిజమేనా కలా అనిపిస్తోంది.**

నవలలోని పాత్రలు సజీవంగా తెరమీద చూసుకున్న సంభ్రమం నుంచే ఇంకా కోలుకోలేదు, తెల్లవారితే ఉగాది.

కథకు నంది అవార్డ్ అందుకోవడం... ఏమో..!

మనసులో కలవరంగా కూడా ఉంది.

ఇంట్లో పాత జ్ఞాపకాలకు సంబంధించిన వస్తువులన్నీ మార్చేసుకుంది. శ్రీ ఫోటోలు కూడా ఎక్కడో లోపల పెట్టేసింది. గతం మరచి వర్తమానంలో బ్రతకాలన్న ఆకాంక్షతో.

కాని మనసు మాత్రం ఎవరి ఆధీనంలోనూ ఉండదే..

నిన్న రాత్రి అవార్డ్‌ల ప్రకటన జరిగినప్పటినుండి మనసు అన్యమనస్కంగానే ఉంది. ఒకరి కొకరు అనుకుని జీవితాలను పంచుకున్న శ్రీ ఈ పురోగతిని చూసి ఆనందించేందుకు లేడే అన్న వేదన ఒక పక్క, మరో పక్క అసలు శ్రీ ఉండివుంటే ఇలా రచన వైపు తనదృష్టి మళ్ళేదే కాదేమో నన్న సందేహం మరో వంక.

ఏదేమైన శ్రీలేని నిజం మళ్ళీ తట్టుకోలేనంతగా బాధిస్తోంది. అలాగని పైకి చెప్పుకోలేని పరిస్థితి. ఆర్నెల్లలో ఇంత పురోగమనం సాధ్యమా? సాధ్యమే అనేది కనిపిస్తూనే ఉంది. పేరున్న పత్రికలలో సీరియల్స్ వస్తూనే ఉన్నాయి.. రచనా వ్యాసంగం నిరంతరాయంగా సాగుతూనే ఉంది.

కొత్త ఊహలు కొత్త భావాలు వరద వెల్లువలా వస్తూనే ఉన్నాయి.

ఇదివరలోలా కాకుండా వసంత కూడా రచన ఒక ఉద్యోగంలా భావించి ఉదయం తొమ్మిదింటికల్లా గంట లంచ్‌తో పాటు ఓ చిన్న విరామం సరిగ్గా పదంటే పది నిమిషాలే...

ఒకసారి రాయడం ఆరంభిస్తే మళ్ళీ రాత్రి ఏడింటి వరకూ...

ఒక క్రమ పద్ధతిలో సాగిపోతోంది.

"నేను ప్రొఫెషనల్ రచయిత్రిని. సమయ పాలన చాలా అవసరం" అని తనకు తాను చెప్పుకునేది.

ఇహ ప్రభాకర్ ఆఫీస్‌కి వెళ్ళడం పూర్తిగా తగ్గించివేసినా గౌరవ సంపాదకురాలిగా అతను తనపేరే ఉంచుకోవడం ఆశ్చర్యం కలిగించేది.

రాత్రంతా నిద్రలేదు. ఉదయం లేస్తూనే ఫోన్ కాల్స్‌కి ఒక అంతం లేదు.

వార్త చూసిన ప్రతి వాళ్ళూ ఫోన్ చేసి అభినందించడమే.

గొప్ప సంతోషంగా ఉంది ఏదో సాధించానన్న సంతృప్తి.

ఈ లోగా టీవీ నైన్ వాళ్ళ ఫోన్... మీ ఇంట్లోనే రికార్డ్ చేసుకుంటాం - ఎప్పుడు రమ్మంటారని... "అంత ఎక్స్పోజర్ అవసరమా అని" ఓ పక్క సంకోచం..

కూతురు - అల్లుడు, కొడుకూ - రోష్ని అభినందనలు తెలియజేసారు.

"అమ్మా నేను ఏదో ఒకరోజు నీ కథతో తీసిన సినిమాలో నటిస్తానేమో" సుమంత్ మాటలు తియ్యగా అనిపించాయి.

సుమ కూడా చాలా సంబరపడింది"--నా కూతురికి అన్నీ నీ పోలికలే, వద్దన్నా ఇరవై నాలుగ్గంటలూ ఏవో కథలు చెపుతూనే ఉంటుంది."

సమయం గడిచే కొద్దీ పెద్ద టెన్షన్‌గా ఉంది ఇంటర్వ్యూ అంటారు ఏం అడుగుతారో ఏమిటో కాదంటే గర్వమని అనుకుంటారు అవునంటే ఏం అడిగి ఇరకాటంలో పెడతారో... "మరీ అంతగా కంగారు వద్దులే వసంతా. ఆ సమయానికి ఏది తోస్తే అది చెప్పెయ్యి" కాస్త స్థిమిత పరుస్తున్నట్టు చెప్పాడు చైతన్య.

అదే పెద్ద అనునయంగా అనిపించి అతని వంక కృతజ్ఞతగా చూసింది.

మధ్యాహ్నం లంచ్ ముగించి ఐదు నిమిషాలు రెస్ట్ తీసుకుందామనుకునేలోగా వచ్చారు కెమేరా మిగతా రికార్డింగ్ సరంజామాతో టీవీ నైన్  జనాలు..

వాళ్ళ ఏర్పాట్లు ముగిసి ముందుగా పూల మొక్కలు ఇంటి వాతావరణం వీడియో తీసుకున్నాక ఇంటర్వ్యూ ఆరంభించారు.

"ఈ అవార్డ్ రావడం గురించి ఎలా ఫీలవుతున్నారు?"

దట్టంగా మేకప్ వేసుకుని పెదవుల మీద చిరునవ్వులు అతికించుకున్న అమ్మాయి ప్రశ్నించటం ఆరంభించింది.

ముందు మామూలుగా చదువు సంధ్యల గురించి బాల్యం గురించి చాలా కాజ్యువల్‌గా అడిగేసరికి అమ్మయ్య అనుకుని కాస్త రిలాక్సయ్యింది వసంత.

అప్పుడు వచ్చింది తూటాలా నవల గురించి ప్రశ్న.

"మీ కథ ఉన్నది ఉన్నట్టుగా ఒక్క అక్షరం మార్చకుండా సినిమా తీసారు అది మీకు గర్వంగా ఉందా?"

దగ్గర మొదలై

"ఈ పాత్రకు వసంత పేరు అదే మీ పేరే ఎందుకు పెట్టుకున్నారు?" అని అడిగే వరకూ వచ్చింది.

ఏ పేరైనా పెట్టుకుంటాను మీకెందుకు అనాలనిపించినా

"నాకా పేరు చాలా ఇష్టం.. ఏం? పెట్టుకోకూడదా?" నవ్వుతూనే అడిగింది.

"ముగింపూ ఓ పరిష్కారమంటూ చూపకుండా వసంత పాత్రను అలా నాలుగు రోడ్ల కూడలిలో వదిలేసినట్టు సింబాలిక్‌గా చూపించటం ఎంత వరకూ సమంజసం? రచయిత్రిగా మీ బాధ్యత అంతేనా.. సమస్యలు సంఘర్షణలు ఎత్తి చూపటం వరకేనా?"

ప్రశ్న తీవ్రతకు కలవరపడింది వసంత.

"రచయిత్రి సమస్యలన్నింటికీ పరిష్కారాలు చూపాలన్న రూల్ ఎక్కడయినా ఉందా? ఒక వ్యవస్థ లోటుపాట్లను ప్రస్తుత పరిస్థితుల్లో వాటికున్న రకరకాల విధానాలను సుసాధ్యపడే పరిష్కారాలను నామ మాత్రంగా సూచించగలే గాని మేమెవరమండీ ఇదే నీ దారి అని చూపడానికి లేదా తప్పు చేసిన వాళ్ళను దండించమని గొంతు చించుకోడానికి పరిష్కారాలు అనేవి వ్యక్తిగతం. ఎవరికి వీలయిన పరిష్కారాన్ని వాళ్ళూ అమలు చేసుకుంటారు."

కాస్త ఆవేశంగానే మాట్లాడింది వసంత.

ఆ వేడిలోనే మరో ప్రశ్న వచ్చి తగిలింది.

"ఇది మీ కథేనని చాలామంది అనుకుంటున్నారు? దానికి మీ జవాబు..."

"ఇది మరీ బాగుంది? వ్రాసిన ప్రతి రచనలో ప్రతి పాత్రా నేను ఎలాగ అవగలను చెప్పండి? కాదంటే ప్రతి పాత్రలో నన్ను నేను ఇముడ్చుకుని రాస్తాను గనక అలా అనిపిస్తుండవచ్చు.."

"పాఠకులకు పది పరిష్కారాలు చూపించి ఎన్నుకోమని వదిలేసారు.. మరి మీ స్వంత విషయాల గురించి చెప్పరేం..."

"చెప్పేందుకేం ఉంది.. అందరికీ తెలుసు మా అబ్బాయి సుమంత్ సినిమా హీరో అతని భార్య రోష్ణి పేరున్న హీరోయిన్.. అమ్మాయి అమెరికన్‌ని పెళ్ళి చేసుకుని అమెరికాలో స్థిరపడింది.."

"మరి మీరు?"

"నా రచనలు నేను.."

"ఆదర్శాలు చెప్పేందుకే గాని ఆచరణకోసం కాదా? మీరు మళ్ళీ పెళ్ళెందుకు చేసుకోలేదు?"

"ఎవరు చెప్పారు పెళ్ళి చేసుకోలేదని.. ఏడు నెలల క్రితమే మా పెళ్ళి జరిగింది..." చటుక్కున మంగళ సూత్రం గొలుసు బయటకు లాగి కొత్త సూత్రాలను చూపుతూ

"మా పెళ్ళి జరిగినట్టు లోకానికి ప్రకటించుకోవాలా! నాకూ చైతన్యకూ అది ఇష్టం లేదు.. ఓకె నో మోర్ క్వొశ్చెన్స్" అంటూ లేచి లోపలకు వెళ్ళిపోయింది వసంత.

ఆశ్చర్యంతో నివ్వెరపడి నిల్చున్న వారందరినీ వదిలేసి.

✡ ✡ ✡

*"పడమట సూర్యోదయం" రచనకు పూర్తి స్ఫూర్తి నిచ్చింది కిరణ్‌ప్రభగారు. సీరియల్ రాయమని సూచించడం కథ క్లుప్తంగా చెప్పినప్పుడు వెంటనే అంగీకరించడం - ఈ రచన క్రెడిట్ అంతా ఆయనకే చెందుతుంది.*

*ఇక నవల విషయానికి వస్తే ఇది కాస్త ప్రయోగాత్మకంగా వ్రాసిన నవల. మానసిక సంఘర్షణకు ప్రాధాన్యతనిస్తూ ప్రస్తుత కాల పరిస్థితుల్లో స్త్రీలు ఏ వయసులో ఉన్నా ఎదుర్కొంటున్న సమస్యలు ప్రస్తావించటమే ముఖ్యోద్దేశ్యం. ఇది కథాపరమైన నవల కాదు. పరిష్కారం అనేది ఎవరికి వాళ్ళు ఆలోచించుకోవలసినది.*

*ఈ నవల ఏడాది పాటు ప్రచురించిన కిరణ్‌ప్రభగారికి, ఆదరించిన కౌముది పాఠకులకు కృతజ్ఞతాభివందనాలతో..*

స్వాతి శ్రీపాద

✡ ✡ ✡

(అయిపోయింది)